సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 346

గురువారం 7-3-2024



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రేపు ఉమెన్స్ డే

ఆర్థిక స్వాతంత్ర్యం అంటే?

స్త్రీలు సంపాదనపరులైతే ఏమవుతుంది?
ఆర్థికంగా సమృద్ధి సాధిస్తే ఏమవుతుంది?
తమ జీవితాలపై అధికారం వస్తుంది.
కీలక నిర్ణయాలప్పుడు
గొంతెత్తే ఆత్మవిశ్వాసం వస్తుంది.
తమకు ఏ హక్కులు రక్షణ ఇస్తాయో
ఎరుక కలుగుతుంది.
స్త్రీ ఇవన్నీ కుటుంబ సంక్షేమానికే
వెచ్చిస్తుంది.
స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం ఇంటా, బయటా
స్త్రీ, పురుషుల సమ భాగస్వామ్యాన్ని
ప్రతిపాదిస్తుంది.
కాని స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యానికి
ఇంకా ఎంతో చైతన్యం కావాలి.

జీవితంపై అధికారం హక్కులపై ఎరుక

స్త్రీలు సాధికారత పొందటం అంటే ఏమిటి? పరాధీనత నుంచి బయటపడటమే. అంటే? మరొకరు తనను పోషించే స్థితి నుంచి బయటపడటమే. తండ్రి, భర్త, కుమారుడి సంపాదన వల్ల మాత్రమే జీవితం గడుస్తూ ఉంటే కనుక ఆ పరాధీనత నుంచి బయట పడటం. అంటే బంధం నుంచి బయటపడటం కాదు. స్థితి నుంచి మాత్రమే. స్త్రీలు సాధికారత ఎప్పుడు పొందుతారంటే ఆర్థికంగా వారు స్వేచ్ఛ పొందినప్పుడు. స్త్రీలకు సామాజికంగా, కుటుంబపరంగా హక్కులు ఉంటాయి. అయితే ఆ హక్కులను దక్కించుకోవాలంటే వారికి ఆర్థిక ఆత్మవిశ్వాసం ఉండాలి.

పుట్టుక నుంచే

స్త్రీలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలనే భావన ఆడపిల్లలు పుట్టినప్పటి నుంచే తీసివేయడం నేటికీ జరుగుతోంది. 'ఎవరో ఒక అయ్య చేతిలో పెట్టడానికి' అనుకునే తల్లిదండ్రులు, భర్త సంపాదన వల్ల మాత్రమే ఆమె బతకాలనుకునే తల్లిదండ్రులు ఆమె చదువును నిర్లక్ష్యం చేయడం గ్రామీణ భారతంలో నేటికీ జరుగుతూనే ఉంది. ఆడపిల్లకు ఆస్తిపాస్తులు ఇచ్చినా చదువు వల్ల వచ్చే, ఆమెకై ఎంచుకునే ఉపాధి నుంచి వచ్చే సంపాదన కలిగించే ఆత్మవిశ్వాసం వేరు. స్త్రీలను 'అదుపులో ఉంచడం' అంటే వారిని ఆర్థిక వనరుల నుంచి దూరంగా పెట్టడమే. పోపుల డబ్బాలో కొద్దిపాటి చిల్లరకే ఆమె హక్కుదారు. దానివల్ల న్యూనతతో ఉండాలి. కుటుంబంలో ముఖ్యమైన నిర్ణయాల సమయంలో భర్త/తండ్రి/కుమారుడి మాట చెల్లుబాటు కావడానికి కారణం వారు 'ఆర్థిక వనరులు కలిగి ఉండటం'. 'రూపాయి సంపాదన లేని దానివి నువ్వు కూడా మాట్లాడేదానివేనా' అని స్త్రీలను పరోక్షంగా అనడం. అదే ఆమెకు సంపాదన ఉంటే నా వల్ల కూడా కుటుంబం నడుస్తోంది కాబట్టి కుటుంబ సంక్షేమం కోసం నా పాయింట్ చెప్పాల్సిందే అని అనగలదు. కుటుంబపరంగా, సామాజికంగా తన జీవితం ఏ విధంగా గడవాలని స్త్రీ ఆశిస్తుందో ఆ నిర్ణయాన్ని వెల్లడించే శక్తి ఆర్థిక స్వావలంబన వల్ల కలుగుతుంది. ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం. అందుకు చదువు ముఖ్య సాధనం.

సాధికారత అంటే?

స్త్రీలు సాధికారత పొందాలంటే వారి ఆకాంక్షలకు సమాజం ఆమోదం తెలపాల్సిందే. ఒక స్త్రీ అంట్రప్రెన్యూర్ కావాలనుకున్నా, పెద్ద పెద్ద సంస్థల్లో నాయకత్వ స్థానానికి ఎదగాలనుకున్నా, కాన్పు సమయంలో బ్రేక్ తీసుకుని నాలుగైదేళ్ల తర్వాత తిరిగి తన ఉద్యోగం చేయాలని అనుకున్నా, పెళ్లి తర్వాత పై చదువులకు వెళ్లాలనుకున్నా, గృహిణిగా ఉంటూ ఇంటిపట్టునే ఏదైనా పనిచేసి సంపాదించాలనుకున్నా వారికి అడ్డుగా నిలవకపోవడమే చేయవలసింది. ఒక అధ్యయనం ప్రకారం స్త్రీలు తమ సంపాదనలో 90 శాతం కుటుంబం కోసం ఖర్చు పెడతారు. పురుషులు నలభై-యాభై శాతం ఖర్చు పెడతారు. స్త్రీలు సాధికారత పొందడం అంటే తాము ఏం చేసినా పడి ఉంటుందనే భావన నుంచి పురుషులను బయట పడేయడం. ఎక్కువ తక్కువ లేని గౌరవ బంధాలను ప్రతిపాదించడం.

ఆర్థిక అక్షరాస్యత

స్త్రీలు సాధికారత, ఆర్థిక స్వావలంబన పొందాలంటే ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి. ముఖ్యంగా దిగువ, మధ్యతరగతి స్త్రీలకు ఆర్థిక అక్షరాస్యతను కలిగించాలి. వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ బడ్జెట్, పొదుపు, ఆదాయం తెచ్చే పెట్టుబడి... వీటి గురించి అవగాహన ఉండాలి. 'మీ జీవితం మీ చేతుల్లో ఉండాలంటే' మీ దగ్గర ఎంత డబ్బు ఉండాలి... అందుకు ఏమి చేయాలో తెలుసుకోవాలి. సొంత ఆస్తి, స్వీయపేరు మీద పాలసీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, షేర్లు, ఎమర్జన్సీ ఫండ్ కలిగి ఉండటం, డిజిటల్ పరిజ్ఞానం పొంది ఉండటం- అంటే ఆర్థిక లావాదేవీలు ఫోన్‌మీద, కంప్యూటర్ మీద చేయగలిగి వేగంగా పనులు నిర్వర్తించ గలగడం.

కుటుంబ సౌభాగ్యమే దేశ సౌభాగ్యం అనుకుంటే కుటుంబంలో కీలకమైన వాటాదారైన స్త్రీ ఎంత ఆర్థిక సమృద్ధితో ఉంటే దేశ సమృద్ధి అంతగా పెరుగుతుంది. ఉమెన్స్ డే సందేశం అదే.

వినూత్నం

రోబో టీచరమ్మ





సినిమాల్లో హ్యూమనాయిడ్ రోబోను చూడగానే
పిల్లల సంతోషం ఇంతా అంతా కాదు.
సినిమాల్లో కనిపించే రోబో క్లాస్‌రూమ్‌లోకి
అడుగు పెడితే?
'అబ్బో! ఆ అల్లరికి అంతు ఉండదు' అనుకుంటాం.
అయితే 'ఐరిష్' అనే ఈ రోబో ముందు మాత్రం పిల్లలు
బుద్ధిగా, సైలెంట్‌గా ఉండాల్సిందే.
ఇంతకూ ఎవరీ ఐరిష్?

కేరళలోని తిరువనంతపురం కేటీసీటీ హైయర్ సెకండరీ స్కూల్ లోకి ఫస్ట్ జెనరేటివ్ ఏఐ స్కూల్ టీచర్ ఐరిష్ అడుగు పెట్టింది. ఈ హ్యూమనాయిడ్ ఉపాధ్యాయురాలు మూడు భాషల్లో మాట్లాడగలదు. విద్యార్థులు అడిగే ప్రశ్నలకు స్పష్టంగా జవాబులు చెప్పగలదు.

ఎడ్‌టెక్ 'మేకర్‌ల్యాబ్స్' రూపకల్పన చేసిన ఈ జెనరేటివ్ ఏఐ స్కూల్ టీచర్ కేరళలోనే కాదు దేశంలోనే మొదటిది.

'ఐరిష్ నాలెడ్జ్‌బేస్ ఇతర ఆటోమేటెడ్ టీచింగ్ టూల్స్ కంటే విస్తృతంగా ఉంటుంది. ఎందుకంటే ఇది జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనిచేస్తుంది' అంటుంది మేకర్ ల్యాబ్స్.

చదువుకు సంబంధం లేని సబ్జెక్ట్‌ల జోలికి 'ఐరిష్' వెళ్లదు.

'కృత్రిమ మేధతో అవకాశాలు అనంతం అని చెప్పడానికి ఐరిష్ ఒక ఉదాహరణ. పిల్లలు అడిగే సందేహాలకు టీచర్‌లాగే ఐరిష్ సరియైన సమాధానాలు ఇవ్వగలదు' అంటున్నారు 'మేకర్‌ల్యాబ్స్' సీయీవో హరిసాగర్.

'మేకర్‌ల్యాబ్స్‌తో కలిసి ఎన్నో రకాల వర్క్‌షాప్‌లు నిర్వహించాం. వీటి ద్వారా పిల్లలు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3డీ ప్రింటింగ్‌కు సంబంధించిన నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారు' అంటున్నారు స్కూల్ ప్రిన్సిపాల్ మీరా ఎంఎన్.

స్టార్టప్ దిశగా అంకురం!



విద్యార్థులకు సర్టిఫికేట్ ప్రదానం చేస్తున్న డాక్టర్ గీతారెడ్డి

సమాజం మారాలి... సమాజంలో మార్పు రావాలి.
సమాజంలో మార్పు తేవాలి. ఈ ప్రసంగాలు వింటూనే ఉంటాం.
మారాలని అందరూ కోరుకుంటారు.
మార్పు కోసం ఏం చేయాలో తెలిసిన వాళ్లెందరు?
సమాజం మారాలంటే ఏం చేయాలో తెలిసి ఉండాలి.
ఆ మార్పు మనతోనే మొదలు... అనుకోవాలి.
మార్పు దిశగా తొలి అడుగు వేయగలిగిన చొరవ ఉండాలి.
అలా డిజిటల్ ఎరాలోకి అడుగుపెట్టారు డాక్టర్ గీత.
తన పాదముద్రలతో అభివృద్ధి దారి చూపిస్తున్నారు.



మన సమాజం ఉద్యోగాలు వెతుక్కునే సమాజంగానే ఉండిపోవడానికి కారణం కూడా పెద్దవాళ్లు ఎప్పటికప్పుడు యువత ఆలోచనలను చిదిమేయడమే. పెద్దవాళ్ల కంటే యువత ఒక తరం ముందు ఉంటుంది. ఆలోచనలు కూడా అలాగే ఉంటాయి. ఆ ఆలోచనలకు ఒక అండ దొరికితే వాళ్లు అద్భుతాలు చేస్తారు.

– డాక్టర్ గీతారెడ్డి బోర.
ఫౌండర్, యష్మి సొల్యూషన్స్,
యష్మిత ఈ టెక్నాలజీస్,
ఛైర్‌పర్సన్, సీఐఎమ్ఎస్ఎమ్ఈ, ఆంధ్రప్రదేశ్

ఈ డిజిటల్ యుగంలో దాదాపుగా అందరూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లే. ఇలాంటి డిజిటల్ ఎరాను ముందుగానే ఊహించి సమాజాన్ని ప్రభావితం చేసిన సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ గీతాబోర. ప్రపంచదేశాలన్నీ ఒక తాటిమీదకు వచ్చి ఒకేరకమైన నైపుణ్యాలతో గ్లోబల్ వేదిక మీద పోటీ పడుతున్న తరుణంలో మన గ్రామీణ విద్యార్థుల్లో ఎంతమంది ఈ పోటీలో నిలవ గలుగుతున్నారనే ప్రశ్న వేసుకుని అందుకు సమాధానంగా కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్‌లో శిక్షణ అవసరాన్ని గుర్తించారామె. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ప్లేస్‌మెంట్ దొరక్క మిగిలిపోయిన పిల్లలు బీపీవోల్లో నైట్ షిఫ్ట్ ఉద్యోగాల్లో ఉపాధిని వెతుక్కోవాల్సి రావడం, క్రమంగా నైట్‌లైఫ్‌కు అలవాటు పడిపోవడం, యువశక్తి నిర్వీర్యం కావడంతోపాటు సమాజంలో చాపకింద నీరులా వ్యసనాలు విస్తరించడాన్ని గ్రహించారు. అలాగే చదువుకున్న ప్రతి ఒక్కరూ పట్టా చేతపట్టుకుని ఉద్యోగం కోసం ఎదురు చూడడం కాదు సొంతంగా తమను తాము నిరూపించుకునే ప్రయత్నం చేయాలని, స్టార్టప్ దిశగా నడవడానికి విద్యార్థి దశలోనే ఈ ఆలోచనకు అంకురం వేయాలని ఆలోచించారు. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ఉన్నత విద్యాశాఖ సమన్వయంతో సర్టిఫికేట్ కోర్సుకు రూపకల్పన చేశారు. సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా సమాజానికి తన కంట్రిబ్యూషన్ గురించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారామె.

''నేను పుట్టింది, పెరిగింది వైజాగ్‌లో. ఎంసీఏ తర్వాత హైదరాబాద్‌లో పన్నెండేళ్లపాటు ఉన్నాను. ఇప్పుడు నా కంపెనీ వ్యవహారాలు, సామాజిక వ్యవహారాలను వైజాగ్ నుంచే నిర్వహిస్తున్నాను. సమాజం మారాలని వేదికలెక్కి ఉపన్యాసాలివ్వడం కాదు, విద్యావ్యవస్థను గాడిలో పెడితే, యువత ఆలోచనలను అభివృద్ధి వైపు మరల్చినట్లయితే సమాజం దానంతట అదే మారుతుంది. సరిగ్గా నేను అదే చేస్తున్నాను. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 41 ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రసంగించి, నాలుగువందల మంది విద్యార్థులను ప్రభావితం చేయగలిగాను. వారిలో 150 మంది తమ సొంత ఆలోచనలతో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ వైపు అడుగులు వేస్తున్నారు. పెద్దవాళ్లు అనుభవం పేరుతో యువత ఆలోచనలకు పరిధులు విధిస్తుంటారు. ఇది చాలా తప్పు. యువత ఆలోచనలను బయటకు చెప్పగలిగేలా వాళ్లను ప్రోత్సహించాలి. పెద్దవాళ్లు ఎప్పుడూ యువత ఆలోచనలను కార్యరూపం దాల్చడానికి తమ అనుభవం నుంచి కొన్ని సూచనలు చేయవచ్చు. అంతేతప్ప యువత ఎలాంటి ఉపాధిని వెతుక్కోవాలనే ఆలోచనలు కూడా తామే చేయాలనుకోకూడదు. ఈ అంతరాన్ని పూడ్చడానికి నేను ప్రయత్నిస్తున్నాను. మెంటార్, రీసోర్స్ పర్సన్, మోటివేషనల్ స్పీకర్‌గా ఉన్నాను. చైల్డ్ అబ్యూజ్, మహిళల పట్ల వివక్ష, మహిళల కుటుంబ, వైవాహిక పరమైన చిక్కులకు న్యాయసలహాలతో కౌన్సెలింగ్ ఇస్తున్నాను. మా వైజాగ్‌లో భూబకాసురుల చేతిలో చిక్కుకున్న భూమి వివరాలను, ఒరిజినల్ డాక్యుమెంట్‌ల ఆధారాలను ప్రభుత్వానికి తెలియచేసి, బాధితులకు అండగా నిలిచాను. ఒక ఎంటర్‌ప్రెన్యూర్ ఉమన్‌గా సమాజానికి ఇస్తున్న సేవకుగాను 'నారీప్రెన్యూర్' గుర్తింపును అందుకున్నాను. ఇప్పుడు నా మీద మహిళల కోసం పని చేయాల్సిన బాధ్యత కూడా పెరిగింది. గ్రామీణ మహిళలను ఆర్థిక సాధికారత వైపు నడిపించడానికి కార్యక్రమాల మీద పని చేస్తున్నాను. పరిమితమైన వనరులు, సాధారణ విద్యార్హతలు కలిగిన గ్రామీణ మహిళ తన మేధను ఉపయోగించి ఎదగడానికి అవసరమైనట్లు శిక్షణ కార్యక్రమాలను రూపొందిస్తున్నాను. ఆడవాళ్లు అభ్యుదయ కోణంలో ఆలోచించనంత కాలం సమాజం అభివృద్ధి దిశగా నడవదు. అందుకే మహిళ మారాలి, ఆమె మారితే పిల్లల ఆలోచనలు మారుతాయి. ఆ భావితరం మనం కోరుకున్న సమాజాన్ని నిర్మిస్తుంది'' అన్నారు డాక్టర్ గీతారెడ్డి బోర.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

రేపు మహాశివరాత్రి

ఒక చైతన్య జాగృతి



చతుర్దశి నాడు మహాశివరాత్రిని భక్తులు శివుని జన్మదినంగా వైభవంగా జరుపుకుంటారు. ఇది హిందువులకు అత్యంత ప్రాధాన్యత గల పవిత్ర దినం. ప్రతి నెలా అమావాస్య ముందు వచ్చే బహుళ (రాత్రిగల) చతుర్దశినాడు మాసశివరాత్రిగా జరుపుకుంటారు.

పరమ శివునికి ఎంతో ప్రీతికరమైన శివరాత్రినాడు పగలంతా ఉపవాసం ఉండి, రోజంతా శివనామస్మరణతో గడుపుతూ, ప్రదోషవేళ శివుని అభిషేకించి, బిల్వదళాలతో పూజించాలి. అ రోజున శివాలయంలో దీపం వెలిగించడం వలన విశేష ఫలం లభిస్తుంది. ఉపవాసం, శివార్చన, జాగరణ.. ఈ మూడూ శివరాత్రినాడు ఆచరించవలసిన విధులు. ఉపవాసం అంటే దేవునికి అతి సమీపంలో వసించడం. మనం ఇంద్రియాలతో అనుభవిస్తున్నవన్నీ ఆహారాలే. వాటన్నింటికీ దూరంగా ఉండడమే నిజమైన నియంత్రణ. అదే నిజమైన ఉపవాసం. భౌతిక రుచులన్నింటినీ పక్కకు పెట్టి పూర్తిగా శివసంబంధమైన కార్యక్రమాల్లోనే త్రికరణ శుద్ధిగా తాదాత్మ్యం చెందాలి. భోగానందాన్ని విస్మరించి, యోగానందావస్థలోకి ప్రవేశిస్తూ కోటి వెలుగుల ఆ శివజ్యోతి ప్రకాశాన్ని అంతరంగంలో నింపుకొని సచ్చిదానందమైన ఆధ్యాత్మిక ప్రస్థానం చేయడమే మహాశివరాత్రి ఆంతర్యం. మహాశివరాత్రినాటి అర్ధరాత్రి సమయంలో శివలింగ ప్రాదుర్భావం జరుగుతుందంటారు. లింగం నిర్గుణోపాసనకు, శివస్వరూపం సగుణోపాసనకు సంకేతాలు.

శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి మాసశివరాత్రులు/మహాశివరాత్రినాడు రుద్రాభిషేకాలు శివార్చనలు, బిల్వార్చనలు జరపడం ఆయురారోగ్యైశ్వర్య ప్రదం. ప్రత్యేకించి శివునికి ప్రీతికరమైన సోమవారం నాడు ఉదయాన్నే నిత్యకర్మలు పూర్తిచేసి పగలంతా ఉపవాసం ఉండి సాయంకాలం శివారాధన చేసి నక్షత్రోదయ సమయాన ఈశ్వర నివేదితమైన ప్రసాదం తినడాన్ని నక్షత్ర వ్రతం అంటారు. సోమవారం 'ఇందుప్రదోషం'గా శివుని ఆరాధించడం విశేష ఫలప్రదమని శాస్త్ర వచనం.16 సోమవారాలు నియమ పూర్వకంగా చేస్తే గ్రహదోషాలు పోవడమే కాక సర్వాభీష్టాలు నెరవేరతాయి.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అందరికందరూ ఒకే రూపం అయినప్పటికీ, శివ రూపమే సనాతనం. ఇదే సకల రూపాలకు మూలం. సాక్షాత్తు శివుడు గుణాతీతుడు. కాలాతీతుడు. నిత్యుడు, అద్వితీయుడు, అనంతుడు, పూర్ణుడు, నిరంజనుడు, పరబ్రహ్మ పరమాత్మ.

గుణనిధి అనే ఒక దుర్వ్యసనపరుడు నేరం చేసిన భయంతో శివరాత్రినాడు శివాలయంలో శివుని వెనుక దాగున్నాడు. కొండెక్కుతున్న దీపం వత్తిని కాకతాళీయంగా ఎగదోసి, తన ఉత్తరీయపు కొంగులను చించి వత్తిగా చేసి దానికి జత చేసి ఆవునెయ్యి పోసి దీపప్రజ్వలనం కావించాడు.

తెల్లవార్లూ భయంతో మేలుకొని ఉండి తెల్లవారాక తలారి బాణపు దెబ్బకు మరణించాడు. బతుకంతా దుశ్శీలుడై నడచినా శివరాత్రినాడు దైవసన్నిధిలో ఉపవాసం, జాగరణ తనకు తెలియకుండానే చేసిన మహాపుణ్య ఫలితంగా మరుజన్మలో కళింగ రాజు అరిందముడికి పుత్రుడై జన్మించి దముడనే పేరుతో మహారాజై తన రాజ్యంలోని శివాలయాలన్నింటిలో అఖండ దీపారాధనలు చేయించి అపై కుబేరుడిగా జన్మించి ఉత్తర దిక్పాలకుడై శివుడికి ప్రాణసఖుడయ్యాడన్న కథ శ్రీనాథుడి కాశీఖండంలో ఉంది.

శ్రీరాముడు లంకపైకి దండెత్తే ముందు సాగరతీరంలో ఇసుకతో లింగం చేసి పూజించాడు. ఆ సైకతలింగ క్షేత్రమే నేటి రామేశ్వరం. లంకాధీశుడు తన పది తలలు కోసి శివుణ్ణి ప్రసన్నం చేసుకున్నది ఈ రోజునే అని చెబుతారు.

జాంబవతికి సత్సంతానాన్ని ప్రసాదించమని ఇదే రోజున శివుణ్ణి కృష్ణుడు ప్రార్థించాడనే కథనం వ్యాప్తిలో ఉంది. శివ అంటే శుభం, ఆనందం, మంగళం, కైవల్యం, శ్రేయం అని అర్థాలు. శివరాత్రివేళ అభిషేక ప్రియుడైన శివుడి పార్థివ లింగాన్ని మహాన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకంతో, నమక చమకాలతో, పురుష సూక్తంతో పూజిస్తారు. మొదటి జాములో పాలతో, రెండో జాములో పెరుగుతో, మూడో జాములో నెయ్యితో, నాలుగో జాములో తేనెతో అభిషేకిస్తారు. పరమశివునికి అత్యంత ప్రీతికరమైన బిల్వ పత్రాలతో శివార్చన చేసి, రుద్రాక్షమాలతో 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ శివపురాణ పారాయణ చేస్తారు.

– చిలకమర్తి ప్రభాకర చక్రవర్తి శర్మ,
ఆధ్యాత్మికవేత్త.

శివ తత్త్వం

శివతత్త్వం ఎవరికీ అంత సులువుగా అర్థమైనది కాదు. శివుని కన్నా పెద్దది గాని, చిన్నది గాని సాటి మరొకటి లేదనేది తత్త్వ సాధకులు మోక్ష సాధకులకు ఆశ్రయించదగ్గ ఏకైక రూపం శివస్వరూపం. శివతత్త్వంలోని నిగూఢమైనటువంటి విషయాలలో ప్రప్రథమమైనవి జ్యోతిర్లింగాలు. శివుడు ద్వాదశ జ్యోతిర్లింగ రూపాలలో ఉన్నాడని, ఇది శివతత్త్వంలో భాగమేనని జ్యోతిర్లింగమనగా చీకటిని, అజ్ఞానాన్ని తొలగించి వెలుగు (అనగా జ్ఞానము) ప్రసాదించేది అని జ్యోతిర్లింగాల తత్త్వం తెలియచేస్తుంది.

శివతత్త్వంలో మరొకటి లింగాకారం. శివ లింగాకారం పై భాగం లింగంగా కింద పానవట్టం యోని రూపంలో ప్రకృతీ పురుషుల ప్రతీకగా ప్రకృతీ పురుషులలో ఒకరు లేనిదే మరొకరు లేరు అని చెప్పేటటువంటి తత్త్వం. శివతత్త్వంలో మరొక తత్త్వం ప్రళయ తత్త్వం. ప్రళయతత్త్వం మూడు విధాలుగా ఉన్నది. రాత్రి సమయంలో నిద్ర ఇది ప్రళయ తత్త్వంలో ఒక భాగం (నిద్ర) ప్రాపంచిక మాయ నుండి మరపునిస్తుంది. రెండవది మరణం. ఇది స్థూల శరీరానికి సంబంధించినటువంటి ప్రళయం.

మూడవది మహా ప్రళయం. సమస్తం శివునిలో కలసిపోవటం. నాలుగవది త్రిమూర్తితత్త్వం (శివ, విష్ణు, బ్రహ్మ). శివుని నుండి విష్ణువు, విష్ణువు నుంచి బ్రహ్మ ఆవిర్భవించారనేది శాస్త్రం. బ్రహ్మ సృష్టిస్తే విష్ణువు నడిపించి శివుడు అంతం చేయటం లోకోక్తి. పంచభూతలింగాల తత్త్వం. పంచ భూతాలు అనగా అగ్ని, వాయువు, భూమి, ఆకాశం, జలం. అన్నిటిలోను శివుడున్నాడు అనేటటువంటి తత్త్వం. రుద్రతత్త్వం అంటే శివుడిని పూజించేటటువంటి పద్ధతి. రుద్రంలో మహన్యాసం, నమకం, చమకం అనే విధానం. మహన్యాసం అంటే చేసేది శివుడే, నీవు శివుడవే అని నిర్ధారిస్తుంది. శివతత్త్వంలో శివస్వరూపంలో దాగివున్న విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

శివరాత్రులు ఐదు రకాలు

1. **నిత్యశివరాత్రి:** ప్రతిరోజూ శివారాధన చేస్తారు.
2. **పక్ష శివరాత్రి :** ప్రతి మాసంలో శుక్ల, బహుళ పక్షాలలో వచ్చే చతుర్దశులలో శివార్చన చేయడం.
3. **మాస శివరాత్రి :** ప్రతి మాసంలో బహుళ చతుర్దశినాడు మాసశివరాత్రి.
4. **మహాశివరాత్రి :** మాఘ బహుళ చతుర్దశి నాటి సర్వశ్రేష్ఠమనదగిన శివరాత్రి.
5. **యోగ శివరాత్రి:** యోగులు యోగ సమాధిలో ఉండి చేసే శివచింతన.

ఆ రూపంలోనే అంతా!

శివుని తలపై గంగ ప్రవాహం ఒక తరం నుండి మరొక తరానికి జ్ఞానం ప్రసారమవుతుందని సూచిస్తుంది. శివుని తలపై చంద్రుడు భగవంతుడిపై ధ్యాస ఎల్లవేళలా ఉండాలని సూచిస్తుంది. శివునికి మూడో కన్ను చెడును, అజ్ఞాన నాశనాన్ని చూపిస్తుంది. శివుని వద్ద ఉన్న త్రిశూలం జ్ఞానం, కోరిక, అమలు అనేటటువంటి మూడింటి స్వరూపం. శివుని ఢమరుకం వేదగ్రంథాలు వేదస్వరాన్ని తెలియచేసే ఢమరుకం. శివుని మెడపై ఉన్న సర్పం అహం నియంత్రణను సూచిస్తుంది. శివుడు ధరించే రుద్రాక్ష స్వచ్ఛతను, ధరించే మాలలు ఏకాగ్రతనూ సూచిస్తాయి. నడుముకు చుట్టుకునే పులి చర్మం భయం లేనటువంటి తత్త్వాన్ని సూచిస్తుంది.

క్షీరసాగర మథన సమయంలో నిప్పులు చిమ్ముకుంటూ పెల్లుబికి వచ్చిన ఘోర కాకోల విషాగ్నుల నుంచి లోకాలను రక్షించవలసిందిగా దేవగణం వేడుకోగా, శివుడు ఆ గరళాన్ని తన గళాన నిలిపి ముల్లోకాలనూ కల్లోలం నుంచి కాపాడాడు. ఆ కాళరాత్రే శివరాత్రి. 'నిర్ణయసింధు'లోని నారద సంహితలో శివరాత్రి వ్రతవిధానం ఉంది. మార్కండేయుడు, నత్కీరుడు, సిరియాళుడు, చిరుతొండనంబి, తిన్నడు, శక్కనారు, అక్కమహాదేవి, బెజ్జ మహాదేవి వంటి ఎందరో శివభక్తుల అమేయ భక్తిగాథలు మనకు పురాణాల్లో కనిపిస్తాయి.


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురాకక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 346

గురువారం 7-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



- ఇది దేవుని స్క్రిప్ట్
నాన్న మొదలుపెడితే...
నేను పూర్తి చేశా..
- వెలిగొండను పూర్తి చేసే అవకాశం.. నిజంగా నా అదృష్టం... వెలిగొండను జాతికి అంకితం చేసిన ఏపీ సీఎం జగన్
- వాయువేగంతో జంట సొరంగాలు పూర్తి

5 లో



సీబీఐ కస్టడీకి షాజహాన్ షేక్

సందేశ్‌ఖాలీలో ఈడీ అధికారులపై దాడి కేసులో నిందితుడు, తృణమూల్ మాజీ నేత షాజహాన్ షేక్‌ను సీబీఐ కస్టడీలోకి తీసుకుంది.

- వివరాలు 6లో



చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం!

2035 లోపు చంద్రునిపై మనిషి శాశ్వత నివాస కలను నిజం చేసే దిశగా రష్యా, చైనా సంయుక్తంగా అడుగులు వేస్తున్నాయి.


- వివరాలు 6లో



రిపబ్లికన్ ఏకైక అభ్యర్థిగా ట్రంప్

నవంబర్‌లో జరిగే అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్, రిపబ్లికన్‌పార్టీల తరపున బరిలో దిగే అభ్యర్థులు ఎవరనేది ఖరారైంది.

- వివరాలు 6లో




జాడ చెప్తే రూ.10 లక్షలు

రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడి సమాచారమిస్తే 10 లక్షల బహుమతి ఇస్తామని ఎన్ఐఏ ప్రకటించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

భూములను ఉచితంగా క్రమబద్ధీకరించాలి



గ్రామాలు, పట్టణాలలో ఉచితంగానే భూముల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బీఆర్ఎస్ ఆందోళనలు నిర్వహించింది.

- వివరాలు 5లో

ఇందిరమ్మ ఇళ్లకు భద్రాద్రిలో శ్రీకారం



ఈ నెల 11న భద్రాచలం రాముడి సన్నిధిలో ఐదో గ్యారంటీ అయిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 3లో

పెళ్లి చేసుకుని.. తిరుమల వెళ్లి వస్తూ...



పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని నల్లగట్ల వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదుగురిని కబళించి మూడు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

- వివరాలు 5లో

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో హైదరాబాదీ మృతి

3 లో

ఆగస్టు 7, 8న గ్రూప్-2

అక్టోబర్ 21వ తేదీ నుంచి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

- నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షల నిర్వహణ
- ఆయా పరీక్షలకు వారం రోజుల ముందు నుంచీ హాల్‌టికెట్ల జారీ
- షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్-1, 2, 3 కేటగిరీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతమైంది. ఆయా ఉద్యోగ పరీక్షల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఏడాది చివరినాటికల్లా గ్రూప్ సర్వీసులకు సంబంధించి అన్నిరకాల అర్హత పరీక్షలను పూర్తి చేసేలా ఈ షెడ్యూల్‌ను రూపొందించింది. ఇటీవల గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసిన టీఎస్‌పీఎస్సీ.. ప్రిలిమినరీ పరీక్షను ఈ ఏడాది జూన్ 9న నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించిన మెయిన్స్ పరీక్షలను అక్టోబర్ 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు తాజాగా వెల్లడించింది. ఇక పెండింగ్‌లో ఉన్న గ్రూప్-2, గ్రూప్-3 అర్హత పరీక్షల తేదీలను కూడా ఖరారు చేసింది.

పెండింగ్‌లో ఉన్న పరీక్షల్లో..

టీఎస్‌పీఎస్సీ 2022 డిసెంబర్‌లో గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చింది. గత ఏడాది ఫిబ్రవరి నాటికి దరఖాస్తుల స్వీకరణ ముగిసినా.. పరీక్షల నిర్వహణ ముందుకు సాగలేదు. అభ్యర్థులు సన్నద్ధతకు సమయం కోరడం, పలు ఇతర కారణాలతో ప్రభుత్వం పరీక్షల షెడ్యూల్‌ను దాదాపు మూడుసార్లు మార్చింది. ఇక 2022 ఏప్రిల్‌లో గ్రూప్-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిన టీఎస్‌పీఎస్సీ.. అదే ఏడాది అక్టోబర్‌లో ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. డిసెంబర్ నాటికి ఫలితాల ప్రకటనతోపాటు 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను కూడా ప్రకటించింది. కానీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో ఆ గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దయింది. గత ఏడాది జూన్‌లో మరోమారు ప్రిలిమ్స్‌ను నిర్వహించినా.. పరీక్షల నిర్వహణలో లోపాలపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా.. రెండోసారి కూడా రద్దయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పాటైన కొత్త ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది. టీఎస్‌పీఎస్సీలో మార్పులు చేయడంతోపాటు ఆ గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. తాజాగా గత నెల 19న 563 పోస్టులతో కొత్తగా గ్రూప్-1 నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీనికి ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇన్నాళ్లూ పరీక్షల రద్దు, ఇతర అంశాలతో అభ్యర్థులు నిరాశలో ఉన్న నేపథ్యంలో.. ఉత్సాహం నింపేలా టీఎస్‌పీఎస్సీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు పరీక్షల నిర్వహణ తేదీలతో షెడ్యూల్‌ను విడుదల చేసింది.

సన్నద్ధతకు సమయం

టీఎస్‌పీఎస్సీ ముందస్తుగా గ్రూప్ ఉద్యోగాల అర్హత పరీక్షల తేదీలను ప్రకటించడంపై అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పరీక్షలకు అభ్యర్థులు పలుమార్లు సన్నద్ధం కావాల్సి వచ్చింది. ఆయా పరీక్షలు జరగలేదు. ఈ క్రమంలో

మిగతా 3వ పేజీలో ▶

పరీక్షల షెడ్యూల్ ఇదీ..

కేటగిరీ	ఖాళీలు	పరీక్ష తేదీలు	పేపర్లు
గ్రూప్-2	783	2024 ఆగస్టు 7, 8 (బుధ, గురువారం)	4
గ్రూప్-1 (మెయిన్స్)	563	2024 అక్టోబర్ 21 (సోమవారం) నుంచి..	7
గ్రూప్-3	1,388	2024 నవంబర్ 17, 18 (ఆది, సోమవారం)	3

మా ప్రభుత్వాన్ని పడగొడతారట!

కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీ అంటున్నారు

'పాలమూరు ప్రజాదీవెన' బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్, బీజేపీలవి దుర్మార్గపు రాజకీయాలు
- మేం బాధ్యతతో వ్యవహరిస్తుంటే.. సన్నాసుల్లా విమర్శిస్తున్నారు
- రాష్ట్రానికి సహకరించకపోతే కేంద్రానికి చాకిరేవు పెడతా..
- రాష్ట్రంలో పదేళ్లూ మేమే అధికారంలో ఉంటాం.. మమ్మల్ని టచ్ చేస్తే.. మానవబాంబులై పేలుస్తాం
- తమ 90 రోజుల పాలనపై రెఫరెండానికి సిద్ధమన్న రేవంత్



పాలమూరు ప్రజాదీవెన సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వంశీచంద్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ మూడు నెలలు, ఆరు నెలలు మాత్రమే అధికారంలో ఉంటుందంటూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీ అంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఏం అన్యాయం చేశామని కాంగ్రెస్ సర్కారును కూల్చుతామని అంటున్నారని నిలదీశారు. ఎవరినైనా ఎదుర్కొంటామని, తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ పదేళ్లపాటు అధికారంలో ఉంటుందని చెప్పారు. తమను టచ్ చేస్తే అగ్నికణికలై, మానవ బాంబులై పేలుస్తామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, బీజేపీల దుర్మార్గపు రాజకీయాలకు పాతరేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 90 రోజుల పాలనపై రెఫరెండానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'పాలమూరు ప్రజాదీవెన' బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి పాల్గొని లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించారు. సభలో రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

"మా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల బీమా, గృహలక్ష్మి కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీకి

మిగతా 2వ పేజీలో ▶



బుధవారం కోల్‌కతాలో దేశంలోని మొదటి అండర్ వాటర్ మెట్రోరైల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. తర్వాత అందులో ప్రయాణిస్తూ విద్యార్థులతో ముచ్చటించారు. -6లో

రాష్ట్రంలో కరువు పరిస్థితులు


- వర్షాలు లేక తీవ్ర నీటి సమస్య వచ్చింది...'రైతు నేస్తం'ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- కలసికట్టుగా కరువును ఎదుర్కొందాం.. తాగునీటి కష్టాలు రాకుండా చూస్తున్నాం
- 'రైతు నేస్తం' ద్వారా మీ కష్టాలను ప్రభుత్వం దృష్టికి తేవొచ్చు
- ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా

- వివరాలు 3లో

12న రాష్ట్రానికి అమిత్ షా

ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా రాష్ట్ర నేతలతో భేటీకి నిర్ణయం

- బూత్ స్థాయి పోల్ మేనేజ్‌మెంట్‌పై దిశానిర్దేశం చేయనున్న అగ్రనేత
- రాష్ట్ర స్థాయిలోనూ మేనిఫెస్టో.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై చార్జిషీటు!



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 12న రాష్ట్రానికి రానున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేయాలని ఆయన భావిస్తున్నారు. 12న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పోలింగ్ బూత్ కమిటీలు ఆపైస్థాయి నాయకులు, కార్యకర్తలతో అమిత్ షా ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. వచ్చే ఎన్నికల్లో పటిష్టమైన పోల్ మేనేజ్‌మెంట్ అమలు, బూత్ స్థాయిలో పార్టీకి ఓట్లు వేయించుకోవడంపై అవగాహన కల్పించనున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కంటే ముందుగానే 17 ఎంపీ సీట్లకు గాను 9 స్థానాల్లో

మిగతా 2వ పేజీలో ▶

ఏక్‌నాథ్ షిండే ఎవరో త్వరలోనే తెలుస్తుంది

- కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పాలన
- బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్

2 లో



నేడు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన!

తుది అంకానికి చేరిన ఎంపిక కసరత్తు

- ఢిల్లీలో భేటీ కానున్న కేంద్ర ఎన్నికల కమిటీ
- వీలైతే నేడు లేదా రేపు రాష్ట్రంలోని అన్ని స్థానాలకు అభ్యర్థుల ప్రకటన.. కనీసం 8 నుంచి 10 స్థానాలకైనా ఖరారు చేస్తారనే చర్చ
- సీఈసీ భేటీకి హాజరు కానున్న రేవంత్, భట్టి, ఉత్తమ్ తదితరులు



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఈ ప్రక్రియలో కీలకమైన కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం గురువారం ఢిల్లీలో జరగనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ భేటీలో పార్టీ మాజీ చీఫ్‌లు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అంబికా సోని పాల్గొననున్నారు. రాష్ట్రం నుంచి సీఈసీ సభ్యుడి హోదాలో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి,

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మీరే అంబాసిడర్! కంగ్రాచ్యులేషన్స్ సార్!



వంద రోజుల్లో ఏం సాధించారు?

రేవంత్ ప్రజలనే కాదు... కాంగ్రెస్‌నూ మోసం చేస్తున్నారు: హరీశ్‌రావు

- వైట్ పేపర్, బ్లాక్ పేపర్ అంటూ కాషాయ లవ్ లెటర్ రాశారు
- రైతు రుణమాఫీ లేదు.. క్వింటాలుకు రూ.500 బోనస్ లేదు
- కాంగ్రెస్ రావడంతోనే వచ్చిన కరువు

సాక్షి, హైదరాబాద్: వందరోజుల పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి సాధించిందేముందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. నన్ను చూసి, వందరోజుల పాలన చూసి ఓటేయాలని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయన పాలనలో ఏముందని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు సీఎంగా రేవంత్‌రెడ్డి అటు ప్రజలను, ఇటు కాంగ్రెస్ పార్టీని సైతం మోసం చేశారని ధ్వజమెత్తారు. బుధవారం హరీశ్‌రావు మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లో కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. వైట్ పేపర్, బ్లాక్ పేపర్ అంటూ సీఎం కాషాయ లవ్ లెటర్ రాశారని విమర్శించారు. మళ్లీ మోదీనే కేంద్రంలో అధికారంలోకి వస్తాడు అన్నట్టుగా రేవంత్ మాట్లాడారని హరీశ్‌రావు పేర్కొన్నారు. 10 రోజుల్లో ఎన్నికల కోడ్ రానుండగా, మోదీని ఎందుకు అంత పొగడడమని నిలదీశారు. గుజరాత్ మోడల్ నిరంకుశమని రాహుల్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ... రేవంత్ మాత్రం గుజరాత్ మోడల్ కావాలంటున్నారని.. ఇందులో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రాహుల్ ప్రధాని అవుతాడన్నప్పుడు.. మోదీ సహకారం ఎందుకు కావాలని

మిగతా 2వ పేజీలో ▶

పదేళ్లూ బీజేపీ సర్కార్ చేసిందేంటి?

కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదు?

ప్రధాని మోదీ ఆరోపణలపై మంత్రి ఉత్తమ్ స్పందన

- కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాలు, అనుమతులిచ్చింది మోదీ సర్కారే..
- ఆ ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని ఆరోపించినదీ వారే..
- గత పదేళ్లలో ఎలాంటి చర్యలూ తీసుకోలేదేమని ప్రశ్న
- మోదీ పాలనలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఆరోపణ
- జలసౌధలో ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీతో మంత్రి సమావేశం



సాక్షి, హైదరాబాద్: గతంలో ప్రధాని మోదీ, బీజేపీ నేతలు అమిత్ షా, జేపీ నడ్డా తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని ఆరోపించేవారని.. మరి ఇన్నేళ్లూ ఎలాంటి చర్యలు తీసుకోలేదేమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ బీజేపీ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. గత పదేళ్లలో కేంద్రం ఎందుకు సీబీఐ విచారణకు ఆదేశించలేదని నిలదీశారు. కాళేశ్వరం బ్యారేజీల డిజైన్లు, నిర్మాణంపై అధ్యయనం కోసం కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీతో బుధవారం జలసౌధలో ఉత్తమ్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ తమ ప్రభుత్వంపై చిత్రవిచిత్రమైన ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ వాళ్లు పదేళ్లపాటు అలయ్ బలయ్ చేసుకుని పాలించారని విమర్శించారు.

రాష్ట్రానికి మోదీ చేసిందేమీ లేదు

కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీఎఫ్‌సీ నుంచి రూ.50వేల కోట్లు, ఆర్ఈసీ నుంచి రూ.20వేల కోట్లు, బ్యాంకుల నుంచి రూ.10 వేల కోట్ల రుణాలను ఇచ్చిందని.. అలాంటిది బీజేపీ వారే తమపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఉత్తమ్ విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

8న దీక్షకు అనుమతి ఇవ్వాలి

డీజీపీకి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ నియామకాల్లో జీవో 3 కారణంగా మహిళా రిజర్వేషన్ల అమలులో జరుగుతున్న అన్యాయంపై ఈనెల 8న నిర్వహించతలపెట్టిన ధర్నాకు అనుమతి ఇవ్వాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డీజీపీని కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం డీజీపీ రవిగుప్తాతో ఫోన్‌లో మాట్లాడారు. 8న జరిపే దీక్షకు పోలీసు శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఆమె డీజీపీకి దీక్ష ఆవశ్యకతను వివరించారు. జీవో నంబర్ 3 వల్ల మహిళలు నష్టపోతున్నారనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని, చాలా ముఖ్యమైన ఈ అంశంపై ధర్నాకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగా దీక్ష నిర్వహిస్తామని వివరించారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



అచ్చంపేట రూరల్: దేశ రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని, అడ్డుకోవడంలో కాంగ్రెస్ విఫలమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బుధవారం అచ్చంపేటలో జరిగిన బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రాజ్యాంగాన్ని రక్షించడం కోసమే బీఎస్పీ.. బీఆర్ఎస్‌తో కలిసిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పరోక్షంగా బీజేపీకి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. దేశంలో విచ్ఛిన్నకర ఎజెండాను అమలు చేస్తున్న బీజేపీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తు బహుజనుల ఆకాంక్ష అని అన్నారు.

సమస్త భారతావని మోదీ కుటుంబమే

బీజేపీ నేత కరుణా గోపాల్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీని 'మీ కుటుంబం ఎక్కడుంది' అని కాంగ్రెస్ నాయకులు అడుగుతున్నారని, సమస్త భారతావని ఆయన కుటుంబం అన్న విషయాన్ని వారు గుర్తెరగాలని బీజేపీ ఉమెన్ పాలసీ నేషనల్ ఇన్‌చార్జి కరుణా గోపాల్ వర్తకవి హితవు పలికారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న దేశం మొత్తం ఆయన కుటుంబమేనని, వారిలో 70 కోట్ల మంది మహిళలు మోదీ కుటుంబ సభ్యులనే విషయం తెలుసుకోవాలని అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మోదీ దృష్టిలో మహిళలు ఉన్నతమైన, గొప్ప దృష్టిని కలిగిన వారని.. ఆయన మాటల్లోనే చెప్పాలంటే 'విరాట్ విజన్' అని అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళల నేతృత్వంలోని దేశాన్ని ఆయన కాంక్షిస్తున్నారని, గ్రామీణ మహిళలు లక్షాధికా రులు కావాలని కలలు కంటున్నారని చెప్పారు.

21 మందితో 'మాస్‌లైన్' కేంద్ర కమిటీ ఎన్నిక

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతల వెల్లడి

ఖమ్మం మయూరి సెంటర్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫాసిస్ట్ బీజేపీని ఓడించడమే సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, సంయుక్త కార్యదర్శులు సుభాష్‌దేవ్, పోటు రంగారావు వెల్లడించారు. ఖమ్మంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఐక్యతా మహాసభలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. ఈ సందర్భంగా 21 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకోగా, వీరిలో తొమ్మిది మంది పొలిట్ బ్యూరో సభ్యులు ఉన్నారని చెప్పారు. అలాగే కంట్రోల్ కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌సింగ్ ఠాగూర్(పశ్చిమ బెంగాల్), సంయుక్త కార్యదర్శులుగా సుభాష్‌దేవ్(త్రిపుర), పోటు రంగారావు(తెలంగాణ), కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా రాయల చంద్రశేఖర్(తెలంగాణ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

కేసీఆర్ వస్తే రేవంత్ కుర్చీలో నుంచి ఎగిరిపోతారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత కేసీఆర్ తగిన సమయంలో అసెంబ్లీకి వస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ వస్తే రేవంత్ కుర్చీ నుంచి ఎగిరిపోతారన్నారు. 6 గ్యారంటీల అమలుపై 100 రోజుల తర్వాత శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవటం కోసం రేవంత్ మోదీ సహకారం అడుగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఎల్ఆర్ఎస్‌పై గతంలో ఓమాట ఇప్పుడొక మాట మాట్లాడుతున్నారని విమర్శించారు.

మా ప్రభుత్వాన్ని పడగొడతారట!



పాలమూరు ప్రజాదీవెన సభకు హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు

▶ మొదటి పేజీ తరువాయి

చర్యలు తీసుకున్నాం. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నాం. రైతు భరోసా కింద పెట్టుబడిసాయం అందించడంతోపాటు ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలను అందించాం.

పదేళ్లు అధికారంలో ఉంటాం..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలే, ఆరు నెలలే ఉంటుందని కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీ అంటున్నారు. కేసీఆర్, మోదీలు పదేళ్లు అధికారంలో ఉండాలా? పేదల ప్రభుత్వాన్ని ఆరు నెలలు ఉండనీయరా? 40శాతం ఓట్లతో గెలిచిన ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతారా? రైతుబిడ్డ సీఎం కుర్చీపై కూర్చుంటే ఓర్వలేరా? ఒకసారి టచ్ చేసి చూడండి.. మేం అగ్నికణికలై, మానవ బాంబులై పేల్చేస్తాం. తమాషా చేస్తే పండబెట్టి తొక్కి పేగులు మెడకేసుకుని ఊరేగుతాం. నల్లమలలో పుట్టి తొక్కుకుంటూ ఇక్కడి వరకు వచ్చా.. ప్రగతిభవన్ కంచెలు బద్దలుకొట్టి బజారుకు ఈడ్చినోడిని. ఈ పాలమూరు బిడ్డకు తట్టా పార, వలసలే కాదు.. నీలాంటి వారిని బొందపెట్టడం కూడా తెలుసు. కాంగ్రెస్ కార్యకర్తల మీద ఆన.. పాలమూరు బిడ్డగా మాటిస్తున్నా.. తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ పదేళ్ల పాటు అధికారంలో ఉంటుంది.

ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు..

రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రికి మేం వినతులు ఇస్తే.. ఇక్కడి కొందరు సన్నాసులు ఇష్టమున్నట్టు మాట్లాడుతున్నరు. నేనేమీ మీలాగా ఇంట్లో తలుపులు మూసుకుని, కడుపులో తలకాయ, కాళ్లు పెట్టుకుని పడుకోలేదు. అతిథి సంస్కారంతో ముఖ్యమంత్రిగా బాధ్యత నెరవేర్చిన. రాష్ట్రానికి మేలు జరగాలన్న ఆలోచనతో ప్రధానికి సమస్యలు చెప్పిన. ఒకవేళ బీజేపీ ప్రభుత్వం సమస్యలు తీర్చకపోతే చాకిరేవు కాడ బట్టలు ఉతికినట్టుగా వారిని ఉతికే బాధ్యత నాదే. కేంద్రం సహకరించకపోతే అన్ని రాష్ట్రాలు తిరిగి కొట్లాడుతా..

పదేళ్లలో వందేళ్ల విధ్వంసం..

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగింది. దుష్ట పాలనలో పందికొక్కుల్లా రాష్ట్రాన్ని దిగమింగారు. పాలమూరు-రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండ ప్రాజెక్టులను కుర్చీ వేసుకుని కట్టిస్తానని చెప్పిన కేసీఆర్.. తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం. 3నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క గంట అయినా ప్రజలకు దూరంగా ఉన్నామా? ఏం అన్యాయం చేశామని మోదీ, కేడీ మా ప్రభుత్వాన్ని కూలుస్తామని మాట్లాడుతున్నారు? ఆరు అడుగులు ఉన్నామంటూ దూలంలా పెరిగిన కొందరికి ఆవుదూడకున్నపాటి బుద్ధి కూడా లేదు. బీఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితి. కేసీఆర్ తన కుమారుడు సీఎం కాకుండా రైతుబిడ్డ సీఎం అయ్యాడన్న అసూయతో మాట్లాడుతున్నారు. ఒంట్లో బాగాలేదన్నప్పుడు నల్లగొండకు ఏం కాసేందుకు వెళ్లారు? ప్రజలు ఓడించి బొక్కలు విరగ్గొడితే సిగ్గులేకుండా వీధుల్లో పడి కాంగ్రెస్‌ను తిడుతున్నారు.

ఎదిరించి నిలబడతాం..

దేశంలో మోదీనైనా, రాష్ట్రంలో కేడీనైనా ఎదురించి నిలబడుతాం. తొడగొట్టి పడగొట్టే ధైర్యాన్ని పాలమూరు బిడ్డలే నాకు ఇచ్చారు. పాలమూరు బాధలు తీర్చే బాధ్యత నేను తీసుకుంటా. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన కోసం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకవ్యవస్థను ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు అనుమతులు, నిధులు వేగంగా మంజూరయ్యేందుకు చర్యలు చేపడతాం. ప్రజలు రాష్ట్రంలోని 14 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి''అని రేవంత్ పిలుపునిచ్చారు.

మీ ఆత్మగౌరవం ఇదేనా..

మాదిగల వర్గీకరణ కోసం గతంలో అసెంబ్లీలో తాను, సంపత్‌కుమార్ కొట్లాడితే గత ప్రభుత్వం సస్పెన్షన్ చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. 'అలాంటి పార్టీతో మా మిత్రుడు ప్రవీణ్‌కుమార్ పొత్తు కుదుర్చుకున్నారు. మీ ఆత్మగౌరవం ఇదేనా?' అంటూ బీఆర్ఎస్‌తో పొత్తు కుదుర్చుకోవడాన్ని ఉద్దేశించి రేవంత్ ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, న్యాయబద్ధంగా చేస్తామన్నారు.

మంత్రులు ఏమన్నారంటే..

నల్లమల ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి ఈ రోజు తెలంగాణ బిడ్డగా మారారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ మూడు నెలల పరిపాలనలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ''మూడు 'బీ'లు (బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ) ఒకటే.. కేసీఆర్, కేటీఆర్ దొంగ దందాలు అన్నీ బయటికి వస్తాయి. కవిత మద్యం కేసులో ఎప్పుడు జైలుకు పోతదో తెలియదు..'' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. అధికారం పోయి మతిభ్రమించిన కేసీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని మళ్లీ నిలబెట్టుకుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణను న్యాయబద్ధంగా చేపడతామని వివరించారు. పదేళ్లుగా బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు పాలమూరు ప్రాంతానికి తీరని అన్యాయం చేశాయని కాంగ్రెస్ సీనియర్ నేత చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు.

ప్రధానిని సీఎం కలిస్తే తప్పేంటి?

- బీఆర్ఎస్ నేతలకు ఎందుకు కడుపు మంట?
- బండి సంజయ్ నిలదీత



కల్లు తాగుతున్న బండి సంజయ్

శంకరపట్నం: ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు అభివృద్ధి పనుల నిమిత్తం ముఖ్యమంత్రి కలిస్తే తప్పేంటని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం హోదాలో కేసీఆర్ ఎప్పుడూ ప్రధాని మోదీని కలవలేదని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కలిస్తే బీఆర్ఎస్ నాయకులకు కడుపుమంట ఎందుకని నిలదీశారు. ప్రజాహితయాత్రలో భాగంగా బుధవారం ఆయన కరీంనగర్ జిల్లా కేశవపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మోదీని చూస్తేనే మాజీ సీఎం కేసీఆర్ వణికిపోతున్నారని అన్నారు. ఆయన తన కుమారుడు కేటీఆర్‌ను సీఎం చేయాలని ప్రధానిని కలిసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి నిధులు మంజూరు చేస్తే.. తెలంగాణ ప్రజలు మాత్రం కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ఎప్పటికీ కలువబోవని, ఈ రెండు పార్టీలు తూర్పు, పడమర వంటివని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాలలో కమలం పువ్వుకు ఓటువేసి మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా గెలిపించాలని సంజయ్ పిలుపునిచ్చారు.

మోకు వేసుకుని, కల్లు రుచి చూసి..

శంకరపట్నం మండలం లింగాపూర్‌లో సంజయ్ గీత కార్మికులతో ముచ్చటించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. సరదాగా మోకు వేసుకున్నారు. కల్లు రుచి చూశారు. కల్లు ఆరోగ్యానికి మంచిదని ఆరోగ్య నిపుణులు చెప్పడాన్ని గుర్తు చేశారు.

నేడు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన!

▶ మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ఏర్పాటు చేసిన తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు హాజరు కానున్నారు. ఇప్పటికే పీసీసీల స్థాయిలో షార్ట్ లిస్ట్ అయిన ఆశావహుల జాబితా నుంచి వీలున్నన్ని పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడమే ఎజెండాగా ఈ సమావేశం జరగనుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. భేటీ అనంతరం దేశవ్యాప్తంగా 100 మందికి పైగా అభ్యర్థులతో వీలుంటే గురువారం నాడే లేదంటే శుక్రవారం తొలి జాబితా విడుదల చేస్తారని తెలుస్తోంది. ఇక ఏకాభిప్రాయం సాధ్యమైతే తెలంగాణలోని దాదాపు అన్ని స్థానాలకు (ఒకట్రెండు మినహా) ఒకేసారి అభ్యర్థులను ప్రకటిస్తారని, లేదంటే 8 నుంచి 10 మంది అభ్యర్థులను ప్రకటిస్తారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. సికింద్రాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, కరీంనగర్, నిజామాబాద్ స్థానాలపై ఇప్పటికే ఏకాభిప్రాయం వచ్చిందని తెలుస్తోంది. మిగిలిన స్థానాలపై కూడా సీఈసీ సమావేశంలో చర్చించిన అనంతరం పలు ప్రాతిపదికల ఆధారంగా అభ్యర్థులను నిర్ణయిస్తారని సమాచారం.

రాహుల్ పోటీపైనా స్పష్టత!

రాష్ట్రం నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేస్తారా లేదా? అన్నదానిపై కూడా ఈ సమావేశంలోనే స్పష్టత రానుంది. ఒకవేళ రాహుల్ పోటీ చేసే పక్షంలో ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఏఐసీసీ అధికారికంగా విడుదల చేసే తొలి జాబితాలోనే ప్రకటించే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. కానీ ఏఐసీసీ వర్గాల కథనాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆయన తిరిగి ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, కేరళలోని వయనాడ్ రెండింటి నుంచి పోటీ చేసే అవకాశం ఉందని సమాచారం. ఇక ప్రియాంకా గాంధీ.. తల్లి సోనియాగాంధీ ఐదుసార్లు గెలిచిన రాయ్‌బరేలీ నుండి పోటీ చేసే అవకాశం ఉందని అంటున్నారు.

హస్తినకు ఆశావహులు

సీఈసీ సమావేశం నేపథ్యంలో టికెట్ ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందనే అంచనాలున్న స్థానాల్లో తమ అభ్యర్థిత్వాలు ఖరారవుతాయో లేదోననే ఆసక్తితో కొందరు నేతలు ఢిల్లీ చేరుకున్నట్టు సమాచారం. వివిధ సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉండనున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేసే అవకాశాలున్న తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, పంజాబ్ వంటి రాష్ట్రాల నుంచి తొలి జాబితాలో ఎక్కువమందికి అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

పదేళ్లు బీజేపీ సర్కార్ చేసిందేంటి?



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి


రూ.80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడానికి సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చిందని.. మళ్లీ రూ.94వేల కోట్లకు అంచనాలను పెంచేందుకు అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. మోదీ ప్రధాని అయిన కొత్తలోనే తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని.. తెలంగాణలోని ఏడు మండలాలు, సీలేరు జలవిద్యుత్ ప్రాజెక్టును ఏపీకి అప్పగించారని ఆరోపించారు. విభజన చట్టం ప్రకారం రావాల్సిన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్‌లను నెలకొల్పలేదన్నారు. ప్రధాని అయిన నాటి నుంచి ఇప్పటివరకు మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు.

సాధ్యమైనంత త్వరగా మధ్యంతర నివేదిక..

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు జరిగిన నష్టం, లోపాలు, కారణాలను తేల్చి పరిష్కార మార్గాలను సూచించాలని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీని కోరామని ఉత్తమ్ తెలిపారు. నివేదిక సమర్పించడానికి కమిటీకి కేంద్రం 4 నెలల గడువు నిర్దేశించినా.. బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు చేపట్టడానికి వీలుగా సాధ్యమైనంత త్వరగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని కోరినట్టు వెల్లడించారు. అందులో పునరుద్ధరణ చర్యలను సైతం సిఫారసు చేయాలన్నారు. కమిటీ అడిగిన అన్నిరకాల నివేదికలు, సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. సమాచారాన్ని దాచే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీకి ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కమిటీ గురువారం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను, శుక్రవారం సుందిళ్ల బ్యారేజీని సందర్శిస్తుందని తెలిపారు. నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ తప్పు చేసిందని కమిటీ తేల్చితే చర్యలు తీసుకుంటామన్నారు. మేడిగడ్డపై న్యాయ విచారణ విషయంలోనూ ముందడుగు పడుతుందన్నారు.

ఇకపై జాగ్రత్తగా ఉండండి

- కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓకు హైకోర్టు హెచ్చరిక
- 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కుమారుడిపై గత నెల 14నే ఎఫ్ఐఆర్: ఎస్‌హెచ్‌ఓ



సాక్షి, హైదరాబాద్: బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్పుడు ఫిర్యాదు తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఇకపై జాగ్రత్తగా ఉండాలని కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓను హైకోర్టు హెచ్చరించింది. తనపై రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కుమారుడు వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేసినా కరీంనగర్ టూటౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదంటూ ఓ మహిళ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా కరీంనగర్ టూటౌన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యానికి కారణాలను ఎస్‌హెచ్‌ఓ తెలిపాల్సిందేనని ధర్మాసనం ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. తాజా విచారణ సందర్భంగా ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యానికి కారణాలను తెలుపుతూ ఎస్‌హెచ్‌ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 13న మరో కేసు విచారణ సందర్భంగా స్టేషన్‌లో తాను అందుబాటులో లేనని, 14న తన దృష్టికి విషయం రాగానే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎస్‌హెచ్‌ఓ వివరణ ఇచ్చారు. దీనికి సమ్మతించిన ధర్మాసనం.. భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. పిటిషన్‌లో విచారణను ముగించింది.

ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కుమారుడికి ఈ కేసుతో సంబంధం లేదు..

ఫిర్యాదుదారు మహిళ పోలీసులకు రెండో అదనపు జిల్లా జడ్జి కుమారుడిపై ఫిర్యాదు చేయగా ఫిబ్రవరి 15న కొన్ని పత్రికల్లో ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కుమారుడు అని వచ్చింది. హైకోర్టు సైతం విచారణ సందర్భంగా రెండో అదనపు జిల్లా జడ్జి కుమారుడి గురించే ప్రస్తావించింది. ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కుమారుడి గురించి ప్రస్తావించలేదు. హైకోర్టు ముందున్న కేసుకు, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కుమారుడికి ఏమాత్రం సంబంధం లేదు.

ఎవరు ఏక్‌నాథ్ షిండేలో

త్వరలోనే తెలుస్తుంది



- బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్య
- కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పాలన అని విమర్శ
- లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పథకాలు ఉండవని అనుమానం
- దేశమే మోదీ కుటుంబం.. మోదీపై అక్కసుతో రాముడినీ విపక్షాలు ద్వేషిస్తున్నాయని విమర్శ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎవరు ఏక్‌నాథ్ షిండేలు అవుతారనేది త్వరలోనే తెలుస్తుందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అనేక రాజకీయ పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని విమర్శించారు. బుధవారం నగరంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. 'మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.2,500 ఇస్తామని చెప్పారు.. ఇంకా మొదలు కూడా పెట్టలేదు. 500 రూపాయలకే అందరికీ గ్యాస్ సిలిండర్ అని చెప్పి ఇప్పుడు కొందరికే అని ఆంక్షలు పెడుతున్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు ఉచితం అన్నారు. ఇప్పుడు 200కి మించి ఒక్క యూనిట్ ఎక్కువ వచ్చినా మొత్తం భారం ప్రజలపైనే అంటున్నారు. రైతు భరోసా లేదు..కూలీ భరోసా లేదు.. కేవలం ఎన్నికల ముందు నామ మాత్రంగా కొన్ని పథకాలు ప్రారంభిస్తున్నారు.. పార్లమెంట్ ఎన్నికల తరువాత ఇవి కూడా ఉంటాయని నమ్మకం లేదు' అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

డబుల్ ఇంజిన్ సర్కారు కావాలని..

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని కె.లక్ష్మణ్ చెప్పారు. మోదీ అసాధ్యాలను సుసాధ్యాలు చేయడంతో ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అని దేశవ్యాప్తంగా ప్రజలు అంటున్నారని, అందుకే మోదీ పేరు అంతటా మార్మోగుతోందన్నారు. గత 15 రోజులుగా ప్రధాని దేశ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే వీటిని చూసి కాంగ్రెస్ కూటమి జీర్ణించుకోలేక పోతోందన్నారు. అందుకే మోదీపై వ్యక్తిగత దూషణలకు దిగుతోందని లక్ష్మణ్ ఆరోపించారు. మోదీకి కుటుంబం లేదని విమర్శిస్తున్నారనీ, కానీ దేశమే తన కుటుంబం అని మోదీ చెబుతున్నారని గుర్తుచేశారు. విపక్ష కూటమిలోని పార్టీలు మోదీ పైన అక్కసుతో రాముణ్ణి, ఈ దేశాన్ని ద్వేషిస్తున్నాయని మండిపడ్డారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యలో ఎంఐఎం

బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసే పనిచేస్తుండగా, వీరి మధ్య ఎంఐఎం సంధి చేస్తోందని కె.లక్ష్మణ్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ మొక్కుబడిగా పోటీ చేస్తుందని అభిప్రాయపడ్డారు. బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎదుర్కోవడానికి మండలానికి ఇద్దరు చొప్పున సోషల్ మీడియా వారియర్లను నియమించనున్నట్టు వెల్లడించారు. కాంగ్రెస్ కూటమి నేతలకు ఫ్యామిలీ ఫస్ట్ అయితే మోదీకి నేషన్ ఫస్ట్ అని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాల్లో గెలిచేది కూడా బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 12 న హైదరాబాద్‌కు అమిత్ షా వస్తున్నారని, ఆ సందర్భంగా బూత్ స్థాయి కమిటీ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

హరీశ్ ఎన్నికల తర్వాత బీజేపీలోకి వెళ్తారు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, యాదాద్రి: లోక్‌సభ ఎన్నికల తర్వాత మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరుతారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆ మేరకు బీజేపీతో హరీశ్‌రావు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోందన్నారు. బుధవారం యాదాద్రి జిల్లా భువనగిరిలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ మాదిరిగా తాము ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటూపోతే ఆ పార్టీలో మిగిలేది నలుగురు మాత్రమేనన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కొడుకు, అల్లుడిలో ఎవరిని నియమించాలో తెలియని అయోమయంలో కేసీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే ప్రధాని మోదీ కంటే ఎక్కువ మెజార్టీ వస్తుందని మంత్రి కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ కలిసి పోటీ చేసినా కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లు గెలుస్తుందన్నారు. కేసీఆర్ దిక్కు లేక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాళ్లు పట్టుకునే పరిస్థితి వచ్చిందని నిందించారు.

అధికారం పోయిన తెల్లారి నుంచే రోడ్డెక్కుతారా?

- బీఆర్ఎస్ నేతలపై కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి ధ్వజం
- ఆ మాజీ మంత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: '' పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ. పేదలకు భూములిచ్చింది కాంగ్రెస్ పార్టీ. కానీ, ఆ భూములను లాక్కుని పెద్ద పెద్ద బిల్డర్లకు కట్టబెట్టింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం. ఇప్పుడు అధికారం పోగానే నీతి మాటలు చెపుతున్నారు. తగుదునమ్మా అంటూ ధర్నాలు చేస్తున్నారు.' అని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ధర్నాలు చేయడం సిగ్గుచేటని, ఈ స్కీం అమలు కోసం రెండు జీవోలిచ్చింది ఎవరని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు అల్లం భాస్కర్, గజ్జి భాస్కర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన జీవోలోనే ధరలు నిర్ణయించారని గుర్తు చేశారు. చెరువులు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ లేఅవుట్లు వేస్తుంటే అప్పట్లో నియంత్రించకుండా నిద్రపోయి తమ పార్టీ నేతలకు దోచుకునే విధంగా అనుమతులిచ్చారని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో జరిగిన లేఅవుట్లపై విచారణ జరపాలని, అమాయక ప్రజల దగ్గర డబ్బులు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఔటర్ రింగురోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించి, 111 జీవో పరిధిలోని భూములను ఆక్రమించి ఎఫ్‌టీఎల్ భూముల్లో నిర్మాణాలు చేసిన ఉదంతాలపై కూడా విచారణ జరిపించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో బరితెగించి సంపాదించిన నాటి మంత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోదండరెడ్డి డిమాండ్ చేశారు.

12న రాష్ట్రానికి అమిత్ షా

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులను బీజేపీ జాతీయ నాయకత్వం ప్రకటించిన సంగతి విదితమే. మిగతా సీట్లకు అభ్యర్థుల ఖరారు కసరత్తు సాగుతుండగా, బుధవారం ఢిల్లీలో జరగాల్సిన కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం శుక్రవారానికి వాయిదా పడింది. ఈ సమావేశంలో మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోదీ కాంగ్రెస్ సర్కార్, బీఆర్ఎస్‌లపై విరుచుకుపడటం ద్వారా ఎన్నికల వేడిని రాజేశారు. అమిత్ షా పర్యటన తర్వాత బీజేపీ దూకుడు మరింత పెంచే అవకాశం ఉంది.

చార్జిషీటుపై కసరత్తు షురూ

పార్టీపరంగా ప్రకటించాల్సిన లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో చేర్చాల్సిన అంశాలపై జాతీయ స్థాయిలో కసరత్తు సాగుతోంది. ఇందులో పొందుపరచాల్సిన విషయాలపై ఇప్పటికే వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు స్వీకరిస్తున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రస్థాయిలోనూ మేనిఫెస్టోను విడుదల చేయాలని జాతీయ నాయకత్వం యోచిస్తున్నట్టు సమాచారం. అలాగే అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్‌పై చార్జిషీటు విడుదల చేయాలనే అభిప్రాయంతో ముఖ్య నేతలున్నట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక కసరత్తు కూడా మొదలైనట్టు చెబుతున్నారు.

వంద రోజుల్లో ఏం సాధించారు?

▶ మొదటి పేజీ తరువాయి

అడుగుతారు? 'అని హరీశ్‌రావు నిలదీశారు.

కాంగ్రెస్‌తో పాటే వచ్చిన కరువు

'కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే రాష్ట్రంలో కరువొచ్చింది. కొత్త కొత్త బోరు బండ్లు వచ్చాయి. ట్యాంకర్ల ద్వారా వరిపంటకు నీళ్లుపోస్తున్నారు. అధికారంలోకి వస్తే రూ.4వేల పింఛన్లు ఇస్తామన్నారు.. కనీసం రూ.2వేల పింఛన్‌ను కూడా నెలనెలా ఇవ్వడం లేదు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదు. రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ఇంత వరకు ఆ ఊసే ఎత్తలేదు. కనీసం వచ్చే యాసంగికైనా రూ.500 బోనస్ ఇవ్వాలి. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని చెప్పి.. ఇప్పుడు రక్తం పిండి వసూలు చేస్తున్నారు. నిరుద్యోగులకు రూ.4వేలు ఇస్తామని చెప్పి అసెంబ్లీలో ఆ ఊసే ఎత్తలేదు. ఆటో అన్నలకు రూ.12వేలు ఇస్తామని చెప్పారు. ఎందరో ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అప్పుడు అప్పుల గురించి మాట్లాడి... ఇప్పటికే రూ.16వేలకోట్లు అప్పులు చేశారు. ఇంకా అప్పు కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. ఉపాధి హామీ పథకం పని చేసే 3000 మందికి ఇప్పటివరకు జీతాలు రాలేదు. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు లేవు. విదేశీ విద్యకు ఇప్పటివరకు పైసలు ఇవ్వడం లేదు' అని హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు.

కాళేశ్వరం రిపోర్టుకు నాలుగు నెలలా?

''కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఎన్డీఎస్ఏ రిపోర్ట్ రావడానికి 4 నెలల సమయం ఎందుకు పడుతుంది? వచ్చే వానాకాలంలో నీళ్లు ఇవ్వరా? వర్షాకాలంలో ఫ్లడ్ వచ్చి పంప్ హౌస్ మునిగిపోతే, మేము ప్రభుత్వానికి భారం పడకుండా త్వరితగతిన పూర్తి చేసి నీళ్లు లిఫ్ట్ చేశాము. తుమ్మిడిహెట్టి దగ్గర ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భూసేకరణ చేసి ప్రాజెక్టు నిర్మాణం చేయవచ్చు. తుమ్మిడిహెట్టిపై రేవంత్ అవగాహన లేకుండా మాట్లాడారు'' అని హరీశ్ విమర్శించారు.

క్లుప్తంగా...

నేడు ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం శంకుస్థాపన

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్–రామగుండం రాజీవ్ రహదారిపై భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన సికింద్రాబాద్ అల్వాల్ టిమ్స్ సమీపంలో భూమి పూజ చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే కంటోన్మెంట్ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. కంటోన్మెంట్ నిబంధనల కారణంగా ఆ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కానీ, రహదారుల విస్తరణ పనులు కానీ చేపట్టడానికి వీలు లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భూములను రక్షణ శాఖ రాష్ట్రానికి అప్పగించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎలివేటెడ్ కారిడార్ పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా 11.3 కిలోమీటర్ల పొడువునా 6 లేన్ల రహదారి నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. దీనితో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలకు పరి ష్కారం దొరుకుతుందని అధికారవర్గాలు చెపుతున్నాయి.

ముస్లిం ఉద్యోగులకు రంజాన్ సడలింపులు

సాయంత్రం 4 గంటలకే ఇళ్లకు వెళ్లవచ్చు

సాక్షి, హైదరాబాద్: రంజాన్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకు కార్యాలయం నుంచి ఇళ్లకు తిరిగి వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. రంజాన్ ప్రార్థనల కోసం ఈ మేరకు సడలింపు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రంజాన్ మాసం ఈ నెల 12 నుంచి ప్రారంభమై వచ్చే నెల 11తో ముగియనుందని, ఈ నెల రోజుల పాటు సాయంత్రం 4 గంటలకు ముస్లిం ఉద్యోగులు తమ కార్యాలయాలు/పాఠశాలలు వదిలివెళ్లవచ్చని తెలిపారు. ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, బోర్డులు, ప్రభుత్వ రంగ సంస్థలు, పాఠశాలల ఉద్యోగులకు కూడా ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి.

సీఎంకు టీశాట్ సీఈవో కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: టీశాట్ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీశాట్ సీఈవోగా తనను నియమించినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి అభినందించారు.

బీసీ హాస్టళ్లలో పిల్లల భద్రతకు గట్టి చర్యలు

బీసీ సంక్షేమ శాఖ కమిషనర్

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ జిల్లా బోధన్ బీసీ బాలుర హాస్టల్లో డిగ్రీ విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వసతి గృహంలో జరిగిన ఘటనతో హాస్టల్ వార్డెన్ స్వామిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వాచ్‌మన్ గంగాధర్‌ను విధుల నుంచి తొలగించినట్లు వివరించారు. మృతుడి సోదరుడు మల్కన్‌కు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తున్నట్లు తెలిపారు. బీసీ వసతి గృహాల్లో ఉంటున్న పిల్లల భద్రతకు కావాల్సిన అన్ని చర్యలను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వీసీల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి

ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్ల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత వివిధ యూనివర్సిటీల వీసీల ఎంపికలో మాదిగలకు తగిన అవకాశాలు రాలేదన్నారు. ఇప్పుడు అన్ని వర్సిటీల వీసీల ఎంపిక ప్రక్రియ జరుగుతున్న క్రమంలో న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అదేవిధంగా ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా ఇప్పటివరకు మాదిగలకు అవకాశం రాలేదని, ఆ లోటును తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

సింగరేణి ఉద్యోగ నోటిఫికేషన్‌లో మాకు అవకాశం ఇవ్వండి

ప్రభుత్వానికి బీటెక్ మైనింగ్ ఫైనలియర్ విద్యార్థుల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ప్రకటించిన సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రైనీ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో తమకు అవకాశం కల్పించాలని రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల్లోని బీటెక్ మైనింగ్ ఫైనలియర్ విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. చాలా ఏళ్ల తరువాత సింగరేణిలో 139 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చిందని, ఏప్రిల్‌లో తమ ఫైనల్ ఎండ్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని, మేలోగా ఇంజనీరింగ్ సర్టిఫికెట్‌లు వస్తాయని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి, తమ భవిష్యత్తుకు అండగా నిలవాలని కోరారు.

రాష్ట్రంలో కరువు పరిస్థితులు

- వర్షాల్లేక తీవ్ర నీటి సమస్య
- 'రైతు నేస్తం'ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- కలసికట్టుగా కరువును ఎదుర్కొందాం.. తాగునీటి కష్టాలు రాకుండా చూస్తున్నాం
- 'రైతు నేస్తం' ద్వారా మీ కష్టాలను ప్రభుత్వం దృష్టికి తేవొచ్చు




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'రైతు నేస్తం'లో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు జూపల్లి, తుమ్మల, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని.. ఏడాదిగా సరైన వర్షపాతం లేక రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, దీనిని అంతా కలసికట్టుగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. కరువు వచ్చినా, ఎంత కష్టం వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు. బుధవారం రేవంత్‌రెడ్డి తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వివిధ జిల్లాల రైతులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాము పండిస్తున్న పంటలు, అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే.. ''రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నాయి. వచ్చే ఎండాకాలంలో తాగునీటికి కష్టా లు రాకుండా చూడాల్సిన అవ సరముంది. అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. రిజర్వాయర్ల నుంచి నీళ్లను విడుదల చేయాలంటూ కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రైతులందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

'రైతు నేస్తం' ఏమిటి?

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతువేదికలను వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేసి.. నేరుగా రైతుల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని చేపట్టింది. తొలి విడతగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఏర్పాటు చేసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూ.97 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు, వ్యవసాయ నిపుణులు గ్రామాల్లోని రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటారు. తగిన సలహాలు ఇవ్వడంతోపాటు పంటల సాగులో అధునాతన మెలకువలను సూచిస్తారు. ఆదర్శ రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేందుకు కూడా ఈ కార్యక్రమం వీలు కల్పిస్తుంది.

రైతులతో కలిసి భవిష్యత్ కార్యక్రమాలు

ప్రతి సీజన్‌లో రైతులు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఎప్పటికప్పుడు వాళ్లకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుంది. రైతులు నేరుగా వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుంది. ఎప్పుడూ ప్రభుత్వమే ప్రజల దగ్గరికి వెళ్లాలి. అందులో భాగంగానే రైతుల సమస్యలను తెలుసుకోవాలనే ఆలోచనతో వ్యవసాయ శాఖ 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని చేపట్టింది. మా ప్రభుత్వం రైతులతో కలిసిమెలిసి భవిష్యత్ కార్యక్రమాలను చేపడుతుంది. విత్తనాలు, ఎరువుల సరఫరా, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో మా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రైతుభరోసా, రుణమాఫీ, విత్తనాలు అందుబాటులోకి తీసుకురావటం, ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి కార్యక్రమాలన్నీ చేపడుతోంది.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

రాష్ట్రంలో దాదాపు 26 రకాల పంటలు పండటానికి అనుకూలమైన భూములు, వాతావరణం ఉన్నాయి. రైతులు కేవలం వరి, పత్తి, మిర్చి పంటలకే పరిమితం కావొద్దు. ఇతర పంటలు సాగు చేయాలి. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుంది. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడి, ఎక్కువ లాభాలు వచ్చేలా పంటల ప్రణాళికను రూపొందించుకోవాలి. వ్యవసాయ శాఖ చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి. దీనిద్వారా తమ సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకురావొచ్చు. ప్రస్తుతం 110 సెంటర్లలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో అన్ని గ్రామాలకు విస్తరిస్తాం.

రైతులు ధైర్యం కోల్పోవద్దు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సూచనలతో ప్రభుత్వం ఇటీవలే పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. రైతులు ఏదైనా ఆపదతో చనిపోతే ఆ కుటుంబాన్ని రైతు బీమా పథకం ఆదుకుంటే.. రైతులు ధీమాగా బతికేందుకు పంటల బీమా పనిచేస్తుంది. పంట వేసినప్పటి నుంచి కరువు వచ్చినా, వరద వచ్చినా నష్టపరిహారం అందుతుంది. రైతులు పెట్టిన పెట్టుబడి అయినా తిరిగి వస్తుంది. వారు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి ఉండదు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులు ధైర్యం కోల్పోవద్దు. ప్రభుత్వం అండగా ఉంటుంది..''అని సీఎం రేవంత్ చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లకు భద్రాద్రిలో శ్రీకారం

- 11న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- మంత్రి పొంగులేటి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 11న భద్రాచలం రాముడి సన్నిధిలో ఐదో గ్యారంటీ అయిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తొమ్మిదిన్నరేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వారు తమ కర్తవ్యాన్ని విస్మరిస్తే, నిరుపేదలకు నిలువనీడ కల్పించడం తక్షణ కర్తవ్యమని, పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ రాజ్యమనే భావనతో పేదలకు ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై బుధవారం ఆయన సచివాలయం నుంచి సమీక్ష జరిపారు. ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం, ఇంటి స్థలం ఉన్నవారికి ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం అందించడానికి అవసరమైన కార్యాచరణ ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. తొలివిడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. సొంత స్థలం ఉన్న వారు 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఇళ్లు నిర్మించుకోవాలని, హాల్, బెడ్‌రూంతో పాటు వంటగది, బాత్‌రూం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళల పేరు మీద ఈ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి ఆహార భద్రతా కార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు మార్గదర్శకాలను వెంటనే తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఎన్నికల్లో డబ్బు పాత్రను తగ్గించాలి

ఎన్నికల సంఘానికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడి లేఖ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో డబ్బు పాత్రను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రస్తుత కాలంలో ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయని ప్రజల్లో నమ్మకంలేదని, ఈ అపవాదును పోగొట్టే ప్రయత్నం జరగాలని కోరారు. చట్ట సభల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక్కో అభ్యర్థి రూ.40 కోట్లకు మించి ఖర్చు చేస్తున్నా.. జిల్లా ఎన్నికల అధికారికి మాత్రం రూ. 40 లక్షలు మాత్రమే ఖర్చు అయ్యాయని చెబుతుంటే పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను అయినా ధన ప్రభావం లేకుండా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆగస్టు 7, 8న గ్రూప్–2

▶ మొదటి పేజీ తరువాయి

షెడ్యూల్‌ను ప్రకటించడంతో ఏయే పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావొచ్చనే దానిపై అభ్యర్థులు వ్యూహాత్మక ప్రణాళిక తయారు చేసుకునే వీలు కల్పించినట్టు అయిందని నిపుణులు చెప్తున్నారు. ఈ ఏడాది జూన్ 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ జరగనుంది. అంటే ఈ పరీక్షలకు నాలుగు నెలల వ్యవధి లభించింది. తర్వాత గ్రూప్–2 పరీక్షలకు మరో రెండు నెలల సమయం ఉంది. ఆ తర్వాత గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు రెండు నెలల వ్యవధి ఉండటంతో సిద్ధమయ్యేందుకు వీలవనుంది. ఇక గ్రూప్–1 మెయిన్స్ తర్వాత నెల రోజులకు గ్రూప్–3 పరీక్షలు ఉన్నాయి. మొత్తంగా పరీక్షలకు సమయం సంతృప్తికర స్థాయిలో ఉందని, అభ్యర్థులు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావొచ్చని నిపుణులు సైతం సూచిస్తున్నారు.

ఎన్నికల తర్వాత బీజేపీలో బీఆర్ఎస్ విలీనం

టీపీసీసీ అధికార ప్రతినిధి పున్నా కైలాశ్ నేత

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల తర్వాత బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని టీపీసీసీ అధికార ప్రతినిధి పున్నా కై లాశ్ నేత జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ హోల్‌సేల్‌గా అమ్మకానికి పెట్టారని ఆయన ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో మరో అధికార ప్రతినిధి జ్ఞానసుందర్‌తో కలిసి కైలాశ్ నేత విలేకరులతో మాట్లాడారు. బీజేపీని గెలిపించాలన్న ఆలోచనతోనే బీఆర్ఎస్ డమ్మీ అభ్యర్థులను ఈసారి బరిలోకి దింపుతోందన్నారు. బీఎస్పీ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్‌ల మధ్య ఉన్న చీకటి ముసుగు తొలగిపోయిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, దీన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

- టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి పారిశ్రామిక ఉత్పత్తులను ఎగుమతి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో ఐలా ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ పబ్లిక్ పార్కును టీఎస్ఐఐసీ సీఈఓ మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ శ్యాంసుదర్, చర్లపల్లి ఐలా అధ్యక్షుడు జెక్క రోషిరెడ్డిలతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన భారీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్లపల్లి ఐలా రాష్ట్రంలోని ఇతర పారిశ్రామికవాడలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ బి.మాధవి, టీఎస్ఐఐసీ అధికారులు వినోద్ కుమార్ జ్యోతి, చర్లపలి ఐలా కమిషనర్ తుల్జా నాయక్, సీఐఏ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి మాజీ చైర్మన్ మనోహర్ రాజు, ఐలా కార్యదర్శి అంబటి వేంకటేశ్వర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు, పీఎస్ఎన్ ప్రసాద్, వెంకట్రామ్‌రెడ్డి, హనుమాన్ ప్రసాద్, కమిటీ సభ్యులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పీసీబీ పారదర్శకంగా పనిచేసేలా చర్యలు చేపట్టండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)లోని అధికారుల తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సమస్యపై సుమోటోగా చర్యలు తీసుకొని పారదర్శకంగా పనిచేసేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చిచెప్పింది. పీసీబీ అధికారి కృపానంద్ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఆయన జారీ చేసిన షోకాజ్ నోటీసును రద్దు చేసింది. పీసీబీ జారీ చేసిన నోటీసులకు తాము జనవరి 30న వివరణ ఇచ్చినా ఇవ్వలేదంటూ ఫిబ్రవరి 15న కంపెనీ మూసివేతకు నోటీసు లివ్వడాన్ని సవాల్ చేస్తూ ఫోస్టర్స్ కంపెనీ హైకోర్టు కెక్కింది. జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘిస్తూ షోకాజ్ నోటీసు ఇచ్చారని పేర్కొంది. మూసివేత ఉత్తర్వులను కొట్టేసేలా ఆదేశాలివ్వాలని కోరింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధ వారం విచారణ చేపట్టి పీసీబీ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 'ఇది చాలా విచారకరం.. అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. 7 నెలలుగా పీసీబీ అధికారుల తీరును గమనిస్తున్నాం. ఒక అధికారి నోటీసులిస్తే మరొకరు చర్యలు చేపడతారు. పీసీబీ తీరుపై సుమోటోగా విచారణ చేపడతాం' అని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల మూసివేత ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చింది.

తూప్రాన్ మున్సిపాలిటీ 'హస్త'గతం

- అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి
- నెగ్గిన అవిశ్వాసం, చైర్మన్‌గా నందాల శ్రీనివాస్



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన సభ్యులు

తూప్రాన్: మాజీ సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని తూప్రాన్ మున్సిపాలిటీ 'హస్త'గతమైంది. బుధవారం చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గి కాంగ్రెస్ పరమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అనుహ్యంగా అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించడం విశేషం. మున్సిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, తొమ్మిదిమంది కాంగ్రెస్ కౌన్సిలర్లు కాగా ఒకరు బీజేపీ కౌన్సిలర్ ఉన్నారు. అవిశ్వాసం నెగ్గేందుకు 2/3 పద్ధతిలో 11 మంది కౌన్సిలర్లు అవసరం. కానీ సంఖ్యా పరంగా బీజేపీ కౌన్సిలర్ మద్దతుతో 10 మంది సభ్యులు మాత్రమే అవిశ్వాసం వైపు ఉన్నారు. పదిరోజుల క్రితం బీఆర్ఎస్ నుంచి ఓ కౌన్సిలర్ కాంగ్రెస్ వైపు వచ్చి చేరినా తిరిగి వెంటనే బీఆర్ఎస్ వైపునకు వెళ్లిపోయాడు. దీంతో అవిశ్వాసానికి సరిపడే మ్యాజిక్ నెంబర్ 11 ఒకింత ఉత్కంఠ రేపింది.

కీలకంగా మారిన ఎమ్మెల్సీ ఓటు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా రంగ ప్రవేశం చేసి అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. ఓటింగ్‌లో కాంగ్రెస్ కౌన్సిలర్లకు మద్దతు పలికారు. దీంతో చైర్మన్ రవీందర్ గౌడ్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న నందాల శ్రీనివాస్‌కు తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల అధికారులకు నివేదిక పంపించిన అనంతరం శాశ్వత చైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఆర్డీఓ తెలిపారు.

రోడ్ల అనుమతుల్లో వేగం పెంచాలి

వివిధ శాఖలతో అటవీ శాఖ అధికారుల సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యంతో పాటు, వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచేందుకు సంబంధిత శాఖలు పారదర్శకంగా స్పందించాలని అటవీ శాఖ సూచించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు కనెక్టివిటీని పెంచటం, మంజూరైన వివిధ రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఈ నేపథ్యంలో బుధవారం అరణ్యభవన్‌లో సంబంధిత పంచాయితీ రాజ్, రోడ్లు భవనాల శాఖ, నేషనల్ హైవేస్ అధికారులతో పీసీసీఎఫ్ (అటవీ అనుమతులు) ఎం.సీ. పర్గెయిన్ సమావేశమయ్యారు. కేంద్ర అటవీశాఖ తరఫున రీజనల్ ఆఫీసర్ (చెన్నై) త్రినాథ్‌కుమార్ సమావేశానికి హాజరై అటవీ అనుమతుల విధానంలో పాటించాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మొత్తం 157రోడ్లకు సంబంధించిన అనుమతులు, ప్రస్తుత పురోగతి, కార్యాచరణపై వివిధ శాఖల అధికారులతో అటవీశాఖ చర్చించింది.

బీఎస్పీతో పొత్తుతో బీఆర్ఎస్ బలహీనత బయటపడింది

కాంగ్రెస్ నేత నిరంజన్

సాక్షి, హైదరాబాద్: బీఎస్పీతో పొత్తు కుదుర్చుకోవాలని తీసుకున్న నిర్ణయంతోనే బీఆర్ఎస్ ఎంత బలహీనపడిందో అర్థమవుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత గోపిశెట్టి నిరంజన్ వ్యాఖ్యానించారు. రిపేర్ కోసం గ్యారేజీకి వెళ్లిన కారు వెనుక నుంచి నెట్టనిదే ముందుకు కదల్లేని పరిస్థితిలో ఉందని, ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ నానా తంటాలు పడుతోందని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబద్ధత గల అధికారిగా మంచి పేరున్న ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్ కేసీఆర్ పంచన ఎందుకు చేరినట్టని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో దళితుడిని సీఎం చేస్తానని చేయనందుకా? మూడెకరాల భూమి దళితులకు ఇవ్వనందుకా? అని నిలదీశారు. ఎన్ని మాయమాటలు చెప్పినా, ఎవరితో కలిసినా కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని నిరంజన్ స్పష్టం చేశారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

గోల్కొండ: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకంగా మారిందని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ ఉమెన్స్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు ప్రపంచంలోని అన్ని దేశాల్లో శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు రాజకీయ రంగంలో సైతం మహిళలే అగ్రపథాన ఉన్నారని ఆమె అన్నారు. భారతదేశంలో సైతం మహిళలు ముక్తకంఠంతో తమ హక్కుల కోసం ఏకమవుతున్నారని ఆమె అన్నారు. కాన్‌క్లేవ్, జీఎన్ఐటీఎస్, సిఐఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యరెడ్డి మాట్లాడుతూ మొదటి ఉమెన్ కాన్‌క్లేవ్‌కు భారీ స్పందన వచ్చిందన్నారు.

మోదీ స్థాయికి అలా మాట్లాడటం తగదు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా తెలంగాణ రాష్ట్రం ఉపయోగపడుతోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం ఆయన స్థాయికి తగింది కాదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అవినీతికి పాల్పడిందని, కాళేశ్వరం ప్రాజెక్టు వారికి ఏటీఎంలా మారిందని పలుమార్లు మోదీ, అమిత్ షాలు చెప్పారని గుర్తు చేశారు. అయినా బీఆర్ఎస్.. వారికి పేటీఎంగా ఉన్నందుకే చర్యలు తీసుకోలేదా అని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు చరణ్‌కౌశిక్‌యాదవ్, లింగం యాదవ్, కిరణ్, అనిల్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్పులకుప్పగా మారిన రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అవకాశం లేక ప్రధాని మోదీ ఏవేవో ఆరోపణలు చేసి వెళ్లిపోయారన్నారు.

మా అత్తమ్మే నాకు స్ఫూర్తి



రాయదుర్గం: మహిళలు కుటుంబాన్ని చాలా ప్రభావితం చేస్తారని, కుటుంబ మనుగడలో వీరి పాత్ర కీలకమని హీరో రాంచరణ్ సతీమణి ఉపాసన అన్నారు. నాలెడ్జి సిటీలోని టి-హబ్‌లో ట్రంఫ్ ఆఫ్ టాలెంట్ హౌజ్ ఆఫ్ మేక్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో రాణించిన మహిళలకు విమెన్ ఆఫ్ ఇంపాక్ట్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మా అత్తమ్మ ఎంతో ప్రేమగల వ్యక్తి..ఆమే నాకు స్ఫూర్తి' అని చెప్పారు. ప్రధానంగా నేడు ధైర్యంగా, దృఢంగా ఉండే మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపేందుకే ఈ అవార్డుల కార్యక్రమానికి వచ్చానన్నారు. ఎలికో లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ వనితా దాట్ల మహిళలు అన్ని రంగాల్లో రాణించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో టి-హబ్ సీఈఓ ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎస్‌బీసీ ఎండీ మమతా మాదిరెడ్డి, పూర్వవిద్యార్థుల సంఘం కోఫౌండర్ ఆదితి ఆర్య కోటక్, శిల్పారెడ్డి ప్రసంగించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీతాలు ఇవ్వండి

సీఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని లేఖ

సాక్షి, హైదరాబాద్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఎన్‌హెచ్‌ఎంలో దాదాపు 17 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని, వీరికి మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో జీతాలు ఆగినట్లు తెలుస్తోందని, అయితే హెల్త్ మిషన్ ఉద్యోగుల ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి జీతాల కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని, వెంటనే జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కూనంనేని కోరారు.

ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో నగరవాసి మృతి

- పాతబస్తీకి చెందిన అఫ్సాన్ చనిపోయినట్టు ధృవీకరణ
- రష్యాలోని భారత ఎంబసీ నుంచి సమాచారం




మృతుడు మహ్మద్ అఫ్సాన్ (ఫైల్)



ఇంకా రష్యాలోనే చిక్కుకున్న సుఫియాన్

సాక్షి, సిటీబ్యూరో: ఉపాధి, అధిక వేతనం ఆశ.. ఏజెంట్ల మోసం కారణంగా పాతబస్తీకి చెందిన ఓ యువకుడు రష్యాలో మృత్యువాతపడ్డాడు. బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ అఫ్సాన్ ఉద్యోగం కోసం రష్యాకు వెళ్లగా.. ఏజెంట్ల చేతిలో మోసపోయి రష్యాలోని పుతిన్ ప్రైవేట్ సైన్యంలో చేరాల్సి వచ్చింది. ఇతను ఉక్రెయిన్‌తో యుద్ధంలో పాల్గొని అక్కడే అసువులు బాశాడు. ఈమేరకు రష్యాలోని భారతీయ రాయబారి కార్యాలయానికి సమాచారం అందింది. వారు బుధవారం అఫ్సాన్ సోదరుడు ఇమ్రాన్‌కు ఫోన్ చేసి ఈ విషయం తెలిపారు. దీంతో బజార్‌ఘాట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా అఫ్సాన్ దీన స్థితిని వివరించి కాపాడాలని ఇక్కడి ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే తన సోదరుడు చనిపోయాడని ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. నారాయణ్‌పేట్‌కు చెందిన మహ్మద్ సుఫియాన్ అనే మరో యువకుడు ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయాడని, కనీసం అతడినైనా కాపాడాలని ఇమ్రాన్ విజ్ఞప్తి చేశాడు. ఆయన ఇక్కడ సాక్షి ప్రతినిధితో మాట్లాడుతూ తన సోదరుడిని బాబా బ్లాక్స్ కంపెనీ ఉద్యోగంలోకి తీసుకుందని, ఆ సంస్థ దుబాయ్, ఢిల్లీ, ముంబైలో కార్యాలయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారత్ నుంచి వెళ్లిన వారికి ఆర్మీ హెల్పర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని ఏజెంట్లు చెప్పారని, చివరికి వారిని సైన్యంలోకి చేర్చి ఉక్రెయిన్ సరిహద్దుల్లో మోహరించినట్లు వివరించారు. కాగా అఫ్సాన్‌కు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలిసి వీరు కన్నీరుమున్నీరయ్యారు.



ప్రతి ఒక్కరూ కఠినతరమైన పోరాటం చేస్తున్నవారే,
అందుకే మీరు కలిసి అందరితోనూ దయగా వ్యవహరించండి.
– సోక్రటీస్

సాక్షి
గురువారం, 7 మార్చి 2024

నల్ల కోటు... రాజకీయం!

కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ రాజ్యానికి మూలస్తంభాలు. ఇందులో న్యాయ వ్యవస్థ మిగిలిన రెండింటికంటే విశిష్టమైనది. ఎందుకంటే మొత్తం మూడు వ్యవస్థల పరిధులనూ, పరిమితులనూ నిర్ణయించగల, నిర్దేశించగల స్థానం ఆ ఒక్క వ్యవస్థకు మాత్రమే వుంది. ఇతర రెండు వ్యవస్థలతో పోలిస్తే ఇప్పటికీ న్యాయ వ్యవస్థపై ప్రజలకు కొద్దో గొప్పో విశ్వసనీయత వుంది. దానికి విఘాతం కలిగించే పరిణామాలు అడపా దడపా చోటుచేసుకుంటున్న సంగతి కూడా కాదనలేనిది. 175 ఏళ్ల చరిత్ర కలిగిన కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి, ఆ పదవికి రాజీనామా ఇచ్చిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ వైనం అటువంటిదే. తన రాజకీయ రంగ ప్రవేశంపై జస్టిస్ గంగోపాధ్యాయ ఇచ్చిన సంజాయిషీ ఆశ్చర్యం కలిగిస్తుంది. అధికార పక్షమైన తృణమూల్ కాంగ్రెస్ తనను రోజూ దుమ్మెత్తిపోయటం, అసభ్య పదజాలంతో దూషించటం ఆయన తట్టుకోలేకపోయారట. కనుక నల్లకోటు, న్యాయదండం విడిచిపెట్టి ఒక రాజకీయ పార్టీ కండువా కప్పుకోవటమే ఆయనకు పరిష్కారంగా తోచింది! అలా అసభ్య పదజాలంతో దూషించే నేతలకు చదువు సక్రమంగా లేదన్న జస్టిస్ గంగోపాధ్యాయ విమర్శలో నిజం వుండొచ్చు. కానీ ఆయన చదువుసంధ్యలూ, విజ్ఞతా ఏమయ్యాయి? తాను వెలువరించే తీర్పులకు పూలు తప్ప రాళ్లు పడవని ఎలా అనుకున్నారు?

తృణమూల్ సర్కారుపై వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో జస్టిస్ గంగోపాధ్యాయ కఠినంగా వ్యవహరించారన్న పేరు వుంది. మొత్తం 14 ఉదంతాల్లో ఆయన సీబీఐ దర్యాప్తు జరపాలని ఆదేశించారు. అందులో ఉపాధ్యాయ నియామకాల కోసం పెద్దయెత్తున ముడుపులు చేతులు మారాయన్న స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్సెస్సీ) కేసు ప్రధానమైనది. ఆయన ఉత్తర్వుల కారణంగా 2022లో ఉన్నత విద్యాశాఖమంత్రిగా వున్న పార్థా ఛటర్జీతోపాటు దళారులు, డబ్బులిచ్చి ఉద్యోగాల్లోకొచ్చిన కొందరు టీచర్లు అరెస్టయ్యారు. నిజానికి ఆ కేసులో జస్టిస్ గంగోపాధ్యాయ ఇచ్చిన ఆదేశాలు ఆయనకు పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చాయి. అవినీతిపై నిప్పులు కక్కే యోధుడిగా, సీఎం పదవికి అన్నివిధాలా అర్హతగల వ్యక్తిగా లోక్‌సభ కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌధురి అప్పట్లో కీర్తించారు. వామపక్షాలు సైతం ఆయన తీర్పులను ప్రశంసించాయి. కానీ అవి జస్టిస్ గంగోపాధ్యాయ చెవికి సోకినట్టు లేదు. 'న్యాయమూర్తులుగా తమ తీర్పులు నచ్చకపోతే విమర్శించవచ్చు, అప్పీల్‌కు పోవచ్చు. కానీ దూషిస్తారా?' అని ఆయన ప్రశ్నించటం సబబే. కానీ ఆయన చేయాల్సిందేమిటి? దూషణలకు జవాబుగా ఒక రాజకీయ పార్టీ కండువా కప్పుకోవటమా? ఇందువల్ల ఆయనకుగానీ, మొత్తంగా వ్యవస్థకుగానీ విశ్వసనీయత పెరుగుతుందా? నిరుడు జస్టిస్ గంగోపాధ్యాయ తృణమూల్‌ను విమర్శిస్తూ స్థానిక చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ దాన్ని తీవ్రంగా తప్పుబట్టి మందలించినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

న్యాయమూర్తి పదవిలో వుంటూ రాజీనామా చేసి రాజకీయ రంగ ప్రవేశం చేయటం జస్టిస్ గంగోపాధ్యాయతోనే మొదలు కాలేదు. 1967లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కోకా సుబ్బారావుతోపాటు జస్టిస్ రంగనాథ్ మిశ్రా, జస్టిస్ బహరూల్ ఇస్లాం, జస్టిస్ ఫాతిమా, జస్టిస్ సదాశివం, జస్టిస్ రంజన్ గొగోయ్ వరకూ ఎందరో వున్నారు. జస్టిస్ బహరూల్ ఇస్లాం 1983లో అప్పటి బిహార్ పీసీసీ(ఐ) అధ్యక్షుడు జగన్నాథ్ మిశ్రాపై వచ్చిన ఫోర్జరీ, నేరపూరిత ప్రవర్తన ఆరోపణలనుంచి ఆయన్ను విముక్తి చేసిన నెల రోజులకే అస్సాంలో ఎంపీగా పోటీచేసే అవకాశం వచ్చింది. ఇది తీవ్ర విమర్శలకు దారితీసింది. రిటైర్మెంట్ అనంతరం లా కమిషన్, మానవహక్కుల సంఘం, కంపెనీ లా బోర్డు, వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ వంటి సంస్థలకు నేతృత్వం వహించే అవకాశం ఎటూ వుంటుంది. అది కూడా సరికాదని అభ్యంతరం చెప్పేవారున్నారు. రాజీనామా చేసిన వెంటనే బీజేపీలో చేరబోతున్నట్టు ప్రకటించటం, అంతకు వారంరోజుల ముందు ఆ పార్టీ నేతలను సంప్రదించినట్టు చెప్పటం జస్టిస్ గంగోపాధ్యాయ విజ్ఞతపై సందేహాలు రేకెత్తిస్తుంది. ఈ వారంరోజుల్లో కేసులేమీ చూడలేదన్నంత మాత్రాన ఈ సందేహాలు సమసిపోవు. మిమ్మల్ని ముందుగా బీజేపీ నేతలే సంప్రదించారా అన్న ప్రశ్నకు ఆయన లౌక్యంగా 'మేమిద్దరం ఒకరినొకరం సంప్రదించుకున్నాం' అని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ నీతివంతమైన పాలన గురించి ఎవరికీ భ్రమల్లేవు. నాలుగైదేళ్ల క్రితం ముఖ్యమంత్రి మమతా బెనర్జీయే తమ పార్టీలో అవినీతి నేతలు మితిమీరుతున్నారనీ, వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాల్సి వుంటుందనీ హెచ్చరించిన సంగతి అందరికీ గుర్తుంది. ఇలాంటి పరిస్థితి వున్నది గనుకే జస్టిస్ గంగోపాధ్యాయ వెలువరించిన తీర్పులను అనేకులు ప్రశంసించారు. తన రాజకీయ రంగ ప్రవేశ నిర్ణయంతో ఆ తీర్పులపై సందేహాలు తలెత్తటానికి ఆయనే కారకులయ్యారు.

బీజేపీ నేతలు స్వర్గీయ అరుణ్ జైట్లీ, ప్రస్తుత కేంద్రమంత్రి నితీన్ గడ్కరి వంటివారు పదవీ విరమణ తర్వాత జడ్జీలు ఏ పదవీ తీసుకోరాదని అభిప్రాయపడ్డారు. అసలు సీవీసీ పదవికున్నట్టే జడ్జీలకు సైతం రిటైరయ్యాక పదవులు చేపట్టరాదన్న ఆంక్షలుండాలని చాలామంది చెబుతారు. అలా కాకపోయినా కనీసం రెండేళ్లపాటు ఏ పదవీ తీసుకోకుండా వుండటం శ్రేయస్కరం. రాజకీయాలకు అతీతంగా న్యాయవ్యవస్థ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగల స్థితిలో వుందనే సంకేతం మన దేశ గౌరవాన్ని మరింత పెంచుతుందని అందరూ గుర్తించాలి.

వృద్ధి గాథలో చూడాల్సిన కోణం

విశ్లేషణ



మైత్రీశ్ ఘటక్

జీడీపీలో భారత్ ప్రపంచంలో ఐదవ స్థానంలో ఉంది. 1990ల్లో 17వ స్థానంలో ఉండేది. మూడు దశాబ్దాల క్రితం తలసరి ఆదాయంలో 161వ స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు కేవలం 159వ స్థానానికి మాత్రమే ఎగబాకింది. తలసరి ఆదాయం పెరగకుండా జీడీపీ పెరగడం దీనికి ఒక కారణం. భారత తలసరి జీడీపీ ర్యాంకింగ్ పెరగాలంటే, సగటు వృద్ధి రేటు చాలా ఎక్కువుండాలి. గత మూడు దశాబ్దాల వృద్ధి లాభాల్లో ఎక్కువ భాగం జనాభాలోని ఒక చిన్న వర్గంలో కేంద్రీకృతమై ఉంది. దేశ జనాభాకు సంబంధించి అది చిన్నదే అయినా, మార్కెట్‌గా ఆ సమూహ పరిమాణం తక్కువ కాదు. ప్రపంచ దేశాలు ఆర్థిక శక్తిగా భారత్‌పై దృష్టి సారిస్తున్నాయంటే కారణం ఇదే.

భారతదేశ స్థూల దేశీయోత్పత్తి ఇప్పుడు ప్రపంచంలోనే ఐదవ స్థానంలో ఉంది. 2030 నాటికి మన జీడీపీ మూడవ స్థానానికి చేరుకుంటుందని అంచనా. 1990ల ప్రారంభంలో, జీడీపీ పరంగా భారతదేశం 17వ స్థానంలో ఉండేది. ఈ విషయంలో దాని సాపేక్ష స్థానం గణనీయంగా మెరుగుపడిందనడంలో సందేహం లేదు. అయితే, తలసరి ఆదాయం ప్రాతిపదికన, భారతదేశం 1990ల ప్రారంభంలో 161వ స్థానంలో ఉండగా ఇప్పుడు 159వ స్థానంలో ఉంది. అంటే, తలసరి ఆదాయం పరంగా భారతదేశ సాపేక్ష స్థానం జీడీపీ పరంగా 17వ స్థానం నుండి 5వ స్థానానికి చేరుకున్న కాలంలోనూ పెద్దగా మారలేదు. ఎందుకు?

తలసరి ఆదాయాన్ని పెంచకుండా యాంత్రికంగా జీడీపీని పెంచే జనాభా పెరుగుదలే దీనికి కారణమని అనుకోవచ్చు. కానీ అది కారణం కాదు. వాస్తవానికి, జనాభా పరంగా భారతదేశ సాపేక్ష స్థానం ఈ కాలంలో ప్రపంచంలో రెండవ అతిపెద్ద (చైనా తర్వాత) దేశంగా ఉంది. అంతే కాదు, చర్చిస్తున్న కాలంలో జనాభా పెరుగుదల రేటు విషయంలో భారత్‌కూ, ప్రపంచ సగటుకూ గణనీయంగా తేడా లేదు. పైగా కాలక్రమేణా, దాని జనాభా పెరుగుదల రేటు తగ్గింది.

1991, 2021 మధ్య తలసరి స్థూల దేశీయోత్పత్తి ఏడు రెట్లు ఎక్కువ పెరిగిందనే వాస్తవంలో కొంత సమాధానం ఉంది. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మినహాయిస్తే, దేశ తలసరి వాస్తవ జీడీపీ దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు చూడవచ్చు. అయినప్పటికీ, జీడీపీ ర్యాంకింగ్ మెరుగుపడి తలసరి జీడీపీ ఎందుకు స్తబ్దుగా ఉంది?

ఒక ఉదాహరణ చెప్తాను. ఒక దేశ తలసరి జీడీపీ దశాబ్దంలో రెట్టింపు అయిందనుకుందాం. ఆ దేశాలు ఇప్పటికే తలసరి సగటు జీడీపీని ఎక్కువగా కలిగి ఉన్నట్లయితే లేదా అవి కూడా సహేతుకమైన అధిక రేటుతో వృద్ధి చెందుతున్నట్లయితే, ఇతర దేశాలతో పోలిస్తే దాని సాపేక్ష స్థితిలో పెద్ద తేడా ఉండకపోవచ్చు. కానీ, ఆ దేశ జనాభా ఎంత పెద్దదైతే, మొత్తం జీడీపీ విలువ ఆ జనాభా దామాషా ప్రకారం అంత ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు, దాని జనాభా రెట్టింపు అయితే, మొత్తం జీడీపీ నాలుగు రెట్లు పెరుగుతుంది. మనం దీనిని జనాభా గుణకం ప్రభావం అని పిలవవచ్చు. ఇతర దేశాలతో పోలిస్తే అధిక జనాభా ఉన్న దేశ సాపేక్ష స్థానం జీడీపీ పరంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పెద్ద జనాభా గుణకం కారణంగానే భారతదేశం 1990ల ప్రారంభం నుండి ఇప్పటి వరకు జీడీపీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎదగగలిగింది. కానీ భారత తలసరి జీడీపీ ర్యాంకింగ్‌ను పెంచడానికి సగటు వృద్ధి రేటు ఇంకా ఎక్కువగా ఉండాలి.

అనేక దశాబ్దాలుగా జీడీపీ ర్యాంకింగ్‌లో భారత్ సాధిస్తున్న మెరుగుదల వెనుక... అధిక జనాభా, తలసరి జీడీపీకి చెందిన అధిక వృద్ధిరేటు కలయిక దాగి ఉంది. చైనాతో పోల్చి చూద్దాం. 1991, 2021 మధ్య, జీడీపీలో చైనా ర్యాంక్ 11 నుండి 2వ స్థానానికి పెరిగింది. అదే



సమయంలో సగటు తలసరి ఆదాయంలో దాని స్థానం 158 నుండి 75కి పెరిగింది. ఈ కాలంలో దాని తలసరి జీడీపీ 38 రెట్లు పెరిగింది. అయితే భారతదేశ తలసరి జీడీపీ కేవలం ఏడు రెట్లు మాత్రమే పెరిగింది. చైనాలో ఎక్కువ జనాభా ఉన్నందున, జనాభా గుణకం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కానీ వారు సగటు తలసరి ఆదాయాన్ని కూడా అనేక రెట్లు పెంచుకోగలిగారు. కాబట్టి మొత్తం ఆదాయం, తలసరి ఆదాయం రెండింటిలోనూ వారి సాపేక్ష స్థానం మెరుగుపడింది.

ఇప్పుడు, అసమానతల వెలుగులో, జీడీపీ లేదా జాతీయ ఆదాయం అనేది సగటు వ్యక్తి జీవన నాణ్యతకు నమ్మదగిన కొలమానం కాదని అందరికీ తెలుసు. ధనవంతులైన 10 శాతం మంది ఆదాయం 10 శాతం పెరిగి, మిగిలిన వారి ఆదాయం అలాగే ఉంటే, జాతీయ ఆదాయం 10 శాతం వృద్ధిని నమోదు చేస్తుంది. తలసరి జీడీపీ ఈ విషయంలో సాధారణ ప్రజల జీవన ప్రమాణానికి కొంచెం ఎక్కువ విశ్వసనీయ సూచికగా ఉంటుంది. ఈ ఉదాహరణలో, తలసరి ఆదాయం 1 శాతం మాత్రమే పెరుగుతుంది.

అభివృద్ధి పరంగా నిజమైన ప్రశ్న ఏమిటంటే, మొత్తం లేదా సగటు జాతీయ వృద్ధిరేటు సాధారణ జనాభా జీవన ప్రమాణాల పెరుగుదలను ఎంతవరకు ప్రతిబింబిస్తుంది అనేది. ఇప్పుడు, అధిక జనాభా కలిగిన దేశం తన తలసరి ఆదాయాన్ని దీర్ఘకాలంపాటు పెంచగలిగితే, పేదల ఉనికి ఎల్లప్పుడూ సగటు కంటే తక్కువగా ఉంటుంది కాబట్టి అది కొంత విశ్వసనీయతకు అర్హమైనది. తలసరి ఆదాయం తక్కువగా ఉన్నప్పటికీ, ప్రపంచ దేశాలు ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా భారత్‌పై దృష్టి సారిస్తున్నాయంటే కారణం ఏమిటి? ఈ గణాంకాలు మొత్తం చిత్రాన్ని పట్టుకోకపోయినా, ఇంకేదాన్నో సూచిస్తాయి. మార్కెట్ సైజు, జీడీపీ వృద్ధి లాభాల్లో సింహభాగాన్ని కైవసం చేసుకుంటున్న జనాభాలోని అతి చిన్న భాగపు సౌభాగ్యం ఇందులో ఉంది. అత్యధిక రాబడిని కోరుకునే మార్కెట్లు లేదా సరళమైన గ్లోబల్ క్యాపిటల్‌పై నిశితమైన దృష్టిని కలిగి ఉన్న బహుళజాతి సంస్థలు మొత్తం లేదా తలసరి జీడీపీ గురించి పట్టించుకోవు. గత మూడు దశాబ్దాలుగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలోని ఒక చిన్న భాగం వారికి ముఖ్యం.

గత మూడు దశాబ్దాల వృద్ధి లాభాల్లో ఎక్కువ భాగం జనాభాలోని ఒక చిన్న వర్గంలో కేంద్రీకృతమై ఉంది. అయితే భారత దేశ జనాభాకు సంబంధించి అది చిన్నదే అయినప్పటికీ, మార్కెట్‌గా ఆ సమూహ పరిమాణం తక్కువ కాదు. ఎందుకంటే బ్రిటన్ లేదా ఫ్రాన్స్ మొత్తం జనాభా భారతదేశ మొత్తం జనాభాలో 4–5 శాతానికి దగ్గరగా ఉంటుంది. చిన్న దేశాలలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉండవచ్చు లేదా వేగంగా వృద్ధి చెందవచ్చు. కానీ మార్కెట్ పరిమాణం కారణంగా భారతదేశం ముఖ్యమైనది. కాబట్టి మొత్తం జీడీపీ విలువ లేదా దాని వృద్ధి రేటు అభివృద్ధికి కొలమానంగా బలహీనంగా ఉన్నప్పటికీ లేదా జనాభాలో అధిక భాగం పేదగా ఉన్నప్పటికీ, ఇది బాగా డబ్బున్న, సంపన్న సమూహపు కొనుగోలు శక్తికి సూచిక. ఆర్థిక వ్యవస్థలోని ఈ విభాగం లగ్జరీ కార్లు లేదా ఫ్యాన్సీ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌గా పరిమాణ పరంగా చూస్తే అనేక సంపన్న దేశాలతో పోటీపడగలదు. అదే సమయంలో మెరిసే షాపింగ్ మాల్స్, విలాసవంతమైన వస్తువులు, సేవల వినియోగం పెరగడం వల్ల భారత్ ప్రకాశిస్తున్నట్లు భ్రమ కలగవచ్చు.

మార్కెట్ పరిమాణం ఎందుకు ముఖ్యమైనది? మొదటిది, భారీ స్థాయి తయారీ పరిశ్రమలకు సంభావ్య కొనుగోలుదారుల పరంగా నిర్దిష్ట పరిమాణంలోని మార్కెట్ అవసరం. లేకపోతే, పెట్టుబడి లాభదాయకం కాదు. రెండవది, తలసరి ఆదాయంతో సంబంధం లేకుండా, ఒక పెద్ద దేశం జనాభాలో కొంత భాగం ఆదాయం నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే, దాని డిమాండ్లు అవసరాల నుండి విలాసాలకు మారుతాయి.

కాబట్టి, జీడీపీ పరంగా భారతదేశ పెరుగుదల పూర్తిగా గణాంక నిర్మాణమేననీ, ఇది సామాన్యుల జీవన ప్రమాణాన్ని ప్రతిబింబించదనీ లేదా సగటు తలసరి ఆదాయం పెరగలేదనీ ఎవరైనా అనుకుంటే... వాళ్లు అసలు కథను విస్మరిస్తున్నట్టు. కొనుగోలు శక్తి జనాభాలోని నిర్దిష్ట విభాగానికి విపరీతంగా పెరిగింది. కాకపోతే సమస్య ఏమిటంటే– సప్లయ్, డిమాండ్ ఆట ఒక చిన్న విభాగానికే పరిమితమైతే... అది జనాభాలో ఎక్కువ భాగానికి విస్తరించకపోతే ఆర్థిక వృద్ధి స్తబ్ధతకు గురవుతుంది. కోవిడ్ మహమ్మారి ముందు కనిపించిన వృద్ధి క్షీణత సంకేతాలు దానికి ప్రతిబింబం కావచ్చు.

వ్యాసకర్త లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అద్భుత మెట్రో



ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన భారతదేశ మొట్టమొదటి అండర్‌వాటర్ మెట్రో మన ఇంజినీర్లు, కార్మికులు సాధించిన అద్భుతమైన కార్యం. దాన్ని హుగ్లీ కిందుగా వెళ్తూ హౌరా, కోల్‌కతాను అనుసంధానించే మెట్రోగా మాత్రమే చూడొద్దు. భారత్‌ను రూపాంతరీకరిస్తున్న ఎన్నో సూపర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో ఒకటిగా చూడాలి.

– కంచన్ గుప్తా, కేంద్ర ప్రభుత్వ సలహాదారు

మంచి చర్య



నీటిని వృథా చేసేవాళ్లకు బెంగళూరులోని హౌజింగ్ సొసైటీలు 5,000 రూపాయల జరిమానా విధిస్తున్నాయని వార్త. నీళ్లే పూజనీయం, నీళ్లే జీవితం. మనం నీటికి చెందుతాం, నీళ్లు మనకు చెందవు. నీటిని సంరక్షించుకోవడానికి అందరూ కృషి చేయాలి.

– శేఖర్ కపూర్, దర్శకుడు

స్వీయ విమర్శ అవసరం



తమ వెనుకబాటుతనానికి ముస్లింలు ఎంతకాలం ఇతరులను బాధ్యులుగా చేస్తారు? పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, చాలా అరబ్ దేశాల్లోని ముస్లింలను ఎవరు వెనక్కి ఉంచుతున్నారు? ఇజ్రాయెలా, ఆరెస్సెసా? వాళ్ల దృక్పథమే దానికి కారణం. తమ విద్య, సామాజిక వెనుకబాటుతనానికి వాళ్లు తమలోకి తాము చూసుకోవాలి.

– షాహిద్ సిద్దిఖీ, ఆర్‌ఎల్‌డీ జాతీయ ఉపాధ్యక్షుడు

వ్యాపార బంధం



ఇండియా ప్రతిరోజూ 50 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటోంది. అందులో రష్యా నుంచి రోజుకు 10 నుంచి 14 లక్షల బ్యారెళ్లను పొందుతోంది.

– వెలీనా త్చకరోవా, విశ్లేషకురాలు

అన్నీ రాయనివ్వాలి!



పుస్తకాలను అమ్మే వ్యాపారంలో ఉన్నవాళ్లు పుస్తకాలను అమ్మాలి. లోడుల కొద్దీ పుస్తకాలు, రకరకాల పుస్తకాలు అమ్మాలి. అంతేగానీ ఫలానా రకం అమ్ముడుపోతాయని వాళ్లు రచయితలకు చెప్పొద్దు. దానికి బదులుగా కొత్త మార్కెట్లు ఎక్కడున్నాయో అన్వేషించాలి.

– అన్నే జైదీ, రచయిత్రి

ఇన్ బాక్స్

సమకాలీన కఠోర సత్యం

ఫిబ్రవరి మూడవ వారంలో అమెరికా విదేశీ సంబంధాల 'సమాచార చిత్రాలు' విడుదలయ్యాయి. అవి రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు అంతర్జాతీయ మద్దతును వెల్లడించాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఉక్రెయిన్‌కు అందించిన సహాయాన్ని ఇవి వివరిస్తున్నాయి. ఉక్రెయిన్‌కు 7,430 కోట్ల డాలర్ల సాయం అందిస్తూ, సాయం చేసే దేశాల్లో అగ్రస్థానంలో ఉంది అమెరికా. ఈ సాయంలో సైనిక సాయం 4,630 కోట్ల డాలర్లు. 40కి పైగా దేశాలు ఉక్రెయిన్‌కు సాయంగా నిలిచాయి. వాటిలో ఎక్కువ నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సభ్యులూ, అమెరికా సైనిక మిత్రదేశాలే. ఉక్రెయిన్‌కు ఇంత ఉదారంగా మద్దతు ఇవ్వడానికి అమెరికాకు నిధులు ఎక్కడివి?

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం యూరోపియన్ దేశాల్లో, ముఖ్యంగా నాటో దేశాల్లో ఆయుధ పోటీని రేకెత్తించింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలను ఇచ్చిన తర్వాత ఆ దేశాలు తమ ఆయుధశాలలను తిరిగి నింపుకోవాలి. అందుకు ఆయుధాలను కొనాలి. ఆయుధాల తయారీ బహుళజాతి సంస్థలు అమెరికాలో ఎక్కువగా ఉన్నాయి. అన్ని దేశాలూ అమెరికా నుండే ఆయుధాలు కొనాలి. ఇందులో అమెరికా సైనిక మిత్రదేశాలన్నీ ఒకే పడవలో ఉన్నాయి. పోలండ్, జపాన్, దక్షిణ కొరియా, చైనా–తైవాన్ ద్వీపం వంటి మిత్రదేశాలు ఆయుధాల ప్రధాన కొనుగోలుదార్లు.

ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. వీటి వెనుక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అమెరికా ప్రమేయం ఉంది. ఆ యా దేశాలకు అమెరికా తన ఆయుధాలను అమ్మి సొమ్ముచేసుకోవాలనే లక్ష్యం ఇందుకు కారణం. 2023లో అమెరికా ప్రభుత్వం 8,100 కోట్ల డాలర్ల ఆయుధాలను అమ్మింది. ఇది 2022 అమ్మకాల కంటే 56 శాతం ఎక్కువ. అమెరికా తన వ్యూహాత్మక పొత్తులను కొనసాగిస్తూనే, ఒక చేత్తో ఆయుధాలను అందించి, మరో చేత్తో వాటిని అమ్మే కళను మెరుగుపరుచుకొంది. యూరోపియన్ మిత్రదేశాలను తిరిగి ఆయుధాలతో సిద్ధం చేయడం ద్వారా, ఉక్రెయిన్ సైనిక ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడం ద్వారా, అమెరికా రక్షణరంగ పరిశ్రమ, దాని అనుబంధ రంగాల పరిశ్రమలలో ఉపాధి బాగా పెరిగింది. అమెరికా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచింది.

అంతరిక్ష, రక్షణరంగాల పరిశ్రమలు అమెరికా అంతటా 21 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించాయి. అమెరికా ఆయుధ విక్రయాలు దాని శత్రువినాశ లక్ష్యానికి వ్యూహాత్మకంగా సహకరిస్తాయి. అదే సమయంలో దేశంలో ఉద్యోగితా స్థాయిని పెంచి ఆర్థిక పటుత్వానికీ కారణమవుతాయి. అందుకే ఉక్రెయిన్‌కు చేస్తున్న సైనిక సహాయడాన్ని అమెరికా ఆపలేదు. అలా చేస్తే అది అమెరికా వ్యూహాత్మక వ్యవస్థ విచ్ఛిన్నానికి దారితీస్తుంది. ఇది భయంకర వాస్తవం. ఎక్కువ దేశాలలో సంఘర్షణలు అమెరికాలో ఎక్కువ ఉద్యోగాలను సృష్టిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా శాంతికి భంగం కలిగిస్తాయి. ఇది సమకాలీన కఠోర సత్యం!

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, గుంటూరు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

మెకార్తీయిజం–ఎల్లో జర్నలిజం

అభిప్రాయం



పి. విజయబాబు

హిట్లర్ ప్రభుత్వంలో ప్రసార మంత్రిత్వశాఖను నిర్వహించిన 'జోసెఫ్ గోబెల్స్' పేరు అబద్ధపు ప్రచారాలకు పర్యాయపదమై నిలిచింది. జనంలో ప్రచార మాధ్యమం ఎంత బలమైనదో అర్థం చేసుకున్నాడు జోసెఫ్ గోబెల్స్. వ్యక్తి (హిట్లర్) ఆరాధన పెంపొందించడానికీ, ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేయడానికీ, తప్పుడు వార్తలను నిజాలుగా నమ్మించడానికీ ప్రచార, ప్రసార మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగించాడు గోబెల్స్. తదనంతర కాలంలో దారుణంగా అపఖ్యాతి పాలయ్యాడు. అప్పటినుంచి ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే దానిని 'గోబెల్స్' ప్రచారంగా అభివర్ణించడం పరిపాటి అయింది.

తెలుగు నాట గోబెల్స్ వారసులు బయల్దేరి అచ్చం గోబెల్స్ వలె చంద్రబాబు, లోకేష్ బాబుల ఇమేజ్ పెంచడానికి, జగన్ మోహన్ రెడ్డిపై విష ప్రచారం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.

అయితే ఇప్పుడు ఈ దిగజారుడు జర్నలిజంలో గోబెల్స్‌ను మించి, కొత్త అంకానికి తెరతీశారు. అదే 'మెకార్తీయిజం'. అర్థంలేని భయాలను సృష్టించి జనాల్ని కలవరపాటుకు గురి చేయడం, తమ ప్రత్యర్థులను జనాలకు భూతద్దంలో చూపి భయపెట్టడం, తాము నమ్ముకున్న వాళ్లను రక్షకులుగా చూపించడం మెకార్తీ జర్నలిజం.

అసలేమిటీ 'మెకార్తీ జర్నలిజం' అని రేఖా మాత్రంగా పరిశీలిస్తే చంద్రబాబు అను'కుల' మీడియా ప్రచారాల తంతు అర్థం అవుతుంది. 1950వ దశకంలో అమెరికా సెనేటర్ జోసెఫ్ మెకార్తి కమ్యూనిజాన్ని బూచిగా చూపిస్తూ, కమ్యూనిస్టులపై పోరాడే అలుపెరుగని వీరుడిగా ఆదిలో పేరుగాంచాడు. అయితే ఆ తర్వాత జనం చీత్కారాలకు గురై రాజకీయాల నుంచి బహిష్కృతుడయ్యాడు.

అమెరికా–రష్యాల మధ్య ఆధిపత్య పోరు నడిచిన రోజులవి. ఆ సమయంలో మెకార్తి మీడియాలో కమ్యూనిస్టులు దేశంలోకి చొరబడ్డారని భయపెట్టి వార్తలు విస్తృతంగా ప్రచారం చేసేవాడు. తనకు గిట్టని వాళ్లను 'అన్ అమెరికన్' అని ముద్ర వేశాడు. అతడి శాడిజానికి నిజాయితీగా పనిచేసే జర్నలి



స్టులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అతడు పని చేసిన కాలాన్ని 'రెడ్ స్కేర్' అని పిలిచేవారు. లేని దాన్ని ఉన్నట్టు బీభత్సంగా ప్రచారం చేసే జర్నలిజం 'మెకార్తీయిజం'గా పేరుపడింది. ఇప్పుడు మన తెలుగు నాట చంద్రబాబునాయుడి మీడియా బృందం చేస్తున్నది అదే!

'కామెంట్ ఈజ్ ఫ్రీ' బట్ ట్రూత్ షుడ్ బీ శాక్రెడ్' అంటాడు సంపాదకీయాలకు ఓంప్రథమంగా శ్రీకారం చుట్టిన ప్రఖ్యాత సంపాదకుడు థామస్ బార్జ్. కానీ ఈ సూత్రానికి తెలుగునాట ఒక వర్గం మీడియా ఎప్పుడో తిలోదకాలు ఇచ్చింది. వ్యాఖ్య ఏదైనా చేయవచ్చు. అందులో సత్యం ముత్యం అంత స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి అని బార్జ్ చెప్తే, 'వ్యాఖ్య ఏదైనా చేసెయ్! అందులో వాస్తవాలతో పని లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కథనం ఉండాలి. మాంచి మసాలా దట్టించిన గుత్తి వంకాయ కూరలాగా, ఇంకా ఘాటుగా ఉండాలంటే చికెన్ 65 లాగా స్టోరీ వండాలి. ముఖ్యంగా చంద్రబాబు, లోకేష్ శహ బాష్! అనే విధంగా ఉండాలి. వార్త వేరు వ్యాఖ్య వేరు అనుకోవద్దు. ఇప్పుడు మన పాలసీలో వ్యాఖ్యే వార్త' అనే ఆదేశాలు ఇచ్చే స్థితికి దిగజారాయి బాబు భజన బృందాలు. వేయవలసిన వార్తలు ఉంటే లోపలి పేజీలో సింగిల్ కాలమో, డబుల్ కాలమో వేయాలి. 'కిక్ ఇచ్చే వంటకాలే బ్యానర్ స్టోరీలు'... ఇదే నయా జర్నలిజం.

అయితే ప్రజలకు ఏది నిజం, ఏది అబద్ధం అనేది ఎప్పుడో అర్థమై పోయింది. అందుకే చంద్రబాబు నాయుడుని 23 సీట్లకు పరిమితం చేశారు. అర్థం కానిదల్లా చంద్రబాబు నాయుడికీ, ఆయన తనయుడు లోకేష్‌కే!

అసత్య ప్రచారాలకు మోసపోయే అపరిణత మనస్కులు కారు మన ఆంధ్రులు అని మరొకసారి చాటి చెప్పే సమయం ఆసన్నమైంది. అందుచేత నయా గోబెల్స్‌లను, మెకార్తీలను తరిమికొట్టడానికి 'సిద్ధం' కండి! టీడీపీ దోపిడీకి శాశ్వతంగా వీడ్కోలు పలకండి.

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

లయకారుడు శివరూపుడు

శివతత్త్వం అమేయం. 'ఇంత'ని కొలిచి చెప్పలేనిది. పర్వతమంత కాటుకను సముద్రమంత నీటి పాత్రలో ముంచి, సిరా తయారుచేసి, భూమియంత కాగితం పెట్టుకొని, కల్పవృక్షం కొమ్మను కలంగా అమర్చుకొని, మాటల కోసం తడుముకో నక్కరలేని వాగ్దేవి సరస్వతి స్వయంగా కూర్చొని అదేపనిగా ఎల్ల కాలమూ రాస్తూ వెళ్లినా, సాంబశివుడి మహిమను సమగ్రంగా వివరించడం సాధ్యం కాదు – అంటుంది 'శివమహిమ్న స్తోత్రం'.

'శివ' అంటే మంగళం, శుభం అని అర్థం. 'శం'–కరుడు అంటే ఆనందాన్నీ, శ్రేయస్సునూ, సౌభాగ్యాన్నీ ఇచ్చేవాడు. ప్రళయ కాలంలో ప్రాణికోటినంతా లయం చేసే ఫాలాక్షుడిని, భస్మలేపనంతో



జ్యోతిర్మయం

దిగంబరుడిగా శ్మశాన సీమలలో సంచరించే కామారిని 'శివుడు', 'శంకరుడు' అనడం ఏమి సబబు? వేదాంత దృష్ట్యా, మృత్యువులో భయంకరమూ, అమంగళమూ, అపవిత్రమూ ఏమీ లేదు. జనన మరణాలు దేహానికి మాత్రమే తప్ప దేహికి లేవు. తాత్కాలికంగా ధరించిన ఒక దేహం జీర్ణమైపోతే, దేహి దాన్ని వదిలేసి మరొక కొత్త దేహాన్నీ నామరూపాలనూ పొందుతాడు. మాసి, వెలిసి, చిరిగిన వస్త్రాన్ని మార్చి, నూతన వస్త్రాన్ని ధరించడంలో అమంగళమేముంది? కాబట్టి పునఃసృష్టికి దోహదం చేసే లయకారుడు, 'శివ' రూపుడే.

అదీగాక, శివుడు భక్తవత్సలుడు. భక్తుడు చేతులు జోడించి తనను ఏది కోరినా ఇస్తాడు, బిడ్డ కోరితే తల్లి ఆటవస్తువులను ఇచ్చినట్టు. ఈ ఆటవస్తువులిచ్చే ఆనందం క్షణికమనీ, వీటివల్ల దీర్ఘకాల ప్రయోజనం లేదనీ తల్లికి తెలుసు. బిడ్డకు తెలియదు. అమాయకత్వం, అజ్ఞానం పోయి, పరిణతి వచ్చినప్పుడు తెలుస్తుంది. శివుడు ప్రాపంచిక సుఖాలనే ఆటబొమ్మలను కోరేవారికి వాటినీ ఇస్తాడు. వాళ్ళకు పరిణతి కలిగి, క్షణికాల మీద విరక్తి వచ్చి, మోక్ష సుఖం కోరితే దాన్నీ ఇస్తాడు. ఇహ పర శ్రేయస్సు ఇచ్చేవాడు కనక ఆయన 'శం'–కరుడు.

అడిగిన వాళ్ళకు అష్టైశ్వర్యాలిస్తూ, తను మాత్రం అత్యంత నిరాడంబరంగా, ఆత్మారాముడై, నిత్య, నిరతిశయ, నిరవధిక ఆనందమయుడై ఉండడం వెనక విశేషమేమిటి? 'కోరితే ప్రాపంచిక సుఖాల వరాలిస్తాను కానీ అసలైన ఆనందం కోరికలు లేని స్థితి లోనే' అని సదాశివుడి సందేశం. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే గనక, మహాశివరాత్రి సందర్భంగా మనఃపూర్వకమైన నమస్కారం మాత్రం శివార్పణం చేద్దాం. దాంతో పాటు మారేడు దళమూ, దోసెడు నీళ్లూ. ఓం నమశ్శివాయ! (రేపు మహాశివరాత్రి)

– ఎం. మారుతి శాస్త్రి



గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.10.23 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.49 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.38 నుండి 3.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.13 నుండి 11.01 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృత ఘడియలు:** రా.10.43 నుండి 12.12 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.19, **సూర్యాస్తమయం:** 6.03.

క్లుప్తంగా...

'చెప్పాడంటే చేస్తాడంతే..'

- ప్రతి ఇంటికి ఐదేళ్లలో చేసిన మేలును వివరిస్తూ సీఎం జగన్ సందేశంతో లేఖలు

సాక్షి, అమరావతి: సుపరిపాలనతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ పారదర్శకంగా మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో చేకూర్చిన ప్రయోజనాలను వివరిస్తూ రూపొందించిన లేఖను నేరుగా లబ్ధిదారులకు అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆదివారం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈమేరకు ముఖ్యమంత్రి జగన్ సందేశంతో కూడిన లేఖలను ప్రతి ఇంటికీ అందచేయనున్నారు. ఐదేళ్లలో ఒక్కో ఇంటికి ఏ పథకం ద్వారా మొత్తం ఎంత మేర ప్రయోజనం కలిగిందో వివరిస్తూ లబ్ధిదారులవారీగా ప్రత్యేకంగా అనుబంధ పత్రాన్ని రూపొందించారు. లేఖ పంపిణీ సమయంలో వలంటీర్లు ఆయా కుటుంబాలకు చెందిన ఒక సభ్యుడి నుంచి ఈ–కేవైసీ తీసుకోనున్నారు.

నేతన్నలకు చేయూతనిచ్చిన జగన్ ప్రభుత్వం

- నటి పూనమ్‌కౌర్ ట్వీట్



సాక్షి, అమరావతి: కోవిడ్ సమయంలో నేతన్నలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్భుతంగా ఆదుకుందని సినీ నటి పూనమ్‌కౌర్ కితాబిచ్చారు. ఈ మేరకు బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'మహమ్మారి సమయంలో ప్రభుత్వం నేత కార్మికులను గొప్పగా ఆదుకుంది. ఆ సమయంలో చేనేత ప్రచారకర్తగా నేను ఉండడం నా అదృష్టం' అని ఆమె పేర్కొన్నారు.

● ఇది దేవుని స్క్రిప్ట్

నాన్న మొదలుపెడితే.. నేను పూర్తి చేశా



వెలిగొండ ప్రాజెక్ట్ జంట సొరంగాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం జగన్

''పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నాన్నగారు వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే ఆయన కుమారుడిగా ఒక్కొక్కటి దాదాపు 18 కి.మీ. పైగా ఉన్న రెండు టన్నెళ్లను పూర్తి చేసి జాతికి అంకితం చేయడం నిజంగా దేవుడు రాసిన స్క్రిప్టే అనేందుకు ఇంతకన్నా నిదర్శనం ఏముంది? వెలిగొండ మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13న మన ప్రభుత్వమే పూర్తి చేయగా రెండో సొరంగం పనులను కొద్ది రోజుల క్రితమే పూర్తి చేసి ఇవాళ జాతికి అంకితం చేస్తున్నాం. దశాబ్దాల స్వప్నాన్ని నెరవేరుస్తూ ఆ టన్నెల్‌లో ప్రయాణించే అదృష్టాన్ని కల్పించిన దేవుడికి సదా రుణపడి ఉంటా''

– ఏపీ సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మూడు జిల్లాల్లో ఫ్లోరైడ్, కరువు పీడిత ప్రాంత ప్రజల కష్టాలను తీర్చే గొప్ప ప్రాజెక్టు వెలిగొండ అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో 30 మండలాలకు తాగునీరు, 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా జంట టన్నెళ్లతో శరవేగంగా పూర్తి చేసిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి జగన్ ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు–ఎగువ చెర్లోపల్లి వద్ద బుధవారం ప్రారంభించారు. దివంగత వైఎస్సార్ హయాంలో చేపట్టిన 37.6 కి.మీ పొడవైన వెలిగొండ రెండు టన్నెళ్లలో చంద్రబాబు అధికారంలో ఉండగా 6.6 కి.మీ. పనులు మాత్రమే చేయగా మిగతావి 31 కి.మీ మేర పనులు వైఎస్సార్, సీఎం జగన్ పాలనలోనే జరగడం గమనార్హం. గిద్దలూరు నియోజకవర్గానికి ప్రయోజనం చేకూరుస్తూ 13,500 ఎకరాలకు సాగునీటిని అందించే రెండు ఎత్తిపోతల పథకాలకు కూడా సీఎం జగన్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఏమన్నారంటే..

మళ్లీ మనం రాగానే నీళ్లు నింపుతాం..

ప్రకాశం జిల్లాలోని 23 మండలాలు, నెల్లూరు జిల్లాలో ఐదు, కడప జిల్లాలో రెండు మండలాలు కలిపి మొత్తం 30 మండలా ల్లో 15.25 లక్షల మందికి తాగునీరు, 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి సమస్యకు పరిష్కారం చూపిస్తూ వెలిగొండ రెండు సొరంగాలు వేగంగా పూర్తయ్యాయి. దీంతో వచ్చే ఖరీఫ్‌లో శ్రీశై లం నుంచి నల్లమలసాగర్‌కు నీళ్లు తీసుకొచ్చి నింపుతున్న దృశ్యం జూలై–ఆగస్టులో ఆవిష్కృతమవుతుందని సంతోషంగా చెబుతున్నా. దాదాపు 3 వేల క్యూసెక్కులతో మొదటి టన్నెల్‌ను పూర్తి చేశాం. 8,500 క్యూసెక్కుల క్యారీయింగ్ కెపాసిటీతో రెండో టన్నెల్ పూర్తయింది. అంటే శ్రీశైలంలో మట్టం 840 అడుగులు దాటిన వెంటనే రోజుకో టీఎంసీని ఈ రెండు సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు తీసుకురాగలిగే గొప్ప పరిస్థితి ఈ రోజుతో వచ్చింది. జూలై–ఆగస్టులో నీళ్లు నింపే సమయానికి మరో రూ.1,200 కోట్లు ఖర్చు చేసి ఎల్‌ఏ, ఆర్‌అండ్‌ఆర్ కూడా పూర్తి చేస్తాం. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన ఘట్టమైన రెండు టన్నె ళ్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రిజర్వాయర్ కూడా పూర్తయిపోయింది. ఇక మిగిలినవి పెద్దగా ఏమీ లేవు. మళ్లీ మనం అధికారంలోకి వచ్చి ప్రమాణ స్వీకారం చేసిన రెండు మూడు నెలల్లోనే ఎల్‌ఏ, ఆర్ అండ్ ఆర్ పూర్తి చేసి పూర్తిగా నీళ్లు నింపుతాం.

వెలిగొండను జాతికి అంకితం చేసిన ఏపీ సీఎం జగన్

- వాయువేగంతో జంట సొరంగాలు పూర్తి
- పూర్తయిన టన్నెళ్లను స్వయంగా పరిశీలించి పైలాన్‌ను ఆవిష్కరించిన సీఎం
- ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగు నీరు
- 30 మండలాల్లో 15.25 లక్షల మందికి తాగునీరు కూడా

దుర్భిక్ష ప్రాంతానికి మేలు చేయని బాబు..

ఈ ప్రాజెక్టు వల్ల ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలన్నింటికీ మంచి జరుగుతుందని తెలిసినా, యర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు, కనిగిరి, ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు నియోజకవర్గాలకు మేలు జరుగుతుందని తెలిసినా చంద్రబాబు హయాంలో టన్నెళ్లు పూర్తి చేయకుండా పనులు నత్తనడకన సాగాయి. ఇందులో ఒక్కొక్కటి 18.8 కి.మీ. పొడవుతో దాదాపు 37.6 కిలోమీటర్ల పొడవైన 2 టన్నెళ్లున్నాయి. దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉరుకులు పరుగులతో సింహభాగం పనులు చేయగా 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో కేవలం 6.6 కి.మీ. మాత్రమే టన్నెళ్ల పనులు జరిగాయి. ఆ తర్వాత మీ బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ రెండు టన్నెళ్లను వడివడిగా పూర్తి చేసి వెలిగొండను సాకారం చేశాడని చెప్పేందుకు గర్విస్తున్నా.

రేవంత్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనప్ప

- ఈనెల 12న కాంగ్రెస్‌లో చేరే అవకాశం




సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధమైంది. సిర్పూరులో తనపై పోటీ చేసి, తన ఓటమికి పరోక్షంగా కారణమైన బీఎస్పీ అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన విషయం తెలిసిందే. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఎస్పీతో పొత్తు పెట్టుకోవాలని బీఆర్ఎస్ అధినేత ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన కోనప్ప బుధవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరడం ఒక్కటే ప్రత్యామ్నాయమనే నిర్ణయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఈనెల 12న కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. తనతో కనీసం సంప్రదించకుండా ఎమ్మెల్యేగా తన ఓటమికి కారణమైన ప్రవీణ్‌కుమార్‌తో కేసీఆర్ భేటీ కావడం మనసును గాయపరిచిందని కోనప్ప సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించారని సమాచారం.

బీసీల కోసం మరో వేషం

- వచ్చే ఐదేళ్లలో బీసీలకు బాబు చేస్తానన్న ఖర్చు రూ.1.50 లక్షల కోట్లు
- గత ఐదేళ్లలో జగన్ బీసీలకు చేకూర్చిన లబ్ధి రూ.1.76 లక్షల కోట్లు
- బీసీలంటే 'బ్యాక్ బోన్' అన్న వైఎస్సార్‌సీపీ స్లోగన్‌నే కాపీ కొట్టిన టీడీపీ
- బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ జగన్ సర్కారు అమలు చేస్తున్నవే
- బీసీ కార్పొరేషన్లు.. కుల ధ్రువీకరణ పత్రాలు.. కుల గణన.. ఇలా అన్నీ కాపీనే
- అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేయకుండా డ్రామాలు
- నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34 శాతం ఇస్తామన్న బాబు
- 50 శాతానికిపైగా పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ
- అభాసుపాలైన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బీసీ డిక్లరేషన్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఇంట్లో నుంచే విద్యుత్ సేవలు

- ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిన డిస్కం
- పోర్టల్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: హెచ్‌టీ లైన్ల తరలింపు సేవలు సహా డిస్కం, ట్రాన్స్‌కోల మధ్య కార్యకలాపాలు ఇక ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 132, 220, 400 కేవీ కొత్త సర్వీసులు, 11 కేవీ/ 33 కేవీ కొత్త సర్వీసులతో పాటు హెచ్‌టీ/హెచ్‌టీ సర్వీసుల కోసం గతంలో మాదిరిగా కార్యాలయాలు చుట్టూ తిరగనవసరం లేదు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలోగా విద్యుత్ అధికారులు ఆ దరఖాస్తును పరిశీలించి వేగవంతంగా సేవలు అందించే విధంగా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఈ సేవల కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న వినియోగదారుడు పని ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే అవకాశం ఉంది.

చేకూరే ప్రయోజనాలు ఇవే: వినియోగదారులు తమ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పొందుపర్చవచ్చు. ● సింగిల్ విండో విధానం ద్వారా అధికారులు దరఖాస్తును వేగవంతంగా పరిశీలించి ప్రక్రియను పూర్తి చేస్తారు. ● వినియో గదారులు డిస్కం ఆఫీసుకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో సంబంధిత సేవా రుసుమును చెల్లించవచ్చు. ● డిస్కం వారు వినియోగదారునితో నిరంతరం అందుబాటులో ఉండి దరఖాస్తు చేసుకున్న సేవకు సంబంధించిన స్టేటస్ వివరాలను కమ్యూనికేట్ చేస్తారు.



వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

భూములను ఉచితంగా క్రమబద్ధీకరించాలి

- ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ ఆందోళనలు.. పలు చోట్ల ధర్నాలు

సాక్షి, హైదరాబాద్: గ్రామాలు, పట్టణాలలో ఉచితంగానే భూముల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బీఆర్ఎస్ ఆందోళనలు నిర్వహించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు పలు జిల్లాల్లోని మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ధర్నాలు నిర్వహించి ప్రభుత్వ తీరును నిరసించారు. గతంలో ఎల్ఆర్ఎస్‌ను తప్పు పట్టి, ప్రజల్లో విషాన్ని నింపిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అదే ఎల్ఆర్ఎస్‌ను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేసి భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న కాంగ్రెస్ పార్టీ నేడు మాట తప్పడం సిగ్గుచేటని విమర్శించారు. నాడు అడ్డగోలుగా మాట్లాడిన నేటి కాంగ్రెస్ మంత్రులు, ఇప్పుడు నోరు ఎందుకు విప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, మిర్యాలగూడ, మెదక్, వరంగల్, రంగారెడ్డి, సూర్యాపేట, సిద్దిపేట, పెద్దపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు నిర్వహించారు.

ఎంపీ వద్దిరాజును సత్కరించిన బండి పార్థసారథిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజ్యసభకు ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను సహచర రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి సత్కరించారు. బుధవారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రవిచంద్ర నివాసంలో డాక్టర్ పార్థసారథిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, బీఆర్ఎస్ నాయకులు గాలి అనిల్‌కుమార్ కూడా వద్దిరాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్‌కు తెలంగాణ ఆత్మ లేదు

- తెలంగాణపై గౌరవం అంతకన్నా లేదు
- తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ
- మతం పేరిట చిచ్చు పెట్టే గోద్రా అల్లర్ల మోడల్ నీకు నచ్చిందా..?
- ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఆత్మ లేదు.. తెలంగాణపై గౌరవం అంతకన్నా లేదు. అందుకే తెలంగాణ ఆత్మగౌరవంపై మోదీ సాక్షిగా రేవంత్ దాడి చేశారు..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు ధ్వజమెత్తారు. బుధవారం ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'తెలంగాణ సోయి లేనోడు సీఎం కావడం మన ఖర్మ. తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెలవనోడు సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యం' అని విమర్శించారు. 'గోల్‌మాల్ గుజరాత్ మోడల్‌కు, గోల్డెన్ తెలంగాణ మోడల్‌తో పోలికెక్కడిది? ఘనమైన 'గంగా జమునా తెహజీబ్ మోడల్' కన్నా.. మతం పేరిట చిచ్చు పెట్టే గోద్రా అల్లర్ల మోడల్ నీకు నచ్చిందా..?' అని రేవంత్‌ను నిలదీశారు. నిన్న మొన్నటి దాకా గుజరాత్ మోడల్‌పై నిప్పులు చెరిగిన రేవంత్.. ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే గొప్పలు మాట్లాడుతున్నారని, ఇదేం నీతి.. ఇదేం రీతి అని కేటీఆర్ విమర్శించారు.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే తెలంగాణ సహించదు

'తెలంగాణ మోడల్ అంటే సమున్నత సంక్షేమ నమూనా. సమగ్ర అభివృద్ధికి చిరునామా. బుడిబుడి అడుగుల వయసులో.. బుల్లెట్ వేగంతో దూసుకెళ్లిన సమగ్ర, సమ్మిళిత, సమీకృత మోడల్..' అని అభివర్ణించారు. 'దేశం మెచ్చిన ఈ తెలంగాణ నమూనాను 'నమో' ముందు కించ పరుస్తావా? 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెడతావా? నమ్మి ఓటేసిన తెలంగాణపై ఎందుకీ నయవంచన?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నాడేమో.. తెలంగాణ ఉద్యమకారులపై రైఫిల్ ఎత్తావ్.. నేడేమో తెలంగాణ ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టావ్. నిన్ను చరిత్ర క్షమించదు..' అంటూ కేటీఆర్ నిప్పులు చెరిగారు. 'నా తెలంగాణ దేనినైనా సహిస్తుంది కానీ.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే మాత్రం ఊరుకోదు..' అని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని ఆకాశమంత ఎత్తుకు బీఆర్ఎస్ ఎత్తితే .. కాంగ్రెస్ పాతాళంలో పాతి పెట్టేస్తోందని మండిపడ్డారు.

పెళ్లి చేసుకుని తిరుమల వెళ్లి వస్తూ..

- ఆగిఉన్న లారీని ఢీ కొన్న కారు
- కొత్త జంట సహా ఐదుగురి దుర్మరణం
- ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఘటన
- మృతులు హైదరాబాద్‌వాసులు



బాలకిరణ్, కావ్య



రవీంద్ర, లక్ష్మి



అశోక్



ఆగి ఉన్న లారీ కిందకు దూసుకుపోయిన కారు

ఆళ్లగడ్డ: కోటి ఆశలతో ఒక్కటైన దంపతులకు తమ ఆశ తీరకుండానే జీవితం ముగిసిపోయింది. పెళ్లికి కట్టిన తోరణాలు, వచ్చిన బంధువులు ఇంకా ఊర్లకు వెళ్లకుండానే పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలోని నల్లగట్ల వద్ద బు. దవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదుగురిని కబళించి 3 కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. తెలంగాణలోని మేడ్చల్ జిల్లా ఆల్వాల్ సమీపంలోని వెంకటాపురం గ్రా మానికి చెందిన రవీంద్ర, లక్ష్మిలకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు స్వీడన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. తెనా లికి చెందిన కావ్యతో మార్చి1న వివాహం జరిగింది. 4న తిరుమ ల వెంకన్నను దర్శించుకునేందుకు నవ దంపతులు బాలకిరణ్ (29), కావ్య (24), తండ్రి రవీంద్ర (55), తల్లి లక్ష్మి (50)తో పా టు నాగర్‌కర్నూల్ సమీపంలోని ఒట్రెపల్లికి చెందిన డ్రైవర్ అశోక్ (22)తో కలిసి కారులో తిరుమల వెళ్లి, స్వామి దర్శనం చేసుకుని రాత్రి 10 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని: డ్రైవర్ అశోక్ నిద్ర వస్తోందని చెప్ప డంతో కొంత సమయం తాను కారు నడుపుతానని బాలకిరణ్ తీసుకున్నాడు. ఈ క్రమంలో నల్లగట్ల సమీపంలో వీరు ప్రయాణి స్తున్న కారు తెల్లవారు జామున చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు కర్బూజా పండ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ఆగి ఉండగా, వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు లారీ కిందకు దూసుకుపోవడంతో నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ఉన్న బాలకిరణ్, కావ్య, రవీంద్ర, లక్ష్మి, అశోక్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే రూరల్ సీఐ హనుమంత నాయక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కారును క్రేన్ సహాయంతో బయటకు లాగి అందులో చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీసి ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. పెళ్లి కోసం కేవలం 20 రోజుల క్రితం స్వీడన్ నుంచి వచ్చిన బాలకిరణ్ ఈనెల 18న తిరిగి వెళ్లాల్సి ఉండగా, ఇంతలోనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

వెంకటాపురంలో విషాదం

ఆల్వాల్: వెస్ట్ వెంకటాపురం చివరి బస్టాండ్ వద్ద కిరణాషాపు నిర్వహిస్తున్న రవికుమార్ స్థానికులతో కలివిడిగా ఉండేవారు గత 15 రోజులుగా ఇంట్లో వద్ద పెళ్లి సందడితో ఉన్న ఇల్లు ఒక్కసారిగా మరణ వార్తతో మూగబోయింది. మరో పది రోజు లలో విదేశాలకు వెళ్లాల్సిన నూతన వధూవరులు విగతజీవు లుగా మారడంతో బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం!

రష్యా, చైనా సంయుక్త యోచన... పదేళ్లలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ

చంద్రునిపై మనిషి శాశ్వత నివాస కలను వీలైనంత త్వరగా సాకారం చేయాలని రష్యా, చైనా తలపోస్తున్నాయి. అందుకవసరమైన విద్యుత్ అవసరాలను సోలార్ ప్యానళ్లు తీర్చలేకపోవచ్చనే ఉద్దేశంతో జాబిలిపై ఏకంగా అణు విద్యుత్కేంద్రమే ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చాయి! అందుకోసం ఇప్పటికే సంయుక్త కార్యాచరణకు తెర తీశాయి కూడా...

- సాక్షి, నేషనల్ డెస్క్

అంతరిక్ష పోటీలో కీలక ముందడుగు వేసే దిశగా రష్యా, చైనా సంయుక్తంగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా చంద్రునిపై మనిషి శాశ్వత నివాస కలను నిజం చేసే దిశగా కదులుతున్నాయి. 2035 లోపు అక్కడ అణు విద్యుత్కేంద్రం ఏర్పాటు చేయాలని నిశ్చయానికి వచ్చాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇప్పటికే మొదలైందని రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్ చీఫ్ యూరీ బోరిసోవ్ తెలిపారు. ఈ మేరకు తాజాగా ఆయన ఒక ప్రకటన చేశారు. అయితే ఇదంతా సులువు కాబోదని యూరీ అంగీకరించారు. కాకపోతే, ''న్యూక్లియర్ స్పేస్ ఎనర్జీ రంగంలో రష్యాకున్న అపార నైపుణ్యం ఈ విషయంలో బాగా ఉపయోగపడనుంది. మేం తలపెట్టిన ప్రాజెక్టు చంద్రునిపై మనిషి శాశ్వత ఆవాసం దిశగా కీలక ముందడుగు కానుంది. అక్కడ మున్ముందు ఎదురయ్యే ఇంధన అవసరాలు, డిమాండ్లను తీర్చేందుకు సోలార్ ప్యానళ్లు చాలవు. అణు విద్యుతే ఇందుకు సమర్థమైన ప్రత్యామ్నాయం. కనుకనే బాగా ఆలోచించిన మీదట ఈ ప్రాజెక్టును పట్టాలకెక్కించాం'' అని ఆయన వివరించారు.

పర్యవేక్షణకు అంతరిక్ష 'అణు'నౌక...

అయితే చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం వ్యవస్థాపన మాటల్లో చెప్పినంత సులువేమీ కాదు. ఇందుకోసం ఇప్పటికే ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు యూరీ వెల్లడించారు....

- తొలి దశలో మానవ ప్రమేయంతో నిమిత్తం లేకుండా చంద్రునిపై అణు ప్లాంటు స్థాపన ప్రయత్నాలు పూర్తిగా ఆటోమేటెడ్ పద్ధతిన సాగుతాయి.
- ఇందుకోసం ప్రధానంగా రోబోలను రంగంలోకి దించి వాటి సాయంతో పని నడిపిస్తారు.
- స్పేస్ టగ్‌బోట్ పేరిట అణు విద్యుత్‌తో నడిచే అంతరిక్ష నౌకను అభివృద్ధి చేసే యోచనలో రష్యా ఉంది.
- ఇందులో భారీ అణు రియాక్టర్‌తో పాటు హై పవర్ టర్బైన్లు కూడా ఉంటాయి.
- విద్యుత్కేంద్రం తయారీకి కావాల్సిన సామగ్రిని దాన్నుంచే చంద్రునిపైకి పంపుతారు.
- దాని నిర్మాణ క్రమంలో వెలువడే అంతరిక్ష వ్యర్థాలు తదితరాలను క్లియర్ చేసే పని కూడా ఈ నౌకదే.



ప్రతీకాత్మక చిత్రం

చల్లబరచేదెలా...?

చంద్రునిపై అణు విద్యుత్కేంద్రం నిర్మాణంలో ఇమిడి ఉన్న అనేకానేక సాంకేతిక సమస్యలను అధిగమించడంలో రష్యా, చైనా తలమునకలుగా ఉన్నాయి. అయితే అణు ప్లాంటును ఎప్పటికప్పుడు చల్లబరచడం వాటికి అత్యంత కీలకమైన సవాలుగా మారనుంది. గతేడాది రష్యా ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన లూనా–25 అంతరిక్ష నౌక అంతరిక్షంలో అదుపు తప్పి పేలిపోయింది. ఆ ఎదురుదెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయినా అణు కేంద్రం విషయంలో వెనక్కు తగ్గొద్దని పట్టుదలగా ఉంది. ఆలోపే చైనాతో కలిసి మానవసహిత చంద్ర యాత్ర, ఆ వెంటనే చంద్రునిపై శాశ్వత బేస్ ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. చైనా కూడా 2030 నాటికల్లా తమ తొలి వ్యోమగామిని చంద్రునిపైకి పంపడం లక్ష్యంగా పెట్టుకుంది. వీటన్నింటినీ అమెరికా ఓ కంట కనిపెడుతూనే ఉంది. వీలైనంత త్వరగా అంతరిక్షంలో అణ్వాయుధాలను ఏర్పాటు చేసుకోవడమే రష్యా లక్ష్యమని ఇప్పటికే ఆరోపించడం తెలిసిందే. ఇదంతా పెద్ద దేశాల నడుమ అంతరిక్షంపై ఆధిపత్య పోరుకు దారి తీసే ఆస్కారం లేకపోలేదన్న అభిప్రాయాలు కూడా విన్పిస్తున్నాయి.

రేసు నుంచి నిక్కీ హేలీ ఔట్

వాషింగ్టన్: మంగళవారం ఒకేసారి 15 రాష్ట్రాల్లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రైమరీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన నేపథ్యంలో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం రేసు నుంచి తప్పుకుంటున్నట్లు భారతీయ మూలాలున్న నాయకురాలు నిక్కీ హేలీ బుధవారం ప్రకటించారు. వెర్మాంట్‌లో గెలుపు కాస్తంత ఊరటనిచ్చినా మిగతా అన్ని చోట్ల ఎదురైనా ప్రతికూల ఫలితాలను బేరీజు వేసుకుని ఆమె ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఫలితాల తర్వాత సౌత్ కరోలీనాలో ఆమె మాట్లాడారు. ''నా ప్రచారానికి అర్ధంతరంగా ముగింపు పలకాల్సిన సమయం వచ్చేసింది. అమెరికన్ల గొంతుక గట్టిగా వినిపించాలని భావించా. నా శక్తిమేరకు నేను కృషి చేశా. అనుకున్న కార్యాన్ని పూర్తిచేయలేకపోయా. ఇందులో చింతించాల్సింది ఏమీ లేదు. రేసులో నేను ఉండకపోవచ్చుకానీ నేను నమ్మిన సిద్ధాంతాలను ఇకమీదటా బలంగా వినిపిస్తా'' అని నిక్కీ హేలీ అన్నారు.



విలేకరుల భేటీ నుంచి నిష్క్రమిస్తున్న హేలీ

రిపబ్లికన్ ఏకైక అభ్యర్థిగా ట్రంప్

- రేసు నుంచి నిక్కీ హేలీ వైదొలగడంతో లాంఛనమైన ట్రంప్ అభ్యర్థిత్వం
- సూపర్ ట్యూస్‌డే ప్రైమరీల్లో ట్రంప్, బైడెన్‌ల జోరు



బైడెన్ ట్రంప్

వాషింగ్టన్: ఈ ఏడాది నవంబర్‌లో జరగబోయే అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్, రిపబ్లికన్‌పార్టీల తరఫున బరిలో దిగబోయే అభ్యర్థులు ఎవరనేది దాదాపు ఖరారైంది. మంగళవారం 15 రాష్ట్రాలు, ఒక టెరిటరీలో జరిగిన ఆయా పార్టీల ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్, బైడెన్‌ల హవా కొనసాగింది. రిపబ్లికన్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న ట్రంప్ మంగళవారం నాటి 'సూపర్ ట్యూస్‌డే' ప్రైమరీల్లో దాదాపు అన్నింటిలోనూ జయకేతనం ఎగరేశారు. వెర్మాంట్ రాష్ట్ర ప్రైమరీలో మాత్రమే భారతీయ సంతతి నాయకురాలు, సొంత పార్టీలో ప్రత్యర్థి అయిన నిక్కీ హేలీ చేతిలో ట్రంప్ ఓటమి చవిచూశారు. మిగతా రాష్ట్రాల ప్రైమరీల్లో ట్రంప్‌దే విజయం. మరోవైపు వరస ఓటముల నేపథ్యంలో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వ రేసు నుంచి తప్పుకుంటున్నట్లు నిక్కీ హేలీ ప్రకటించారు. దీంతో ట్రంప్ అభ్యర్థిత్వం ఖరారైంది. మొత్తం రిపబ్లికన్ డెలిగేట్లలో మూడింట ఒక వంతు మంది ఈ మంగళవారం నాడే తమ అభ్యర్థి ఎవరనేది ఎన్నుకున్నారు. పార్టీ తరఫున అభ్యర్థిత్వం సాధించాలంటే రిపబ్లికన్ అభ్యర్థి మొత్తం 2,429 ఓట్లకుగాను కనీసం 1,215 డెలిగేట్ల ఓట్లు సాధించాలి. సూపర్ ట్యూస్‌డే రోజున ట్రంప్ 764 డెలిగేట్ల ఓట్లు సాధించారు. నిక్కీ హేలీ కేవలం 43 డెలిగేట్ల ఓట్లు సాధించారు. సూపర్‌ట్యూస్‌డేకు ముందు గతంలో ట్రంప్ 276 డెలిగేట్ల ఓట్లు ఉండేవి. నిక్కీ హేలీకి గతంలోనూ 43 ఓట్లే ఉన్నాయి. సూపర్ ట్యూస్‌డే రోజు సాధించిన ఓట్లతో కలుపుకుంటే ట్రంప్ ఇప్పటిదాకా సాధించిన డెలిగేట్ల సంఖ్య 1,040కు పెరిగింది. నిక్కీ హేలీ డెలిగేట్ల సంఖ్య 86కు పెరిగింది. మరోవైపు 81 ఏళ్ల బైడెన్ సైతం తమ డెమొక్రటిక్ పార్టీలో రాష్ట్రాల ప్రైమరీల్లో తన విజయపరంపర కొనసాగించారు. అమెరికన్ సమోవా టెరిటరీలో మాత్రం జాసన్ పామర్ చేతిలో బైడెన్ ఓటమిని అంగీకరించక తప్పలేదు. మంగళవారం జరిగిన మిగతా అన్ని రాష్ట్రాల్లో బైడెన్ విజయబావుటా ఎగరేశారు. డెమొక్రటిక్ అభ్యర్థి మొత్తం 3,934 డెలిగేట్లకు గాను కనీసం 1,968 డెలిగేట్ల ఓట్లను సాధించాల్సి ఉంటుంది. సూపర్‌ట్యూస్‌డేకు ముందు గతంలో బైడెన్‌కు 206 డెలిగేట్ల ఓట్లు ఉండేవి. సూపర్‌ట్యూస్‌డే రోజున బైడెన్ ఏకంగా 1,366 డెలిగేట్ల ఓట్లు సాధించారు. దీంతో తాజాగా మొత్తంగా బైడెన్ సాధించిన డెలిగేట్ల ఓట్ల సంఖ్య 1,572కు చేరుకుంది.

సందేశ్‌ఖాలీలో తుపాను!

బెంగాల్‌ను ముంచెత్తడం ఖాయం: ప్రధాని మోదీ

- మహిళల చేతిలో తృణమూల్‌కు పరాజయం తప్పదు
- బెంగాల్‌లో నారీశక్తి వందన్ సభలో ప్రధాని వ్యాఖ్యలు

బరాసత్/కోల్‌కతా: సందేశ్‌ఖాలీలో తుపాను మొదలైందని, అది పశ్చిమ బెంగాల్‌ను చుట్టుముట్టడం ఖాయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. అరాచకాలు, అకృత్యాలకు మారుపేరైన అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహిళా శక్తి మట్టి కరిపించడం తథ్యమని అన్నారు. బెంగాల్ రాష్ట్రం ఉత్తర 24 పరగణాల జిల్లా కేంద్రమైన బరాసత్ పట్టణంలో బుధవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నారీశక్తి వందన్ సభలో ఆయన ప్రసంగించారు. సందేశ్‌ఖాలీలో మహిళలపై నేరాలు సిగ్గుచేటన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, మహిళల భద్రతను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. బాధితుల్లో తిరుగుబాటు మొదలైందని, సందేశ్‌ఖాలీలో పుట్టిన తుఫాను రాష్ట్రాన్ని ముంచెత్తి తృణమూల్‌ను గద్దె దింపుతుందని అన్నారు. సందేశ్‌ఖాలీ అంశంలో హైకోర్టులో, సుప్రీంకోర్టులో మమత ప్రభుత్వానికి ఎదురుదెబ్బలు తగిలాయని గుర్తుచేశారు.

బాధితులకు న్యాయం చేకూరుస్తాం

పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల్లో అత్యాచారాలకు, అకృత్యాలకు గురైన మహిళలకు న్యాయం చేకూరుస్తామని, తగిన భద్రత కల్పిస్తామని ప్రధానమంత్రి మోదీ హామీ ఇచ్చారు. అనంతరం సందేశ్‌ఖాలీ నుంచి వచ్చిన మహిళలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఐదుగురు బాధితులతో స్వయంగా మాట్లాడారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుల అరాచకాలపై నిర్భయంగా పోరాడుతున్న సందేశ్‌ఖాలీ మహిళలను దుర్గా మాతతో పోల్చారు. బాధితుల గోడు విని ఆయన చలించిపోయారు. ఇకపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి భరోసా కల్పించారు. మరోవైపు సందేశ్‌ఖాలీ నుంచి నారీశక్తి వందన్ సభకు బస్సుల్లో వస్తున్న మహిళలను బెంగాల్ పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. బీజేపీ నాయకులు వారితో ఘర్షణకు దిగారు. కొంత మంది మహిళలు మాత్రమే సభకు రాగలిగారు.



బుధవారం కోల్‌కతా మెట్రోలో ప్రయాణిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

లాలూ కుటుంబం నేరగాళ్లమయం

బేటియా: ఆర్జేడీ అధ్యక్షుడు లాలు ప్రసాద్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులు బిహార్‌లో అతిపెద్ద నేరుగాళ్లని మోదీ ఆరోపించారు. పదేళ్ల ఆర్జేడీ పాలనలో బిహార్‌ను జంగిల్‌రాజ్ మార్చేశారని మండిపడ్డారు. బిహార్‌లో పశ్చిమ చంపారన్ జిల్లాలోని భేటియాలో రూ.12,800 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. అప్పట్లో ఆర్జేడీ–కాంగ్రెస్ దుష్పరిపాలన వల్ల బిహార్ యువత ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వారసత్వ రాజకీయాలు చేసేవారు తనపై మాటల దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఇండియా కూటమి నేతలు రాముడిని కూడా కించపరుస్తున్నారన్నారు. దేశం పేదరికం నుంచి బయటపడాలంటే, మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడో అతి పెద్దదిగా వ్యవస్థగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు 400 సీట్లు కట్టబెట్టాలని ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు.

కోల్‌కతాలో అండర్ వాటర్ మెట్రో టన్నెల్ ప్రారంభం

దేశంలోనే మొట్టమొదటి జలాంతర్భాగ మెట్రో రైలు సొరంగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. కోల్‌కతా మెట్రోరైల్ నెట్‌వర్క్‌లో భాగంగా హుగ్లీ నది దిగువన ఈ సొరంగాన్ని నిర్మించారు. ఎస్ప్లానాడి నుంచి హౌరా మైదాన్ స్టేషన్ వరకు మెట్రో రైలులో మోదీ ప్రయాణించారు. రైలులో తనతోపాటు ప్రయాణించిన పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. అదే మార్గంలో ఎస్ప్లానాడి స్టేషన్‌కు తిరిగివచ్చారు. ఈస్ట్–వెస్ట్ కారిడార్‌లో అంతర్భాగమైన 4.8 కిలోమీటర్ల ఎస్ప్లానాడి–హౌరా మైదాన్ మెట్రో మార్గాన్ని రూ.4,960 కోట్లతో నిర్మించారు. ఈ మార్గంలో దేశంలోనే అత్యంత లోతైన రైల్వే స్టేషన్ ఉంది. ఉపరితలం నుంచి 32 మీటర్ల దిగువన హౌరా మెట్రో స్టేషన్‌ను నిర్మించారు. కోల్‌కతాలో బుధవారం మరికొన్ని రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో మొత్తం రూ.15,400 కోట్ల విలువైన మెట్రో రైలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు.



బుధవారం మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్

అధికారంలోకి రాగానే కుల గణన

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత: రాహుల్

భోపాల్: రాబోయే లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన ప్రారంభిస్తామని కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. అలాగే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని అన్నారు. తమ ప్రభుత్వంలో ఈ రెండు అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించారు. బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలోని బంద్‌నవర్ పట్టణంలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం తరహాలో కులగణన కూడా ఒక భారీ విప్లవాత్మకమైన ముందడుగు అవుతుందని పేర్కొన్నారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు కచ్చితంగా ఎవరెంత మంది ఉన్నారో కులగణన ద్వారా తెలుస్తుందని, దీని ఆధారంగా ఆయా వర్గాల కోసం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయవచ్చని తెలిపారు. ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం చేకూర్చడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. రైతన్నలకు సైతం న్యాయం చేస్తామన్నారు.

ప్రజల నమ్మకాన్ని చెత్త బుట్టలో పడేశారు

జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో అక్రమ నిర్మాణాలు, చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశంలో ప్రఖ్యాతిగాంచిన జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో అడవి మధ్యలో టైగర్ సఫారీల ఏర్పాటును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. వాటి కార్యకలాపాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సఫారీల ఏర్పాటు కోసం అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోపాటు అక్కడి భారీ వృక్షాలను నరికివేయడంపై మండిపడింది. అక్రమ నిర్మాణాలు, చెట్ల నరికివేతకు అనువుగా నిబంధనలను తుంగలో తొక్కిన 2021లో బీజేపీ ప్రభుత్వహయాంలో నాటి ఉత్తరాఖండ్ అటవీ మంత్రి హరక్ సింగ్ రావత్, నాటి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ కిషన్ చంద్‌ల పనితీరును తీవ్రంగా ఆక్షేపించింది. '' ప్రజా విశ్వాసాన్ని బుట్టదాఖలుచేశారు. ఇంతటి విపరీత నిర్ణయాలు కేవలం ఇద్దరే తీసుకున్నారని అనుకోవట్లేము. ఇందులో చాలా మంది ప్రమేయం ఉండొచ్చు'' అని జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని పీకే మిశ్రా, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. జాతీయ వనంలోని ల్యాన్స్‌డౌన్ ఫారెస్ట్ డివిజన్‌లో పత్రో టైగర్ సఫారీ కోసం వేల చెట్లు నరికేశారంటూ పర్యావరణవేత్త, న్యాయవాది గౌరవ్ భన్సల్ వేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. '' అధికారి కిషన్‌ను సస్పెండ్ చేయాలని అటవీ కార్యదర్శి చేసిన సిఫార్సును రావత్ పెడచెవిన పెట్టారు. పైగా కిషన్‌ను సమర్థించారు. రావత్ ఆ పదవి నుంచి దిగిపోయాకే కిషన్ సస్పెన్షన్, అరెస్ట్ చేశారు. ఈ ఘటన రాజకీయనేతలు, ప్రభుత్వ ఉన్నతోద్యోగులు కలిసి చేస్తున్న అక్రమాలకు ప్రబల సాక్ష్యం' అని కోర్టు వ్యాఖ్యానించింది. '' ఈ ఉదంతంపై సీబీఐ ఇప్పటికే దర్యాప్తు జరుపుతోంది. ఈ ఘటనపై సీబీఐ సమగ్ర నివేదిక మూడు నెలల్లో సమర్పించాలి. తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటాం' అని కోర్టు వ్యాఖ్యానించింది. జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ రాయల్ బెంగాల్ పులులకు ఆవాసం. 1,288.31 చదరపు కి.మీ.లోని ఈ అటవీప్రాంతం పేరు. అత్యంత ఎక్కువ సంఖ్యలో పులులు సంచరించే ప్రాంతంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచింది.

ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజాకు ఊరట

చెన్నై: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజాకు మద్రాసు హైకోర్టులో ఊరట లభించింది. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడిన ఉదయనిధి స్టాలిన్, ఎ.రాజాతోపాటు మరో డీఎంకే నేత చట్టసభ సభ్యులుగా కొనసాగడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. అయితే, డీఎంకే నాయకులు వ్యాఖ్యలను కోర్టు తప్పుపట్టింది. సనాతన ధర్మాన్ని హెచ్ఐవీ, మలేరియా, డెంగ్యూతో పోల్చడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలా మాట్లాడడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమేనని తేల్చిచెప్పింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉంటూ సమాజంలో విభజన తెచ్చేలా వ్యవహరించడం ఏమిటని అసహనం వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించింది. వివాదాస్పద వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది.

సీబీఐ కస్టడీకి షాజహాన్ షేక్

ఈడీ అధికారులపై దాడి కేసులో దర్యాప్తు వేగవంతం

కోల్‌కతా: సందేశ్‌ఖాలీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులపై దాడి కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత షాజహాన్ షేక్‌ను సీబీఐ అధికారులు ఎట్టకేలకు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో దర్యాప్తు వేగవంతం చేశారు. అతడిని తక్షణమే సీబీఐకి అప్పగించాలంటూ కలకత్తా హైకోర్టు రెండుసార్లు ఉత్తర్వులు జారీ చేయడంతో పశ్చిమ బెంగాల్ సీఐడీ అధికారులు స్పందించక తప్పలేదు. బుధవారం సీబీఐ అధికారులకు అప్పగించారు. వాస్తవానికి ఈడీ అధికారులపై దాడి కేసులో దర్యాప్తును, నిందితుడు షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించాలంటూ మంగళవారమే కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. అయినా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం లెక్కచేయలేదు. ఈ ఉత్తర్వును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బెంగాల్ ప్రభుత్వ పిటిషన్‌పై వెంటనే విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించలేదు. మరోవైపు కలకత్తా హైకోర్టులో ఈడీ బుధవారం మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం మంగళవారం నాటి ఉత్తర్వును అమలు చేయాలని, షాజహాన్ షేక్‌ను సాయంత్రం 4.15 గంటలకల్లా సీబీఐకి అప్పగించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీబీఐ బృందం బుధవారం సాయంత్రం 4 గంటలకు సీఐడీ ప్రధాన కార్యాలయానికి చేరుకుంది. సీఐడీ అధికారులు సాయంత్రం 6.48 గంటలకు షాజహాన్ షేక్‌ను సీబీఐ బృందానికి అప్పగించారు. అంతకంటే ముందు అతడిని ఆసుపత్రికి తరలించి, వైద్య పరీక్షలు చేయించారు. కరడుగట్టిన నేరగాడిగా ముద్రపడిన షాజహాన్ షేక్‌పై సందేశ్‌ఖాలీలో దళిత, గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తీవ్రంగా స్పందించారు.

అమేథీ నుంచి రాహుల్ పోటీ?

అమేథీ: గతంలో పలుమార్లు తాను ప్రాతినిధ్యం వహించిన అమేథీ లోక్‌సభ స్థానం నుంచే ఈసారి కూడా రాహుల్ గాంధీ బరిలో దిగుతారని కాంగ్రెస్ పార్టీ అమేథీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రదీప్ సింఘాల్ చెప్పారు. ఢిల్లీలో సమావేశం తర్వాత అమేథీకి తిరిగొచ్చిన సింఘాల్ మీడియాతో మాట్లాడారు. '' అమేథీ నుంచి ఈసారి కూడా పార్టీ అభ్యర్థి రాహుల్ గాంధీయే. త్వరలోనే ఆయన పేరును ప్రకటిస్తారు'' అని అన్నారు. అయితే దీనిపై పార్టీ అధిష్టానం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఇంకా జరగలేదు. ఆలోపే అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి ప్రకటన వెలువడే అవకాశం లేదు. 2002 నుంచి 2019 దాకా అమేథీ నుంచి రాహుల్ గాంధీయే ప్రాతినిధ్యంవహిస్తూ వస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ అమేథీతోపాటు కేరళలోని వయనాడ్‌లోనూ పోటీకి దిగారు. అమేథీలో బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే వయనాడ్‌లో విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

నిందితుడి జాడ చెప్తే రూ.10 లక్షలు

ప్రకటించిన జాతీయ దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ: బెంగళూరులో మార్చి ఒకటో తేదీన రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడి సమాచారం అందిస్తే రూ.10 లక్షల బహుమతి ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బుధవారం ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేసింది. కేఫ్‌లోకి అడుగుపెట్టేటపుడు ఆ వ్యక్తి క్యాప్, మాస్క్, కళ్లద్దాలు ధరించి ఉన్నాడని ఎన్ఐఏ పేర్కొంది. నిందితుడు జాడ తెలిపిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎన్ఐఏ హామీ ఇచ్చింది. ఈస్ట్ బెంగళూరులోని బ్రూక్‌ఫీల్డ్‌లో జరిగిన ఈ పేలుడు ఘటనలో 10 మంది గాయపడ్డారు. శక్తివంత పేలుడు పదార్థం(ఐఈడీ) వాడటంతో కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏకు అప్పగించడం తెల్సిందే. మొదట కర్ణాటక పోలీసులు కఠినమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం, పేలుడు పదార్థాల చట్టాల కింద కేసు నమోదుచేశారు. ముంబైలో నవంబర్ 26న ఉగ్రదాడి తర్వాత ప్రత్యేకంగా ఉగ్రసంబంధ ఘటనలపై దర్యాప్తు కోసం ఎన్ఐఏను 2008లో ఏర్పాటుచేశారు.

జంట సిలిండర్ల పేలుళ్లు

ఒకే కుటుంబంలో ఐదుగురి దుర్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఇంట్లో రెండు వంటగ్యాస్ సిలిండర్లు పేలిన దుర్ఘటనలో ఒకే కుటుంబంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్ర కాలిన గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. కకోరీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హటా హజ్‌రత్ సాహెబ్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు అంటుకోవడంతో సిలిండర్లు పేలిపోయినట్లు వార్తలొచ్చాయి. మంగళవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో తొమ్మిదిమంది కుటుంబసభ్యులు ఇంట్లో ఉన్న సమయంలో ఈ పేలుళ్లు సంభవించాయి. గాయపడిన వారినందరినీ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ ఇంటిని బాణసంచా తయారీ కోసం వినియోగించే వారు అని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. అయితే దర్యాప్తు కొనసాగుతోందని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని జిల్లా మేజిస్ట్రేట్ సూర్యపాల్ గంగ్వార్ అన్నారు.

కేజ్రీవాల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతినివ్వండి

కోర్టులో మరో పిటిషన్ వేసిన ఈడీ

న్యూఢిల్లీ: వరుస సమన్లను బేఖాతరు చేస్తూ విచారణకు గైర్హాజరైన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు ఢిల్లీ స్థానిక కోర్టు అనుమతి కోరుతూ ఈడీ తాజాగా మరో పిటిషన్ దాఖలుచేసింది. మూడు సమన్లకు స్పందించలేదంటూ అప్పట్లోనే ఢిల్లీ కోర్టులో ఈడీ పిటిషన్ వేయడం తెల్సిందే. దాని విచారణ మార్చి 16కు వాయిదా పడింది. తర్వాత కూడా కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీచేసింది. 8 సమన్లు జారీ చేసినా గైర్హాజరైనందున ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాలంటూ తాజాగా మరో పిటిషన్ వేసింది. దీనిపై గురువారం విచారణ జరగనుంది.

త్రిపురలో బీజేపీ సర్కారుకు మోతా మద్దతు!

అగర్తలా: త్రిపురలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన తిప్రా మోతా పార్టీ నేరుగా అధికార బీజేపీకి మద్దతు పలుకుతున్నట్లు బీజేపీ సీనియర్ నేత ఒకరు బుధవారం ప్రకటించారు. 60 సభ్యులుండే త్రిపుర అసెంబ్లీలో మోతాకు 13 మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రభుత్వానికి దాని మద్దతు ఇస్తున్న నేపథ్యంలో వారిలో ఇద్దరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశముంది. త్రిపుర ఆదివాసీల అన్ని డిమాండ్ల సాధనకు కట్టుబడి ఉంటామని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, మాణిక్ సాహా నేతృత్వంలోని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలోనే ఈ త్రిముఖ ఒప్పందం కుదిరిందని తెలుస్తోంది. ''సార్వత్రిక ఎన్నికల్లోపే బీజేపీ–ఐపీఎఫ్‌టీ కూటమి ప్రభుత్వంలో తిప్రా మోతా కలవనుంది. మంత్రుల ప్రమాణస్వీకార తేదీ త్వరలో ప్రకటిస్తాం'' అని త్రిపుర బీజేపీ చీఫ్ రజీబ్ చెప్పారు.

ఎర్రసముద్రంలో హౌతీ దాడులు.. ఇద్దరి మృతి

దుబాయ్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ మారణకాండకు తీవ్రంగా తప్పుబడుతూ అందుకు ప్రతిగా ఎర్రసముద్రంలో వాణిజ్యనౌకలను లక్ష్యంగా చేసుకున్న హౌతీ తిరుగుబాటుదారులు తమ దాడులను ఉధృతం చేశారు. దీంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హౌతీ దాడుల్లో మరణాలు సంభవించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఎర్ర సముద్ర పరిధిలోని గల్ఫ్ ఆఫ్ ఆడెన్ వద్ద ఈ ఘటన జరిగింది. బుధవారం గ్రీస్ దేశానికి చెందిన బార్బడోస్ జెండాతో వెళ్తున్న వాణిజ్యనౌక 'ట్రూ కాన్ఫిడెన్స్'పై హౌతీలు మిస్సైల్ దాడి జరపగా నౌకలోని ఇద్దరు సిబ్బంది చనిపోయారు. ఇతర సిబ్బంది పారిపోయారు. నౌకను వదిలేశామని, అది తమ అధీనంలో లేదని చెప్పారు. తమ యుద్ధనౌకలపైకి హౌతీ రెబెల్స్ నౌక మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించడంతో అమెరికా విధ్వంసక నౌకలు రెచ్చిపోయాయి. హౌతీలు ఉంటున్న యెమెన్ భూభాగంపై దాడి చేసి హౌతీ క్షిపణులు, డ్రోన్లను ధ్వంసంచేసింది. హౌతీల దాడుల్లో మరణాలు నమోదవడంతో ఆసియా, మధ్యప్రాచ్యం, ఐరోపాల మధ్య సముద్ర రవాణా రంగంలో సంక్షోభం మరింత ముదిరింది. హౌతీలపై అమెరికా దాడులపై ఇరాన్ మండిపడింది. అమెరికా ఇంధన సంస్థ షెవ్రాన్ కార్ప్‌కు చేరాల్సిన కువైట్ చమురును తోడేస్తామని హెచ్చరించింది. రూ.414 కోట్ల విలువైన ఆ చమురును తీసుకెళ్తున్న నౌకను ఇరాన్ గతేడాది హైజాక్ చేసి తమ వద్దే ఉంచుకుంది.

సాక్షి కరీంనగర్

గురువారం | 7 | మార్చి | 2024



క్వింటాల్ పత్తి రూ.7,400

జమ్మికుంట: స్థానిక పత్తి మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ పత్తి రూ.7,400 పలికింది. క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ పర్యవేక్షించారు.



.. అంతలోనే విషాదం

భార్య రెండు ఉద్యోగాలు సాధించడంతో స్నేహితుతులు పార్టీ అడిగారు. వారికి విందు ఇచ్చేందుకు వెళ్లిన గంటలోనే రోడ్డు ప్రమాదం కబళించింది.

8లో▶

గరిష్టం/కనిష్టం
37.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- వాగేశ్వరిలో నైబర్ హుడ్ పార్లమెంట్



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో కలెక్టర్ పమేలా సత్పతి, కాలేజీ యాజమాన్యం

తిమ్మాపూర్: విద్యార్థిదశ నుంచే రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం తిమ్మాపూర్ వాగేశ్వరి ఇంజినీరింగ్ కాలేజీలో నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ చీఫ్‌గెస్ట్‌గా హాజరయ్యారు. విద్యార్థులు అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అవగాహన పెరుగుతుందన్నారు. మాక్ పార్లమెంట్ నిర్వహించిన విద్యార్థులతో కలెక్టర్ ఇంటరాక్ట్ అయ్యారు. అనంతరం ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మిండే రాకేశ్‌కు బహుమతి, మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.నాగార్జున, ఎం. వెంకట రాంబాబు , రవీందర్ తహసీల్దార్ కనకయ్య, కాలేజీ సెక్రటరీ జి.శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వసీం, స్వప్న పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి



హుజూరాబాద్: మహిళల సంక్షేమానికి ప్రధాని మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శక్తి వందన్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో వీవోసీఆర్పీ, స్వయం సహాయక బృందాల సభ్యులతో ఆయన మాట్లాడారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకొచ్చిందన్నారు. వాటిపై ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మండల అధ్యక్షుడు రాముల కుమార్, కౌన్సిలర్ నల్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా షట్టర్ల కేటాయింపు వాయిదా

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్‌లోని దుకాణ సముదాయాల షట్టర్ల కేటాయింపు వాయిదా వేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి గోడను ఆనుకొని నిర్మించిన 126 దుకాణాలు, విద్యానగర్, శాతవాహన వర్సిటీ వద్ద 25 దుకాణాలు కేటాయింపు గురువారం నిర్వహించాల్సి ఉండగా వాయిదా వేసినట్లు వివరించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది మళ్లీ ప్రకటిస్తామన్నారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌రూరల్: నగునూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో మహిళ గెస్ట్ లెక్చరర్ ఎకనామిక్స్(1) బోధించేందుకు రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సమత ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఉత్తీర్ణత శాతం, బోధన అనుభవం, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులను ఈనెల 11న ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో వారధిలో దరఖాస్తు చేసుకోవాలని, రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూకి ఈనెల 11న ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.



కరీంనగర్‌లో జిల్లా జడ్జి ప్రతిమ, కలెక్టర్ పమేలా సత్పతిలను సన్మానించిన మహిళా అధికారులు



బెలూన్లు ప్రదర్శిస్తున్న టీఎన్జీవోస్ మహిళా ఉద్యోగులు



ఆర్టీసీ మహిళా ఉద్యోగులను సన్మానించిన ఆర్టీసీ ఆర్ఎం సుచరిత



వేడుకల్లో కరీంనగర్ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సభ్యులు



టీఎన్జీవోస్ మహిళా ఉద్యోగులు..



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు

ముందస్తు మహిళా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ముందస్తు మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి ప్రతిమ, కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడారు. కరీంనగర్ ఆర్టీసీ 1,2 డిపోలలో రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన అసిస్టెంట్ మేనేజర్ ఎస్.జ్యోత్స్నను సత్కరించారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్స్ -320 ఆధ్వర్యంలో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో వేడుకలు నిర్వహించారు. నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ డాక్టర్ సమత, మెప్మా డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో, జెడ్పీలో వేడుకలు నిర్వహించారు.

–కరీంనగర్/కరీంనగర్ అర్బన్/రూరల్



బెలూన్ ఊదుతున్న ఉద్యోగిని



వేడుకల్లో మెప్మా డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి

మంచినీళ్లు మహాప్రభో

- బల్దియా సమావేశంలో కార్పొరేటర్ల మొర
- ఎల్ఎండీలో 10 టీఎంసీల నీటి నిల్వకు తీర్మానం
- రూ.577 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం
- నగం పనులపై గళమెత్తిన సభ్యులు



సమావేశానికి హాజరైన మహిళా కార్పొరేటర్లు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాం ... ముందువేసవిలో పరిస్థితి ఏమిటో ఊహించండి...తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి...నీటి ఎద్దడిని నివారించండి...ఎల్ఎండీలో నీటి నిల్వను పెంచండి...అంటూ నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశంలో సభ్యులు గళమెత్తారు. 2024–25 సంవత్సరానికి రూపొందించిన రూ.577 కోట్ల బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. నగరంలో సగంలోనే నిలిపివేసిన పనులపై నిలదీశారు. నగరపాలకసంస్థ జనరల్‌బాడీ మీటింగ్ బుధవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ యాదగిరి సునీల్ రావు అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే...నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని కార్పొరేటర్లు గంట కల్యాణి, కుర్ర తిరుపతి, బండారి వేణు, కంసాల శ్రీనివాస్, కచ్చు రవి, కొలగాని శ్రీనివాస్ తదితరులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే తమ ప్రాంతాల్లో రోజువిడిచి రోజు తాగునీటి సరఫరా చేస్తున్నారని, అది కూడా సరిగా రావడం లేదన్నారు. శాతవాహన రిజర్వాయర్ పరిధిలోని డివిజన్‌లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసుకోవాల్సి వస్తుందని, పరిస్థితి మున్ముందు మరింత తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. శివారు ప్రాంతాల్లో పైప్‌లైన్ నిర్మాణం చేసి తాగునీటి సరఫరా చేయాలన్నారు. మోటార్ల మరమ్మతులు చేపట్టాలని, అదనపు మోటార్లను సమకూర్చి తాగునీటికి ఇబ్బందిలేకుండా చూడాలన్నారు.

పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో....

నగరంలో సీఎం హామీ నిధులతో చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలని సభ్యులు డిమాండ్ చేశారు. అసలు పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారో లేదో తెలియాలంటే సంబంధిత కాంట్రాక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కంసాల శ్రీనివాస్ సూచించారు. ముస్లిం డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేసేందుకు నిధులు విడుదల చేయాలని కో–ఆప్షన్ సభ్యురాలు రఫియాసుల్తానా, అసంపూర్తి పనులు ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని కార్పొరేటర్ శర్ఫొద్దీన్ కోరారు.

బీఆర్ఎస్ కార్పొరేటర్ల తీరుతో అవమానం

కరీంనగర్ ఘనతను బీఆర్ఎస్ కార్పొరేటర్లు భ్రష్టుపట్టించారని బీజేపీ కార్పొరేటర్ పెద్దపల్లి జితెందర్ ఆరోపించారు. దీనిపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇచ్చి ప్రభుత్వ స్థలాలను కాజేస్తున్నారని జితెందర్ చెప్పగా, ప్రభుత్వ భూములను రెవెన్యూ, మున్సిపల్ భూములను నగరపాలకసంస్థ కాపాడాల్సిందేనని మేయర్ బదులిచ్చారు. ముడుపులు ముట్టనిదే అధికారులు పనులు చేయడం లేదన్నారు. ఫిల్టర్‌బెడ్ నిర్వహణకు అవుతున్న ఖర్చెంత? ఎనర్జీ ఆడిట్ చేశారా? అని ఆయన ప్రశ్నించారు. శ్రీరాంబుక్ స్టాల్‌రోడ్ పనులు మొదలుపెట్టాలని, తమ డివిజన్‌ను మేయర్ సందర్శించాలని కోరారు. సమావేశానికి కలెక్టర్ ఎందుకు రాలేదని మాజీ మేయర్, కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ అధికారులను ప్రశ్నించారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం కలెక్టర్ రావాల్సి ఉందని, రాకపోవడం సభకు అవమానమేనన్నారు. రంజాన్ మాసంలో నగరంలోని ముస్లిం కాలనీల్లో ఎక్కువ ప్రెషర్‌తో తాగునీరు వచ్చేలా చూడాలని, ఇమామ్, మౌజన్ జీతాలు చెల్లించాలని శర్ఫొద్దీన్ కోరారు. ఐదు సంవత్సరాల క్రితం మాన్యువల్‌గా చేసుకున్న మ్యుటేషన్ ఇప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని కంసాల శ్రీనివాస్ ఆరోపించారు. శివరాత్రి పండుగ సందర్భంగానైనా కాంట్రాక్టు లేబర్‌లకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరగా, నెలాకరులోగా చెల్లిస్తామని మేయర్ సమాధానమిచ్చారు. రంజాన్ సందర్భంగా సహెర్, ఇఫ్తార్ వేళల్లో ట్రాఫిక్ తనిఖీల నుంచి మినహాయింపు ఇవ్వాలని రఫియా సుల్తానా కోరారు.

ఎల్ఎండీలో 10 టీఎంసీల నీటి నిలువ ఉండేలా చూడాలి

నగరపాలకసంస్థకు తాగునీటిని అందించే జలవనరు మానేరు డ్యాంలో 10 టీఎంసీలకు తగ్గకుండా నీటి నిలువ ఉండేలా చూడాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు సంవత్సరాల నుంచి నగరంలో ప్రతీ రోజు తాగునీటి సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం మానేరు డ్యాంలో నీటి సామర్థ్యం తగ్గుతోందన్నారు. ప్రస్తుతం 66 ఎంఎల్‌డీలు రావాల్సిన రా వాటర్ 60 ఎంఎల్‌డీలకు పడిపోయిందన్నారు. ఇప్పుడు ఎనిమిదన్నర టీఎంసీలు ఉన్న నీటినిలువ రాబోయే రోజుల్లో ఐదు టీఎంసీలకు పడిపోతుందని ప్రభుత్వ యంత్రాంగమే చెబుతోందన్నారు. అందుకే 10 టీఎంసీలకు తగ్గకుండా చూడాలన్నారు. గత 2021 మార్చిలో 21 టీఎంసీలు, 2022 లో 15 టీఎంసీలు, 2023 లో 13 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 8 టీఎంసీలకు చేరిందన్నారు. 2021 ఏప్రిల్‌లో 15 టీఎంసీలు, 2022లో 10 టీఎంసీలు, 2023లో 11 టీఎంసీలు ఉండగా 2024 ఏప్రిల్‌లో 7 టీఎంసీలకు పడిపోతుందని ప్రభుత్వ ఇచ్చిన ఉత్తర్వుల్లో తెలిపారని వివరించారు. ఎల్ఎండీలో 5 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పాటిస్తామని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గతంలో మానేరు డ్యాం జలాశయంలో 13 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని పాటించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ ఉత్తర్వు ప్రకారం 10 టీఎంసీలకు తగ్గకుండా నీటినిలువ పాటించాలన్నారు. అవసరమైతే ఎస్సారెస్పీ కాలువ ద్వారా డ్యాంలోకి నీటిని విడుదల చేయాలన్నారు. తీర్మానాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. సమావేశంలో నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.577 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

2024–25 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్, 2023–24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. నగరపాలక సంస్థ సొంత ఆదాయ వనరులు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్, 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, పారిశుధ్య నిర్వాహణ, రుణవాయిదాల చెల్లింపులు, హరిత హారం పనులకు కేటాయించారు. తప్పనిసరి పద్దుల కేటాయింపులుపోను మిగిలిన నగరపాలక సంస్థ సొంత నిధుల నుంచి మూడోవంతు నిధులను విలీన, శివారు ప్రాంతాల అభివృద్ధి, బలహీన వర్గాలు, మైనార్టీలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు. అలాగే పార్కులు, వైకుంఠ దామాల అభివృద్ధి, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం, సమీకృత మార్కెట్లు, శాస్త్రీయ పద్ధతిలో డంప్ యార్డుల నిర్మాణం, కరెంట్ బిల్లులు తదితర వ్యయాలకు పట్టణ ప్రగతి గ్రాంట్‌ని వినియోగించాలని పేర్కొన్నారు.

కర్షకుల సమస్యల పరిష్కారానికే

‘రైతు నేస్తం’

- వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రసంగాన్ని వీక్షించిన ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి



సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం వీక్షిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్(మానకొండూర్): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి వద్దకే వెళ్లి పంటల సాగులో వస్తున్న సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచనతో రైతు నేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిమ్మాపూర్ రైతు వేదికలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పంటల సాగులో మంచి లాభాలు సాధించి, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవనాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో విజయ్ కుమార్, ఏవో సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

సీఎం ప్రసంగం ప్రారంభమయ్యే సమయానికి తిమ్మాపూర్ రైతు వేదికలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు ఆందోళన చెందారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ కనెక్ట్ కావడానికి కొంత సమయం పట్టింది. ఎమ్మెల్యే, కలెక్టర్ సుమారు 20 నిమిషాలపాటు నిరీక్షించారు. సరిగ్గా సీఎం ప్రోగ్రాం ప్రారంభమయ్యే సమయం మధ్యాహ్నం 12.30 గంటలకు లైవ్ కనెక్ట్ కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గెలిచిన వెంటనే కేంద్రం నుంచి నిధులు

- కేసీఆర్‌వి నక్క వినయాలు
- సీఎం రేవంత్ ప్రధానిని పెద్దన్నగా భావించాలె
- ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ మోసం
- ఎంపీ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

మానకొండూర్: కరీంనగర్ ఎంపీగా గెలిచిన వెంటనే కేంద్రం నుంచి నిధులు తెచ్చి అన్నివిధాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, ఖాదర్‌గూడెం, ఈదులగట్టెపల్లి, అన్నారం, మానకొండూర్ గ్రామాల్లో ఆయన బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అన్నారం గ్రామంలో ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌వి నక్క వినయాలని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని ఐదేళ్లపాటు పెద్దన్నగా భావించాలని, కేసీఆర్ లెక్క చిల్లమల్లరగా తిట్టి ప్రజల్లో చులకన కావొద్దన్నారు. జనం కోసం కొట్లాడి కేసుల పాలయ్యాయనరని, వందకుపైగా కేసులు ఉన్నాయని బండి సంజయ్ చెప్పారు. అధికారంలో లేని బీఆర్ఎస్‌కు ఓటేస్తే మురికి కాలువలో వేసినట్టేనన్నారు. బీజేపీకి ఓటేయకపోతే కేంద్రం నుంచి వచ్చే నిధులు రాకుండా పోతాయన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఉపాధిహామీ పనుల కోసం రూ. 151.40 కోట్లు, రోడ్ల మెటీరియల్ కోసం రూ.112.95 కోట్లు, చెట్ల పెంపకం కోసం రూ.131.58 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని గుర్తుచేశారు. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి కేంద్రం సపోర్టుగా ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానిని కలిస్తే తప్పేమిటో చెప్పాలని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని మండి పడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ ఎన్నికల కోడ్‌పేరిట తప్పించుకుంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ. 3 లక్షల కోట్లు అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం కేవలం మూడు వేల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి, కార్యదర్శి రంగు భాస్కరచారి, అప్పని తిరుపతి, శ్రీనివాస్, మీస రమణయ్య, రాదారపు చక్రవర్తి, శ్రీనివాస్, బాషబోయిన ప్రదీప్, కత్తి ప్రభాకర్, కోల శ్రీనివాస్, బలరాం, అశ్వన్, శ్రీనివాస్, కంది రాజిరెడ్డి, షోజేందర్‌రెడ్డి, కాల్వ చిరంజీవి, మార్క సుమతి, ఔదరి విజయ తదితరులు పాల్గొన్నారు.

దర్శిద్దాం..తరిద్దాం

- నేటి నుంచి వేములవాడలో మహా శివరాత్రి ఉత్సవాలు షురూ..
- తరలివస్తున్న భక్తజనం

వేములవాడ: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న సన్నిధిలో గురువారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ఆరంభంకానున్నాయి. ఈనెల 9 వరకు అంగరంగ వైభవంగా మహాశివరాత్రి జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాలకు దాదాపు రెండు లక్షల వరకు భక్తులు వస్తారని జిల్లా అధికారుల అంచనా. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు రూ.3 కోట్లతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేములవాడకు చేరుకునే ఐదు ప్రధాన రహదారుల్లో భక్తులకు స్వాగతం పలికేందుకు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

వేములవాడకు ఇలా చేరుకోండి

- హైదరాబాద్‌కు 150 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 32 కిలోమీటర్ల దూరంలో వేములవాడ ఉంది. రోడ్డు మార్గం ద్వారా చేరుకోవచ్చు.
- సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండు నుంచి ప్రతీ 30 నిమిషాలకో బస్సు, కరీంనగర్ నుంచి ప్రతీ పది నిమిషాలకో బస్సు సౌకర్యం ఉంది.
- హైదరాబాద్ నుంచి వయా సిద్దిపేట మీదుగా, వరంగల్ నుంచి వయా కరీంనగర్ మీదుగా వేములవాడకు రోడ్డు మార్గంలో చేరుకోవచ్చు.
- వేములవాడ గుడి చెరువు కట్టకింద ప్రత్యేక బస్టాండు ఏర్పాటు చేశారు. దాదాపు 400 బస్సులతో 900 ట్రిప్పులను ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు.
- బస్టాండ్ నుంచి ఆలయానికి చేరుకునేందుకు ఉచితంగా 15 బస్సులు నడిపించనున్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి ఒకరి మృతి


ముకుందరావు (ఫైల్)

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన బిస్సాడి ముకుందరావు (58) రైలు కింద పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని రైల్వేగేటు వద్ద రైలు కింద పడి మృతి చెందాడని, మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ గంగారపు తిరుపతి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తామని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గేట్ గ్రామంలో బుధవారం మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా చింతలదాబాకు చెందిన అక్షయ్ సదాశివ్ కుంబరే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిక్ కంపెనీలో పనిచేస్తున్న అక్షయ్ సదాశివ్ కుంబరే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అతని స్నేహితుడు మృతి చెందగా స్వగ్రామానికి వెళ్లివచ్చి స్నేహితుడి మృతి తట్టుకోలేక మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సదాశివ కుంబరే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తెలిపారు.

ఇంటికి చేరిన వలస జీవి మృతదేహం


శ్రీకాంత్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం మలేషియా వెళ్లిన మండలంలోని కొలనూర్‌కు చెందిన సుదమల్ల శ్రీకాంత్ (33) అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోగా.. మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీకాంత్ గత జనవరి 22న పక్షవాతానికి గురికాగా.. సరైన వైద్యం అందలేదు. పక్షవాతంతో బాధపడుతున్న శ్రీకాంత్‌ను తీసుకొచ్చేందుకు కుటుంబీకులు మలేషియా వెళ్లినా తీసుకొచ్చేందుకు అక్కడి కంపెనీ అంగీకరించలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్వదేశానికి తిరిగొచ్చారు. కాగా ఫిబ్రవరి 22న శ్రీకాంత్ మృతిచెందాడు. మృతునికి భార్య లహరి, కూతురు ప్రణీత(3), కుమారుడు శ్రీహన్స్(18 నెలలు) ఉన్నారు.

11న విదేశీ ఉద్యోగ నియామకాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: విదేశీ ఉద్యోగ నియామకాలపై ఈనెల 11న సికింద్రాబాద్ ముషీరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో టామ్‌కాం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కాం) అవగాహన కార్యక్రయం నిర్వహిస్తోందన్నారు. 21–38 ఏళ్ల వయస్సు కలిగి బీఎస్సీ అర్హత గల నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్ఎం డిప్లొమా హోల్డర్లు నర్సింగ్ కేరీర్ అవకాశాల కోసం హాజరు కావాలని సూచించారు. జర్మన్ భాషపై నివాస శిక్షణ, జర్మనీలో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలను టామ్ కాం ద్వారా ఎంపిక చేయబడిన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల నర్సింగ్ అభ్యర్థులు సెల్ నంబర్ 9908830438, 6302292450, 8919047600, 7901290580 నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

సంతోషం.. అంతలోనే విషాదం

- రెండు ఉద్యోగాలు సాధించిన భార్య
- విందు ఇవ్వాలని కోరిన స్నేహితులు
- ఇంటి నుంచి వెళ్లిన గంటకే రోడ్డు ప్రమాదం
- ముందునుంచి వేగంగా వచ్చి కబళించిన లారీ
- అక్కడికక్కడే దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు


రాజశేఖర్ (ఫైల్)


ధర్మపురిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మపురి: భార్య రెండు ఉద్యోగాలు సాధించడంతో స్నేహితులు పార్టీ అడిగారు. వారికి విందు ఇచ్చేందుకు వెళ్లిన గంటలోనే రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో ఆ ఇంట్లో విషాదం నిండింది. ఈ ఘటన ధర్మపురిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర కాలనీకి చెందిన నర్మల రాజశేఖర్ (36) బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. రాజశేఖర్ భార్య మనీషా ఇటీవల ప్రకటించిన టీజీటీ, పీజీటీలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. దీంతో పార్టీ (దావత్) ఇవ్వాలని తోటి మిత్రులు కోరారు. మంగళవారం సాయంత్రం బీర్‌పూర్‌లో విధులు ముగించుకుని ఇంటికి చేరిన రాజశేఖర్ నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో తన స్నేహితుడైన ధర్మపురికి చెందిన సిరుప బద్రి ఇంటికొచ్చి పార్టీ కోసమని ద్విచక్రవాహనంపై మండలంలోని రాయపట్నం గ్రామానికి వెళ్లారు. విందు చేసుకుని తిరిగి వస్తుండగా బూరుగుపల్లె బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సిపతి బద్రి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

ఇంటి నుంచి వెళ్లిన గంటలోపే..

ఇప్పుడే వస్తానంటూ రాజశేఖర్ మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. వెళ్లిన కొద్దిసేపటికే పార్టీ ముగించుకుని తిరుగు పయనమయ్యారు. అంతలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో భార్య, తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. రాజశేఖర్‌కు కుమారుడు శ్రీహర్ష ఒక్కగానొక్క కుమారుడు. అతడు తండ్రి చితికి నిప్పు పెట్టడం అక్కడున్న వారిని కలిచివేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

అమ్మా.. నాన్నకు ఏమైంది..?

- గుండెపోటుతో తండ్రి మృతి
- దిక్కులు చూస్తున్న పిల్లలు


రవి (ఫైల్)


అమాయకంగా చూస్తున్న చిన్నారులు

వెల్గటూర్: 'అమ్మా.. నాన్నకు ఏమైంది..? నాన్నాను ఎక్కడికి తీసుకెళ్తన్నారు.. ? మళ్లీ ఎప్పుడొస్తాడు..? అమ్మ ఎందుకు ఏడుస్తున్నావమ్మా..' అంటూ ఆ చిన్నారులిద్దరూ అమాయకంగా అడుగుతుంటే ఏమని చెప్పాలో తెలియక అక్కడున్న వారందరూ గుండెలవిసేలా రోదించారు. నాన్న దూరమై చిన్నారులు.. కట్టుకున్న వాడు దూరమై భార్య, వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు దూరమై గుండెలవిసేలా ఏడుస్తున్న ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మూగల రవి (35) ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికొచ్చాడు. ప్రస్తుతం స్థానికంగా కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. అప్పటివరకూ అందరితో కలివిడిగా గ్రామంలో తిరిగిన రవి గుండెనొప్పి బారిన పడడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. రవికి భార్య జ్యోతి (29), కూతుళ్లు శాన్వి (7), సమన్వి (4) ఉన్నారు. రవి తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. చివరి దశలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు దూరమై తల్లిదండ్రులు, తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో వారి రోదనలు మిన్నంటాయి. తండ్రికి ఏమైందో తెలియని ఆ చిన్నారులు అమాయకంగా చూస్తుండడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తాళం

- 14 నెలలుగా అద్దె చెల్లించని వైనం
- ఇంటి యజమానికి రూ.3.36లక్షల బకాయి
- ఎంపీటీసీ హామీతో తెరుచుకున్న కార్యాలయం


కార్యాలయానికి తాళం వేస్తున్న యజమాని

వెల్గటూర్: జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం భవన యజమాని తాళం వేశాడు. కొత్తగా ఏర్పడిన ఈ మండలంలో 21 అక్టోబర్ 2022న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని రాయిల్ల భూమేశ్‌కు చెందిన ఇంటిని నెలకు రూ.24వేల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటినుంచి 14నెలలు గడిచినా అద్దె చెల్లించలేదు. బకాయి రూ.3.36లక్షలకు చేరింది. ఆ మొత్తం చెల్లించాలంటూ యజమాని భూమేశ్ కార్యాలయానికి ఉదయం తాళం వేశాడు. విద్యుత్ బిల్లు రూ.50 వేలకు చేరింది. కార్యాలయానికి తాళం వేయడంతో గంటపాటు సిబ్బంది బయటే వేచి చూశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎంపీటీసీ బషీర్ హామీ ఇవ్వడంతో భూమేశ్ తాళాలు తీశాడు. పది రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపకుంటే తాళం వేస్తానని భూమేశ్ హెచ్చరించారు.

సింగరేణిని అగ్రస్థానంలో నిలపాలి

- సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం


సీఅండ్ఎండీకి బొకే అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి స్థితిగతులను కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధి కోసం అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని సీఅండ్ఎండీ ఎన్.బలరాం కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో అధికారుల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలని, దీనికోసం ప్రతీ అధికారి, కార్మికుడు పూర్తి పని గంటలు సద్వినియోగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఉద్యోగులను చైతన్యపరుస్తూ ముందుకు నడపాలని సూచించారు. ఉత్పత్తి వ్యయం, బొగ్గు అమ్మకం, ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులు కూలకషంగా వివరించారు. సంస్థను అభివృద్ధి పథంలో నడపాలంటే ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాత్మక చర్యలను సూచించాలని అధికారులు కోరారు. కంపెనీ లాభదాయకంగా నడిస్తే కార్మికులతో పాటు అధికారులకు కూడా తగిన విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈసందర్భంగా అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీపతిగౌడ్, జనరల్ సెక్రెటరీ పెద్దినరసింహులుతో పాటు కమిటీ నాయకులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

అధికారులకు ప్రోత్సాహం కల్పించాలి

సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న అధికారులకు తగిన ప్రోత్సాహం కల్పించాలని సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ కోరారు. అధికారులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేయాలని, ఉన్నత చదువులు చదివే అధికారుల పిల్లలకు కార్మికులకు మాదిరిగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. సమావేశంలో కోఆర్డినేషన్ జీఎం ఎం.సురేష్, అధికారుల సంఘం ఉపాధ్యక్షులు పానుగోటి శ్రీనివాస్, పి.రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వృద్ధుడి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ బాలాజీనగర్‌లో గల సుచిత్ర అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కామారపు రమేశ్(60) అనే వృద్ధుడు పడి మృతిచెందినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కొత్తపల్లి పట్టణానికి చెందిన రమేశ్ ఏడాది క్రితం బాలాజీనగర్‌లోని సుచిత్ర అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసి నివాసముంటున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉండగా.. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తులో ఉండే రమేశ్ బుధవారం కళ్లు కనిపించక ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి రైతు..

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన రైతు కట్కూరి నారాయణరెడ్డి(73) మంగళవారం రాత్రి పంట పొలాలకు నీరు మళ్లించే క్రమంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పొలాలకు నీరు మళ్లించేందుకు మరో నాలుగురు రైతులతో కలిసి హిమ్మత్‌నగర్‌కు వెళ్లే కాలువ తూములో ఇరుకున్న చెత్తను తొలగిస్తుండగా కాళ్లకు పారక చుట్టుకోవడంతో నీటిలో పడి కొట్టుకుపోయాడు. తోటి రైతులు అప్రమత్తమై వెంటనే బయటికి తీసి చికిత్స కోసం జమ్మికుంటకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

జమ్మికుంట: ప్రమాదవశాత్తు చెరువులో పడి మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన కన్నెవేన కొంరయ్య అలియాస్ బక్కయ్య (68) జమ్మికుంట మున్సిపల్ నాయిని చెరువులో పడి చనిపోయాడు. ఇరవై ఏళ్లుగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజులకు ఇంటికి తిరిగి వచ్చేవాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఓ రైతు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి చెల్లి గంద్రకోట మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన రాజన్న ఉత్సవ కమిటీ


కొలువుదీరిన కొత్త పాలకమండలి సభ్యులు

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ సభ్యులుగా అనుమల్ల చంద్రం(జగిత్యాల), వడ్డేపల్లి వెంకటరమణ(హుస్నాబాద్), కె.రాజిరెడ్డి(సిరిసిల్ల), సి.విజయలక్ష్మి(మంథని), సాగరం వెంకటస్వామి(వేములవాడ), పాత సత్యలక్ష్మి(వేములవాడ), కూరగాయల కొమరయ్య(వేములవాడ), సంద్రగిరి శ్రీనివాస్(వేములవాడ), కనికరపు రాకేశ్ (వేములవాడ), నాంపల్లి శ్రీనివాస్(నాంపల్లి), పులి రాంబాబు(వేములవాడ), తూము సంతోష్(వేములవాడ), వకుళాభరణం శ్రీనివాస్(నూకలమర్రి), పిల్లి కనకయ్య(రుద్రవరం), సంగ స్వామియాదవ్ (శాత్రాజుపల్లి), జగన్మోహన్‌రెడ్డి(నిజామాబాద్), చేపూరి గంగయ్య(నిమ్మపల్లి), చింతపంటి రామస్వామి(నర్సింగాపూర్), కాయితి నాగరాజు(దుంపేట), తొట్ల అంజయ్య(పోతారం), ఏనుగు రమేశ్ రెడ్డి(దమ్మన్నపేట), సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి(మన్నెగూడం), ధార్న మల్లేశం(రుద్రంగి)లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సమక్షంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఫెస్టివల్ కమిటీ సభ్యులకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫెస్టివల్ కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతూ.. భక్తుల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

మహాశివరాత్రి మహోత్సవానికి రండి




మంత్రి శ్రీధర్‌బాబు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న శ్రీనివాస్, ఎంపీని ఆహ్వానిస్తున్న అధికారులు

వేములవాడ: మహాశివరాత్రి వేడుకలకు రావాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. జగిత్యాల జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కలిసి ఆహ్వానపత్రికలు అందించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు ఆహ్వానపత్రికను ఆలయ పర్యవేక్షకులు హరినాథ్ అందజేశారు.

వీణవంకలో దొంగ రిజిస్ట్రేషన్ కలకలం

వీణవంక(హుజూరాబాద్): అమెరికాలో ఉన్న మహిళ పేరిట ఉన్న భూమిని ఆమెకు తెలియకుండా ఇతరులకు దొంగ రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. తహసీల్దార్ తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీణవంక శివారులో రెండు వేర్వేరు సర్వే నంబర్లలో రామిడి సుప్రియ పేరిట 22 గుంటల స్థలం ఉంది. ప్రస్తుతం సదరు మహిళ అమెరికాలో ఉంటోంది. మండలంలోని ధరణి మాజీ ఆపరేటర్ అరుణ్‌తోపాటు సుకాసి సురేశ్, నీల పూర్ణచందర్, మహ్మద్ అక్బర్‌లు కుమ్మక్కై ఆమె ఫొటోను తీసి, సంతకం ఫోర్జరీ చేశారు. తహసీల్దార్ విధుల్లో లేని సమయం చూసి సుకాసి సురేశ్‌కు పట్టా చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వెంటనే తహసీల్దార్ తిరుమల్‌రావు స్థానిక పోసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ధరణి ఆపరేటర్‌ను తొలగింపు

ఇటీవల తహసీల్దార్ తిరుమల్‌రావుకు తెలియకుండా గతంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్, ధరణి ఆపరేటర్ అరుణ్ కలిసి ఓ గ్రామానికి చెందిన కుటుంబానికి నిబంధనలకు విరుద్ధంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ అరుణ్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. డీటీని కలెక్టరేట్‌కు సరేండర్ చేశారు. దొంగ రిజిస్ట్రేషన్ విషయంలో ధరణి ఆపరేటర్‌పై మళ్లీ కేసు కలకలం రేపుతుంది.

విద్యుత్ షాక్‌తో గొర్ల కాపరి మృతి


కొమురయ్య(ఫైల్)


కొమురయ్య మృతదేహం

ఓదెల/జమ్మికుంట:: ఓదెల మండలం జీలకుంట గ్రామ శివారులో అబాది జమ్మికుంటకు చెందిన కొమ్ము కొమురయ్య (60) గొర్ల కాపరి విద్యుత్‌షాక్‌తో బుధవారం మృతి చెందాడు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ము కొమురయ్యతో పాటు మరో ముగ్గురు పదిరోజుల క్రితం గొర్లను మేత కోసం జీలకుంటకు తీసుకొచ్చారు. గొర్లు మేత మేస్తుండగా కొమురయ్య బహిర్భూమికి వెళ్లాడు. జిలకుంటకుచెందిన బంగారి కొమురయ్య తన పంటలను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు మొక్కజొన్న పంట చుట్టూ విద్యుత్ తీగ అమర్చాడు. బహిర్భూమికి వెళ్లిన కొమురయ్య పంటకు అమర్చిన విద్యుత్ వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సురేశ్, కూతురు ఉంది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ వైరు రైతుపై కేసు

జీలకుంట గ్రామశివారులో అడవి పందులు, జంతువుల బారి నుంచి పంటలు కాపాడేందుకు విద్యుత్ వైరు అమర్చిన రైతు బంగారి కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు

బోయినపల్లి(చొప్పదండి): అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఒకరిని కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. 2017 అక్టోబర్ 4న రత్నంపేటలో పెంచలయ్య ఇంట్లోకి బిచ్చు అనే వ్యక్తి అక్రమంగా ప్రవేశించి కర్రతో కొట్టాడు. తలకు గాయమైందని పెంచలయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, బిచ్చును కోర్టులో హాజరుపరిచారు. బిచ్చుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

కమిషనర్ కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ముందు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు కారును బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కమిషనర్ కారు వెనుకభాగం దెబ్బతింది. ఘటనపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

- గోడ కూలి ఇంటిపెద్ద అకాల మరణం
- తల్లికి మాటలు రావు.. చెవులు వినిపించవు
- దిక్కుతోచని స్థితిలో ఇద్దరు కూతుళ్లు
- దాతలు ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీకూతురు

కాల్వశ్రీరాంపూర్: పొట్ట చేతపట్టుకొని వలస వచ్చిన పేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. గోడ కూలి ఇంటి పెద్ద అకాల మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్లు దిక్కులేనివారయ్యారు. తండ్రి మృతితో చెవిటి, మూగ అయిన తల్లికి తమ కష్టసుఖాలు ఎలా చెప్పుకునేది అంటూ.. ఇద్దరు ఆడపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

15ఏళ్ల క్రితం వలస వచ్చి..

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన నిమ్మ రవి(35) 15ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం తమ బంధువుల ద్వారా కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామానికి వలస వచ్చాడు. అతడికి భార్య కోమల (చెవిటి, మూగ), ఇద్దరు ఆడపిల్లలు సాత్విక(ఇంటర్), శ్రావిత (9వతరగతి) ఉన్నారు. గుంట భూమి లేదు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. రవి వ్యవసాయ కూలీగా, ఐకేపీ వరిధాన్యం కొనుగోళ్ల సమయంలో హమాలీగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. అందరికీ తలలో నాలుకలా ఉండే రవి గత నెల 28న స్వగ్రామం కుందారంలో మల్లన్న దేవుడి బోనాల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు గోడకూలి మృత్యువాతపడ్డాడు. అనంతరం మృతదేహాన్ని బంధువులు మీర్జంపేటకు తీసుకొచ్చి గ్రామస్తుల సాయంతో అంత్యక్రియలు జరిపించారు. పెద్దకూతురు సాత్విక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని పుట్టెడు దుఃఖంతో కరీంనగర్‌లో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తోంది. చిన్న కూతురు శ్రావిత కస్తూరిబా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అన్నీ తానై చూసుకున్న ఇంటిపెద్ద అకాల మరణంతో తామెలా బతికేది, తమ చదువులెలా సాగేది అంటూ ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. తమ చదువుల కోసం దాతలు తోచిన సాయం అందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. ఇటీవల అదే గ్రామానికి చెందిన దంపతులు డాక్టర్ పచ్చిక శ్రీకాంత్‌రెడ్డి–డాక్టర్ ప్రశాంతి రూ.50వేలు ఆర్థికసాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన వారు
బ్యాంక్ అకౌంట్ నంబర్
62279304181
నిమ్మ కోమల
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీహెచ్‌వై0020388

క్లుప్తంగా

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫండస్ స్కూల్, భగత్‌నగర్ రోడ్ నెంబర్ 5 నుంచి 9 వరకు, 3ఏ, శ్రీచైతన్య జూనియర్ కళాశాల నుంచి బృందావన్ ఫంక్షన్ హాల్ వెనక ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 33/11 కేవీ ఉజ్వల పార్కు సబ్ స్టేషన్ ప్రాంతంలోని అల్కపురి, ఎన్టీఆర్ విగ్రహం, కోతిరాంపూర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, దోబివాడ, కట్టరాంపూర్, తిరుమల్‌నగర్, వినాయకనగర్, శ్రీనివాసనగర్, గౌతమినగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

మహిళల సంక్షేమానికి కేంద్రం పెద్దపీట



మాట్లాడుతున్న దుబాల శ్రీనివాస్

కరీంనగర్‌టౌన్: శక్తి వందన్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాని మోదీ ప్రసంగాన్ని మహిళలు వీక్షించారు. అనంతరం పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. వారి అభ్యున్నతి కోసం అనేక పథకాలను తీసుకువచ్చిందని తెలిపారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. శక్తి వందన్ ప్రోగ్రాం ద్వారా కేంద్రం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, కార్పొరేటర్ బండ సుమ, మహిళా నాయకులు మామిడి చైతన్య, సుధా వైష్ణవి, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలో ఒకరు డిబార్

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో బుధవారం వావిలాలపల్లిలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ఒకరు డిబారయినట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. జనరల్, ఒకేషనల్ విభాగాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా 15,858 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 480 మంది గైర్హాజరయ్యారు. 15,378 మంది హాజరయ్యారు.

దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్‌కు అభినందన



తిరుపతిని శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్‌రూరల్: ఇటీవల దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్‌గా ఎన్నికైన తోట తిరుపతి బుధవారం డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే గంగుల తోట తిరుపతిని శాలువాతో సన్మానించారు. మిఠాయిలు తినిపించారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రావు, వేణుమాధవరావు, సింగిల్‌విండో డైరెక్టర్లు గాజుల అంజయ్య, కుంభం అంజలి, బిజిలి పోషాలు, కందుల రమేశ్, వేల్పుల రాజు, శ్రీరామోజు తిరుపతి, గుండేటి కుమార్, ముత్తునూరి రాజ్‌కమల్, కుంభం శ్రీనివాస రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ కిసాన్‌నగర్‌కు చెందిన రంగు శంకరమ్మ ఇటీవల తన భర్తను కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతుండగా.. స్థానిక కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్‌తోపాటు కిసాన్‌నగర్ డివిజన్ ప్రజలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ.15వేలు బుధవారం రంగు శంకరమ్మకు అందజేశారు. సుల్తానా, వెంకటమ్మ, గాజా దేవయ్య, జమాన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి పూజలు

కరీంనగర్‌కల్చరల్: మాఘ బహుళ ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక తిరుమలనగర్‌లోని శ్రీనిలయంలో బుధవారం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అష్టాక్షరి మూల మంత్ర సహిత లక్ష్మీనారాయణ హోమాలు వైభవంగా జరిగాయి. మయూరగిరి పీఠాధిపతులు శ్రీమాన్ శ్రీనమిలకొండ రమణాచార్య స్వామి ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం భోగ శ్రీనివాస్, హనుమాన్ భక్త బృందాలచే 45సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రామకృష్ణమాచార్యులు, గీతాచార్యులు, శ్రీనాథాచార్యులు, రమేశ్‌స్వామి తదితరులున్నారు.



పూజలు చేస్తున్న అర్చకుడు

అమృతేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రేకుర్తి ద్వారకనగర్‌లోని శ్రీఅపర్ణఅమృతేశ్వర శివాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గణపతి గౌరి పూజ, శివ స్వస్తి పుణ్యహవాచనం, మండపారాధన, అమృతేశ్వరస్వామి ఫల, రస, పంచామృత అభిషేకం, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమం చేశారు. 8న సాయంత్రం 4.30 గంటలకు రుద్రాభిషేకం, రాత్రి 7.30 గంటలకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీఅపర్ణఅమృతేశ్వర కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. అర్ధరాత్రి 12 గంటలకు లిగోద్భవ కాలంలో నిశి పూజ, 9న ఉదయం 11 గంటలకు అన్నపూజ కార్యక్రమం చేయనున్నారు.

– కొత్తపల్లి



ఓటు హక్కుపై అవగాహన ముఖ్యం

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌అర్బన్: పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరూ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో మంచి పాలకులను ఎన్నుకునేలా తల్లిదండ్రులు, మిత్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. క్యూఆర్ కోడ్‌తో పోలింగ్ స్టేషన్లు గుర్తించొచ్చని, ఈ మేరకు అధికారులు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల విధానం తెలిసేలా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు వేసేలా చూడాలని సూచించారు. భవిష్యత్ ఓటర్లయిన విద్యార్థులకు సంకల్ప పత్రాలను అందజేశారు. జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, మెప్మా పీడీ రవీందర్, మైనింగ్ ఏడీ రామాచారి, కరీంనగర్ ఎంఈవో మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశాలలో ఏటీఎం ప్రారంభం



ఏటీఎం ప్రారంభించిన అపర్ణరెడ్డి

కొత్తపల్లి: రేకుర్తిలోని లయన్స్ క్లబ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను బుధవారం ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ డి.అపర్ణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, డిప్యూటీ మేనేజర్ బి.నారాయణ మిశ్రా, బ్రాంచ్ హెడ్ బి.భాస్కర్‌రావు, ఆసుపత్రి వైస్ చైర్మన్ చిదుర సురేష్, కోశాధికారి బొమ్మ పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు డా.టి.మురళీధర్‌రావు, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, క్లబ్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి బంగారం, వస్తువులు అందజేత



హర్కాల గోపీకృష్ణ(ఫైల్)

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం చింతకుంట శివారులోని ఎల్‌ఎండీలో గతేడాది డిసెంబర్ 3న గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభించగా.. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతుడి వివరాలు, ఫొటోలను పోలీస్ శాఖ దర్పన్ యాప్‌లో నమోదు చేయగా.. నాగోల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మ్యాన్ మిస్సింగ్ కేసుకు మృతుడి ఆనవాళ్లు సరిపోయాయి. మృతుడికి సంబంధించిన బట్టలు, వస్తువులు, బంగారు ఉంగరం బుధవారం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. జగిత్యాలకు చెందిన హర్కాల గోపీకృష్ణ(49) ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోని ఎకనామికల్ స్టాటికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా.. సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని గొల్లపూడికి కేటాయించబడినట్లు చెప్పారు. అయితే ఆంధ్ర రాష్ట్రానికి బదిలీ అయ్యాయనే బాధతో మనస్తాపం చెంది మానసికంగా ఇబ్బంది పడుతూ గతేడాది డిసెంబర్ 2న మానేరు డ్యాంలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై పేర్కొన్నారు.

కచ్చితమైన విధివిధానాలతో బీసీ కుల గణన చేపట్టాలి



మాట్లాడుతున్న రంగు సంపత్‌గౌడ్

విద్యానగర్(కరీంనగర్): కచ్చితమైన విధివిధానాలు ఖరారు చేసిన తరువాతే బీసీ కుల గణన చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీల ఓట్లు దండుకోవడానికే ఎలాంటి విధివిదానాలు రూపొందించకుండా బీసీ కుల గణన పేరుతో మభ్యపెట్టడానికి చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ కుల గణనకు సంబంధించిన విధివిధానాలు ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, రాష్ట్ర నార్త్ జోన్ మహిళ కన్వీనర్ జన్ను స్వరూప, జిల్లా ఇన్‌చార్జి మంద బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విద్యానగర్(కరీంనగర్): శ్రీరాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ 2024–2025 సంవత్సర నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శశికళ, కార్యదర్శిగా నరహరి లక్ష్మారెడ్డి, కోశాధికారిగా చందుపట్ల ఉమ ఎన్నికయ్యారు, ఎన్నికల అధికారిగా రాళ్లబండి శంకరప్రసాద్ వ్యవహరించగా.. ముఖ్య అతిథులుగా లక్ష్మయ్య, సంపత్ కుమారి హాజరయ్యారు. మాజీ అధ్యక్షురాలు సరళ, మాజీ కార్యదర్శి సంగీత తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

రంజాన్ మాసంలో వెసులుబాటు కల్పించడంపై హర్షం

సప్తగిరికాలనీ(కరీంనగర్): రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సమయపాలనలో ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంపై తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్ అలి హర్షం వ్యక్తం చేశారు. కార్యాలయాల నుంచి గంట ముందే వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 వరకు ఈ వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే కార్యాలయం నుంచి వెళ్లొచ్చని పేర్కొన్నారు.

రైతు వేదికల్లో వీసీ యూనిట్లు ప్రారంభం

కరీంనగర్‌అర్బన్: రైతులకు ఆధునిక పరిజ్ఞానం, రైతు ముంగిట్లో సాంకేతికతకు రాష్ట్ర ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ప్రారంభించిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. తొలి దశలో జిల్లాలో 4 రైతు వేదికలను ఎంపిక చేశారని, తిమ్మాపూర్, కొత్తపల్లి, గంగాధర, హుజూరాబాద్ రైతు వేదికల్లో వీసీ పరికరాలను ఏర్పాటు చేశామని ప్రకటనలో వివరించారు. జిల్లాలో 76 వేదికలకు గాను 4 వేదికల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని, బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారని వివరించారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

మానకొండూర్: ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌కు ఎలాంటి ఫీజులు వసూలు చేయమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీరామకృష్ణారావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌పై చేపట్టిన నిరసనలో భాగంగా మండల కేంద్రంలో నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జీవీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనె రూ. మూడువేల కోట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

తిమ్మాపూర్: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని బుధవారం వచ్చునూర్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు కనకం అంజిబాబు మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి తుంగ అంజనేయులు మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వచ్చునూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి మధు మాదిగ, ఉపాధ్యక్షుడిగా బి.సంపత్‌కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మాతంగి రమేశ్ మాదిగ ఎన్నికయ్యారు. అంజిబాబు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చేరువలో ఉన్నామన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి

- కరీంనగర్ ఏడీఏ రణధీర్‌రెడ్డి



కొత్తపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కొత్తపల్లి(కరీంనగర్): వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించినట్లు కరీంనగర్ ఏడీఏ రణధీర్‌రెడ్డి తెలిపారు. కొత్తపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను అనుసంధానం చేసే కార్యక్రమాన్ని బుధవారం సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా.. దృశ్య శ్రవణం ద్వారా సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు నేస్తం కార్యక్రమం గురించి వివరించారు. రైతులకు నూతన సాంకేతిక వ్యవసాయంపై అవగాహన కల్పించి వ్యవసాయ ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన రైతు వేదికలో ప్రతి మంగళ, శుక్రవారం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రైతులతో ముఖాముఖి కార్యక్రమంతోపాటు విషయ నిపుణులు, ప్రగతిశీల రైతులు నేరుగా ఆన్‌లైన్ వేదికగా శిక్షణ పొందొచ్చని చెప్పారు. రైతు వేదికలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య పరస్పర విషయ మార్పిడి చేసుకోవడంతోపాటు తక్షణ పరిష్కారం పొందడానికి ఈ ఆన్‌లైన్ శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. రైతులకు లాభసాటి వ్యవసాయాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కార్యాలయం ఏడీఏ అంజలి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమళ్ల శ్రీనివాస్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్, అర్బన్ ఏవోలు రంజిత్, సత్యం, హరిత, ఏఈవోలు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న యువతి

మానకొండూర్: ప్రజాహిత యాత్రలో భాగంగా మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో ఎంపీ బండి సంజయ్ బుధవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎన్ఆర్ఎస్ శాస్త్రవేత్తలు

సైదాపూర్: గొడిశాలలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ పనులను బుధవారం నేషనల్ రిమోట్ సెన్సింగ్(ఎన్ఆర్ఎస్) శాస్త్రవేత్తలు జ్యోషి, అనిల్‌కుమార్ పరిశీలించారు. పాంపాండ్స్, భూగర్భ జలాల పెంపు, ఫీడర్ చానల్స్, వ్యవసాయసాగు పెరుగుదల, హరితహారం, హార్టికల్చర్, పండ్లతోటలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, తదితర పనులను పరిశీలించారు. సీఆర్‌డీ ప్రతినిధులు అభయ్‌కుమార్, ఎంపీడీవో యాదగిరి, ఏపీవో రాణి, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

రూ.5లక్షల జరిమానా

కరీంనగర్‌అర్బన్: పల్లె ప్రకృతి వనాలను తొలగించిన సిరిసేడు మాజీ ఎంపీటీసీ రేణికుంట చిన్నరాయుడుకు రూ.5లక్షల జరిమానా విధించారు. ఇల్లందకుంట మండలం బోగంపాడు, సిరిసేడు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను తొలగించిన విషయం తెలిసిందే. వాల్టా చట్ట ప్రకారం కలెక్టర్ రూ.5లక్షలు జరిమానా విధించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ తెలిపారు. జరిమానా చెల్లించకుంటే ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కొత్త వినీత

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలంలోని పీచుపల్లి, చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లో రూ.48 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఎంపీపీ కొత్త వినీత ప్రారంభించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వెంట పంచాయతీరాజ్ డీఈ రవిప్రసాద్, ఎంపీడీవో బాసం మధుసూదన్, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, తదితరులున్నారు.

ఎస్సైల బదిలీలు..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడినట్టు సమాచారం. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో పోలీస్‌శాఖలో అన్నిస్థాయిల అధికారులు బదిలీలు జరుగుతున్నట్టు తెలిసింది.

ఆలయ భూములను రక్షించుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- నల్లగొండ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- నూతన చైర్మన్‌గా బండారిపల్లి లక్ష్మణ్



చైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్

తిమ్మాపూర్: ఆలయ భూములను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీసీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బండారిపల్లి లక్ష్మణ్, డైరెక్టర్లు గాజుల అంజయ్య, భూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మీరాజం, జినుక శ్రీనివాస్, కవ్వంపల్లి మహేశ్, గోలి లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, ఆలయ భూములు కబ్జాకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నూతన చైర్మన్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యుడికి సైతం పదవులు లభిస్తాయని అన్నారు. గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తూ పేదలకు సేవలు అందిస్తున్న తనను నల్లగొండ ఆలయ చైర్మన్‌గా నియమించడం అదృష్టంగా భావిస్తున్నాను అని, నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉడితల వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షుడు మార్క నర్సయ్య, మండల అధ్యక్షుడు నాయకులు దన్నమనేని సురేందర్ రావు, మాజీ చైర్మన్ శ్రీనివాస్ రావు, ఎంపీటీసీ బండారి రమేశ్, నాయకులు ఎస్ఎల్ గౌడ్, కొండయ్య, సంపత్, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన వలంటీర్లు



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మానకొండూర్: మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాల్లో వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... యువత మంచి కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని, వలంటీర్లు లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్లు చైతన్య, సతీష్, వేణు, చారి, శిరీషా, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్



నిశాంత్ ముందుకు... శివ, అంకుశిత ఓటమి

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల విభాగంలో నిశాంత్ దేవ్ (71 కేజీలు) రెండో రౌండ్‌కు చేరగా... శివ థాపా (63.5 కేజీలు), మహిళల విభాగంలో అంకుశిత (66 కేజీలు) తొలి రౌండ్‌లోనే ఓడారు. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో నిశాంత్ 3-1తో లూయిస్ రిచర్డ్‌సన్ (బ్రిటన్)పై గెలిచాడు. ప్రపంచ చాంపియన్ రుస్లాన్ (ఉజ్బెకిస్తాన్) పంచ్‌ల ధాటికి శివ బౌట్ ఆరంభంలోనే చేతులెత్తేశాడు. అంకుశిత 2-3తో సాన్‌వికో ఎమిలీ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్



ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. కాలిఫోర్నియాలో బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్‌లో సుమిత్ 6-2, 2-6, 6-7 (4/7)తో సియోంగ్‌చన్ హాంగ్ (కొరియా) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 21 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక టైబ్రేక్‌లో సుమిత్ తడబడి మూల్యం చెల్లించుకున్నాడు. సుమిత్‌కు 14,400 డాలర్ల (రూ. 11 లక్షల 93 వేలు) ప్రైజ్‌మనీ, 10 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

గట్టెక్కిన సింధు

ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ • ప్రణయ్ ఓటమి



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 80 నిమిషాల్లో 20-22, 22-20, 21-19తో మిచెల్లి లీ (కెనడా)పై కష్టపడి గెలిచింది. తొలి గేమ్ కోల్పోయి, రెండో గేమ్‌లో 7-14తో వెనుకబడిన సింధు నెమ్మదిగా పుంజుకుంది. స్కోరు 15-18 వద్ద సింధు వరుసగా ఐదు పాయింట్లు గెలిచి 20-18తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్కోరు 20-20తో సమమైనా... కీలకదశలో సింధు రాణించి రెండు పాయింట్లు నెగ్గి 22-20తో గేమ్‌ను దక్కించుకుంది. నిర్ణాయక మూడో గేమ్ కూడా హోరాహోరీగా సాగినా కీలక తరుణంలో సింధు పైచేయి సాధించింది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-15, 20-22, 21-8తో చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... ప్రణయ్ 17-21, 17-21తో లు గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓటమి చవిచూశాడు.

రాజా రిత్విక్‌కు కాంస్యం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ కాంస్య పతకం సాధించాడు. నాసిక్‌లో బుధవారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత రిత్విక్ 8.5 పాయింట్లతో మరో ఏడుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... ఆరోణ్యక్ ఘోష్ (రైల్వేస్)కు రెండో ర్యాంక్, రిత్విక్‌కు మూడో ర్యాంక్ దక్కాయి. 9 పాయింట్లతో దీప్తాయన్ ఘోష్ (రైల్వేస్) విజేతగా నిలిచాడు. రిత్విక్ ఆడిన 11 గేముల్లో ఏడింటిలో గెలిచి, మూడింటిని 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. కాంస్యం నెగ్గిన రిత్విక్‌ను తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ అభినందించారు. ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్తీక్ వెంకటరామన్, నూతక్కి ప్రియాంక 13వ, 14వ ర్యాంక్‌ల్లో నిలిచారు.



4-1 వేటలో...

ఘనమైన ముగింపుపై భారత్ దృష్టి

నేటి నుంచి ఇంగ్లండ్‌తో ఐదో టెస్టు

ఉదయం గం.9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం



ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ | భారత్ కెప్టెన్ రోహిత్

ధర్మశాల: భారత గడ్డపై ఇంగ్లండ్ ఆడిన గత రెండు టెస్టు సిరీస్‌లను టీమిండియా 4-0తో, 3-1తో గెలుచుకుంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే 3-1తో పైచేయి సాధించింది. ఈ నేపథ్యంలో సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టుకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఆఖరి సమరంలో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తున్న భారత్ సిరీస్‌ను 4-1తో ముగిస్తుందా లేక తాము నమ్ముకున్న 'బజ్‌బాల్'తో ఇంగ్లండ్ రెండో విజయాన్ని అందుకుంటుందా అనేది ఆసక్తికరం.

భారత జట్టు హైదరాబాద్‌లో తొలి టెస్టును కోల్పోయిన తీరు చూస్తే నాలుగో టెస్టు ముగిసే సరికి మన జట్టు సిరీస్ గెలుచుకోగలదని ఎవరూ ఊహించలేదు. తర్వాతి మూడు టెస్టుల్లోనూ ఇంగ్లండ్ మెరుగ్గానే ఆడినా, వెనుకబడిన ప్రతీసారి కోలుకుంటూ టీమిండియా వరుస విజయాలు అందుకుంది. ఇప్పుడు సిరీస్ సొంతం కావడంతో చివరి మ్యాచ్‌నూ గెలిచి ఘనంగా ముగించాలని రోహిత్ బృందం భావిస్తుండగా... సిరీస్ ఓడినా మరో మ్యాచ్ గెలిచి అంతరాన్ని 2-3కు తగ్గిస్తూ స్వదేశం వెళ్లాలని స్టోక్స్ జట్టు పట్టుదలగా ఉంది.

బుమ్రా వచ్చేశాడు

సిరీస్ గెలుచుకున్న ఉత్సాహంతో భారత శిబిరంలో ప్రస్తుతం ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. ఆటగాళ్లంతా మరోసారి సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఓపెనర్లు రోహిత్, యశస్విలతో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. సిరీస్‌లో ఇప్పటికే 655 పరుగులు చేసిన యశస్వి జైస్వాల్‌ను నిలువరించడం ఇంగ్లండ్ వల్ల కావడం లేదు. ఒక్క రజత్ పటిదార్ మాత్రమే ఇప్పటి వరకు విఫలమయ్యాడు. 6 ఇన్నింగ్స్‌లలో కలిపి 63 పరుగులే చేసినా... అతనికి మరో మ్యాచ్‌లో అవకాశం దక్కుతోంది. గత టెస్టులో విఫలమైన సర్ఫరాజ్ ఈసారి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. కీపర్ ధ్రువ్ జురేల్ రాంచీ టెస్టుతోనే తానేంటో చూపించగా... జడేజా, అశ్విన్ ఫామ్‌లో ఉన్నారు. ముఖ్యంగా తన 100వ టెస్టు ఆడనున్న అశ్విన్ ఈ మ్యాచ్‌ను మరింత ప్రత్యేకంగా మార్చుకోవాలని భావిస్తున్నాడు. నాలుగో టెస్టుకు దూరంగా ఉన్న బుమ్రా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగుతుండటంతో మన పేస్ మరింత పటిష్టంగా మారింది. సిరాజ్‌తో పాటు గత మ్యాచ్‌లో రాణించిన ఆకాశ్‌దీప్‌కు మూడో పేసర్‌గా అవకాశం ఇస్తారా లేక మూడో స్పిన్నర్‌గా కుల్దీప్‌ను ఎంచుకుంటారా అనేది మ్యాచ్ రోజే తేలుతుంది.

రాబిన్సన్ స్థానంలో వుడ్

ఇంగ్లండ్ తుది జట్టులో ఒకే ఒక మార్పు చోటు చేసుకుంది. బౌలింగ్‌లో పెద్దగా ఆకట్టుకోకపోవడంతో పాటు వెన్నునొప్పితో ఇబ్బంది పడుతున్న రాబిన్సన్ స్థానంలో మార్క్ వుడ్‌కు ఇంగ్లండ్ చోటు కల్పించింది. తన 187వ టెస్టు బరిలోకి దిగేందుకు సిద్ధమైన సీనియర్ అండర్సన్ 700 వికెట్ల మైలురాయికి మరో రెండు వికెట్ల దూరంలో మాత్రమే ఉన్నాడు. పరిస్థితులు ఎలా ఉన్నా ఇంగ్లండ్ ఇద్దరు స్పిన్నర్లు హార్ట్‌లీ, బషీర్‌లను ఎంచుకుంది. అయితే బ్యాటింగే ఆ జట్టును ఇబ్బంది పెడుతోంది. ప్రతీ ఒక్కరు సిరీస్‌లో ఒక్కో సమయంలో రాణించినా సమష్టిగా ఆడకపోవడం వరుస ఓటములకు కారణమైంది. ఓపెనర్లు క్రాలీ, బెన్ డకెట్‌లతో పాటు పోప్ రాణించాల్సి ఉంది. జో రూట్ ఫామ్‌లోకి రావడం సానుకూలాంశం కాగా కెప్టెన్ బెన్ స్టోక్స్ తన స్థాయికి తగినట్లుగా ఒక్క ఇన్నింగ్స్ కూడా ఆడలేదు. సిరీస్‌లో ఇప్పటి వరకు విఫలమవుతూనే ఉన్న బెయిర్‌స్టో తన 100వ టెస్టులోనైనా ఆకట్టుకుంటాడా లేదా వేచి చూడాలి.

1 ధర్మశాల స్టేడియంలో ఇప్పటి వరకు ఒకే ఒక టెస్టు జరిగింది. 2017లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో భారత్ 8 వికెట్ల తేడాతో గెలిచింది.

పిచ్, వాతావరణం

ధర్మశాలలో చల్లటి వాతావరణం, పిచ్ సీమ్ బౌలింగ్‌కు అనుకూలంగా కనిపిస్తున్నాయి. అయితే దాని ప్రభావం కొద్ది సేపే ఉండవచ్చు. పచ్చిక దాదాపుగా తొలగించడంతో బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా కనిపిస్తోంది.

గుజరాత్ బోణీ

అదరగొట్టిన బెత్ మూనీ, లౌరా



బెత్ మూనీ



లౌరా

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఎట్టకేలకు గుజరాత్ జెయింట్స్ జట్టు ఖాతాలో తొలి విజయం చేరింది. వరుసగా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయిన గుజరాత్ ఐదో మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 19 పరుగుల తేడాతో నెగ్గింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు సాధించింది. ఓపెనర్లు లౌరా వొల్వార్ట్ (45 బంతుల్లో 76; 13 ఫోర్లు), కెప్టెన్ బెత్ మూనీ (51 బంతుల్లో 86 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 13 ఓవర్లలో 140 పరుగులు జోడించారు. లౌరా అవుటయ్యాక వచ్చిన ఫోబీ లిచ్‌ఫీల్డ్ (18; 1 ఫోర్), యాష్లీ గార్డ్‌నర్ (0), హేమలత (1), వేద కృష్ణమూర్తి (1) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అనంతరం 200 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసి ఓడిపోయింది. స్మృతి మంధాన (24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎలీస్ పెరీ (24; 3 ఫోర్లు), సోఫీ డివైన్ (23; 1 ఫోర్, 2 సిక్స్‌లు), రిచా ఘోష్ (30; 5 ఫోర్లు, 1 సిక్స్), జార్జియా వేర్‌హమ్ (48; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించినా ఫలితం లేకపోయింది. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

ఫైనల్లో విదర్భ

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో రెండుసార్లు చాంపియన్ విదర్భ జట్టు మూడోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. మధ్యప్రదేశ్‌తో బుధవారం ముగిసిన రెండో సెమీఫైనల్లో విదర్భ 62 పరుగుల తేడాతో విజయం సాధించింది. 321 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 81.3 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఈనెల 10 నుంచి జరిగే ఫైనల్లో ముంబైతో విదర్భ తలపడుతుంది. ఓవర్‌నైట్ స్కోరు 228/6తో మ్యాచ్ చివరిరోజు బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ మరో 30 పరుగులు జోడించి మిగతా 3 వికెట్లు కోల్పోయింది.

సహజ శుభారంభం

నాగ్‌పూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో సహజ 3-6, 6-1, 6-1తో భారత్‌కే చెందిన వైదేహి చౌదరీని ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

న్యూజిలాండ్‌తో భారత్ తొలి పోరు



లుసానె (స్విట్జర్లాండ్): పారిస్ ఒలింపిక్స్ పురుషుల హాకీ ఈవెంట్ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. పూల్ 'బి'లో ఉన్న భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను జూలై 27న న్యూజిలాండ్‌తో ఆడుతుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 9 గంటలకు మొదలవుతుంది. గత టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన భారత జట్టు తమ రెండో మ్యాచ్‌ను జూలై 29న అర్జెంటీనాతో (సాయంత్రం గం. 4:15 నుంచి)... మూడో మ్యాచ్‌ను జూలై 30న ఐర్లాండ్‌తో (సాయంత్రం గం. 4:45 నుంచి)... నాలుగో మ్యాచ్‌ను ఆగస్టు 1న బెల్జియంతో (మధ్యాహ్నం గం. 1:30 నుంచి)... ఐదో మ్యాచ్‌ను ఆగస్టు 2న ఆస్ట్రేలియాతో (సాయంత్రం గం. 4:45 నుంచి) ఆడుతుంది.

సినిమా

డ్యాన్సింగ్ టైమ్

ఓ హీరో చెల్లెళ్లు, ప్రేయసితో కలిసి ఆడి పాడుతున్నారు. మరో హీరో ఏమో హీరోయిన్‌తో ప్రేమ పాటకు స్టెప్పులేస్తున్నారు. ఇంకో హీరో మాస్ నంబర్‌కు హుషార్‌గా కాలు కదుపుతున్నారు. 'ఇట్స్ డ్యాన్సింగ్ టైమ్' అంటూ ఆ హీరోలు చేస్తున్న పాటల గురించి తెలుసుకుందాం.



• చిరంజీవి



• ప్రభాస్



• అల్లు అర్జున్

ఫ్యామిలీ సాంగ్

ఆనందోత్సాహలతో ఫ్యామిలీ పాట పాడుతున్నాడట 'విశ్వంభర'. చెల్లెళ్లు, ప్రేయసితో కలిసి హాయిగా డ్యాన్స్ చేస్తున్నాడట. ఈ ఫ్యామిలీ సెలబ్రేషన్ సాంగ్‌కు కారణమైన హ్యాపీ మూమెంట్స్ ఏంటో 'విశ్వంభర' సినిమాలో చూడాలి. చిరంజీవి హీరోగా నటిస్తున్న చిత్రం ఇది. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. 'స్టాలిన్' తర్వాత అంటే దాదాపు 18 ఏళ్ల తర్వాత 'విశ్వంభర' కోసం చిరంజీవితో జోడీ కట్టారు త్రిష. ఈ సినిమాలో చిరంజీవి పాత్ర భీమవరం దొరబాబు అని, కథ రీత్యా దొరబాబుకు ఐదుగురు చెల్లెళ్లు ఉంటారనే ప్రచారం సాగుతోంది. చిరంజీవి చెల్లెళ్లుగా మీనాక్షీ చౌదరి, మృణాల్ ఠాకూర్, ఆషికా రంగనాథ్, ఇషా చావ్లా, సురభి కనిపిస్తారని భోగట్టా. కాగా 'విశ్వంభర' తాజా షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముందుగా కొంత టాకీ పార్ట్ చిత్రీకరించారు. ఇటీవల ఫ్యామిలీ సాంగ్ చిత్రీకరణ ఆరంభించారని తెలిసింది. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ అడ్వెంచరస్ ఫ్యాంటసీ ఫిల్మ్ వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి స్వరకర్త. ఈ సంగతి ఇలా ఉంచితే... 'హిట్లర్' (1997) సినిమాలో హీరో చిరంజీవికి ఐదుగురు చెల్లెళ్లు. ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇన్నేళ్లకు చిరంజీవి మళ్లీ ఐదుగురు చెల్లెళ్లతో 'విశ్వంభర' చేస్తున్నారు.

రొమాంటిక్ కల్కి


ఇటలీ బీచ్‌లో ప్రేమ పాట పాడుతున్నారు ప్రభాస్. ఈ రొమాంటిక్ పాట 'కల్కి 2898 ఏడీ' సినిమా కోసం. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న మైథాలజీ అండ్ ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ ఇది. ఇందులో దీపికా పదుకోన్, దిశా పటానీ హీరోయిన్లుగా నటిస్తుండగా, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలక పాత్రధారులు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ ఇటలీలో ప్రారంభమైంది. ప్రభాస్, దిశా పటానీల మధ్య కొన్ని రొమాంటిక్ సీన్స్‌తో పాటు ఓ మెలోడీ లవ్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ షెడ్యూల్‌తో 'కల్కి 2898ఏడీ' సినిమా మేజర్ చిత్రీకరణ పూర్తవుతుందని తెలిసింది. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కానుంది.

పుష్పరాజ్ పాట

మంచి ఫైర్ మీద ఉన్నాడు పుష్పరాజ్. తన సత్తా ఏంటో పాట రూపంలో మరోసారి చెబుతున్నాడు. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లోని 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలో 'ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా' అంటూ ఓ మాస్ సాంగ్ ఉంటుంది. ఈ తరహా సాంగ్ 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'లోనూ ఉందట. ప్రస్తుతం ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో చిత్రీకరిస్తున్నారని తెలిసింది. ఈ పాటకు ప్రేమ్‌రక్షిత్ కొరియోగ్రఫీ చేస్తున్నారట. పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్ నటిస్తున్నారు. తొలి భాగంలో శ్రీవల్లి పాత్రలో ప్రేయసిగా నటించిన హీరోయిన్ రష్మికా మందన్నా మలి భాగంలో భార్యగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ఇలా ప్రస్తుతం సెట్స్‌లో పాటల చిత్రీకరణ జరుపుకుంటున్న మరికొన్ని సినిమాలు ఉన్నాయి.

ట్రిపుల్ ధమాకా



• శర్వానంద్

హీరో శర్వానంద్ బర్త్ డే (మార్చి 6) సందర్భంగా మూడు చిత్రాల అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రానికి 'మనమే' అనే టైటిల్ ఖరారు చేయగా, 36వ సినిమా బుధవారం ప్రారంభమైంది. అలాగే శర్వా నటించనున్న 37వ సినిమా ప్రకటన కూడా వెల్లడైంది. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రానికి 'మనమే' టైటిల్ ఖరారు చేసి, గ్లింప్స్ విడుదల చేశారు. అలాగే శర్వానంద్ 36వ సినిమా ఆరంభమైంది. అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్. విక్రమ్ సమర్పణలో వంశీ-ప్రమోద్ నిర్మిస్తున్నారు. శర్వా 37వ సినిమాని రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఇక శర్వానంద్ వ్యక్తిగత జీవితం విషయానికొస్తే గత ఏడాది రక్షితను వివాహం చేసుకున్నారు. ఇటీవల పాపకు జన్మనిచ్చారు రక్షిత. పాపకు లీలాదేవి అని నామకరణం చేసినట్లు బుధవారం వెల్లడించారు.

నవ్వితే చాలు.. బాలకృష్ణకు కోపం వస్తుంది

- దర్శకుడు కేఎస్ రవికుమార్

''తెలుగులో బాలకృష్ణతో సినిమాలు చేశాను. ఎవరైనా బాలకృష్ణని చూసి నవ్వితే చాలు. ఆయనకు చాలా కోపం వచ్చేస్తుంది'' అంటూ చెన్నైలో జరిగిన తమిళ చిత్రం 'గార్డియన్' ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు కేఎస్ రవికుమార్ అనడం వైరల్‌గా మారింది. బాలకృష్ణతో వరుసగా 'జైసింహా' (2018), 'రూలర్' (2019) చిత్రాలకు దర్శకత్వం వహించారు కేఎస్ రవికుమార్. ఆ చిత్రాల షూటింగ్ లొకేషన్‌లో జరిగిన సంఘటనలనే 'గార్డియన్' వేదికపై పంచుకున్నట్లున్నారు. ఇంకా ఆ ప్రీ రిలీజ్ వేడుకలో మాట్లాడుతూ– ''ఒకరోజు లొకేషన్‌లో ఒక వ్యక్తి నవ్వితే.. 'ఎందుకు నవ్వుతున్నావ్... రేయ్ ఎందుకురా నవ్వావ్.. నన్ను చూసి ఎందుకు నవ్వావ్' అని బాలకృష్ణ కొట్టడానికి ముందుకు వెళ్లినట్లుగా చేతులతో చూపించారు కేఎస్ రవికుమార్. ఇంకా మాట్లాడుతూ– ''ఇంకోసారి నా అసిస్టెంట్‌ని 'ఆ ఫ్యాన్‌ని ఇలా తిప్పు' అంటే.. అతను ఫ్యాన్ తిప్పాడు. ఆ గాలికి బాలకృష్ణ విగ్ కాస్త చెదిరినట్లయితే అతను నవ్వాడు. 'ఏయ్ ఎందుకు నవ్వుతున్నావ్' అని బాలకృష్ణ అడుగుతుంటే అసలే తను నా అసిస్టెంట్.. ఎక్కడ కొట్టేస్తారేమోనని, 'సార్ సార్.. అతను మన అసిస్టెంట్ డైరెక్టర్ శరవణన్ సార్..' అన్నాను. 'లేదు లేదు.. ఆపోజిట్ గ్యాంగ్.. ఆపోజిట్ గ్యాంగ్.. చూడు ఇప్పుడు కూడా నవ్వుతున్నాడు' అని ఆయన అన్నారు. ఇక అప్పుడు 'రేయ్.. వెళ్లరా ఇక్కణ్నుంచి' అని అతన్ని పంపించేశాను'' అని కూడా చెప్పారు రవికుమార్.

ఎమోషన్.. ఎలివేషన్.. ఎంటర్‌టైన్‌మెంట్



• హర్ష

''సినిమాలో ఏ మాత్రం ల్యాగ్ ఉన్నా సరే థియేటర్స్‌లో ఆడియన్స్ మొబైల్ ఫోన్స్ చూస్తున్నారు. సో... ఆడియన్స్‌ను ఎంగేజ్ చేయాలంటే మంచి స్క్రీన్ ప్లే ఉండాలి. 'భీమా'లో గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే ఉంది. ఎలివేషన్.. ఎమోషన్.. ఎంటర్‌టైన్‌మెంట్‌లతో ఈ సినిమా ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. సెమీ ఫ్యాంటసీ ఎలిమెంట్స్‌తో 'భీమా' చిత్రంలో ఓ సామాజిక సందేశం కూడా ఉంది'' అన్నారు దర్శకుడు ఎ. హర్ష. గోపీచంద్ హీరోగా ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'భీమా'. ఈ నెల 8న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో ఎ.హర్ష మాట్లాడుతూ– ''కరోనా సెకండ్ వేవ్ సమయంలో 'భీమా' చిత్రం సహనిర్మాత శ్రీధర్‌గారు ఓ కథ ఉంటే చెప్పమన్నారు. ఆన్‌లైన్‌లో గోపీచంద్‌గారికి 'భీమా' స్టోరీలైన్ చెప్పాను. ఆ తర్వాత ఫుల్ స్టోరీ చెప్పాను. ఆయనకు నచ్చింది. చిన్న మార్పులు సూచించారు. ఆ తర్వాత సెట్స్‌పైకి వెళ్లాం. గోపీచంద్‌గారు అద్భుతమైన నటుడు. ఆయన చేసిన 'భీమా' పాత్రను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు. రాధామోహన్‌గారు నిర్మించిన 'బెంగాల్ టైగర్'కు కొరియోగ్రాఫర్‌గా చేశాను. ఇప్పుడు ఆయన నిర్మించిన సినిమాకు దర్శకత్వం వహించడం హ్యాపీ'' అన్నారు.

యాక్షన్ ఎంటర్‌టైనర్

విజయ్ శంకర్, మహేశ్ యడ్లపల్లి, ఆయూషి పటేల్, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో 'విశాలాక్షి' మూవీ ఆరంభమైంది. పవన్ శంకర్ దర్శకత్వంలో కేతిక హన్మయశ్రీ సమర్పణలో పల్లపు ఉదయ్ కుమార్ నిర్మిస్తున్నారు. దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ ఇచ్చారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ దర్శకత్వం వహించారు. ''పరిశోధన నేపథ్యంలో సాగే యాక్షన్ మూవీ ఇది'' అన్నారు పవన్ శంకర్. ''స్టింగ్ ఆపరేషన్, ఇన్వెస్టిగేషన్, ఎమోషనల్ అంశాలతో ఈ మూవీ సాగుతుంది'' అన్నారు పల్లపు ఉదయ్ కుమార్.



• అనుశ్రీ, మహేశ్, విజయ్, ఆయుషి

బుల్లెట్ వస్తోంది



• రవి వర్మ, ఏయం రత్నం

రవి వర్మ, సంజనా సింగ్, అలోక్ జైన్, మనీషా దేవ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించారు. బండి సదానంద్- మెమరీ మేకర్స్ సోమిశెట్టి హరికృష్ణ సమర్పణలో ఎంసీ రావు, జి.గోపాల్, ఎమ్.వ. మల్లిఖార్జునరావు, కోసూరి సుబ్రహ్మణ్యం, మణి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'బుల్లెట్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నిర్మాత ఏయం రత్నం, దర్శకుడు వి. సముద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''ఈ సినిమా విజయం సాధించి టీమ్‌కి మంచి పేరు తీసుకురావాలి'' అన్నారు ఏయం రత్నం, వి.సముద్ర. ''ఇదొక యాక్షన్ మూవీ'' అన్నారు చౌడప్ప. ''హీరోగా అవకాశం ఇచ్చిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు రవి వర్మ.

రామ్‌చరణ్‌కి జోడీగా..



• 'దేవర'లో జాన్వీ

హీరో రామ్‌చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ ఫిక్స్ అయ్యారు. బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్‌పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు. బుధవారం (మార్చి 6) జాన్వీ కపూర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రంలో రామ్‌చరణ్‌కి జంటగా జాన్వీ కపూర్ నటించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''ఆర్‌సీ 16' కోసం బుచ్చిబాబు యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు'' అన్నారు మేకర్స్. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ 'దేవర' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ, కల్యాణ్ రామ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు.

వేసవిలో ధూం ధాం



• చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

హెబ్బా పటేల్, చేతన్ కృష్ణ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికుమార్, 'వెన్నెల' కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి కిశోర్ మచ్చ దర్శకత్వంలో ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. పెళ్లి బారాత్‌లో హీరో, హీరోయిన్ జోరుగా డ్యాన్స్ చేస్తున్న 'ధూం ధాం' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు సాయి కిశోర్. ఈ మూవీకి గోపీ మోహన్ కథ, స్క్రీన్ ప్లే అందించారు. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్.

సాక్షి బిజినెస్
గురువారం
7-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	409	74,086
నిఫ్టీ ▲	118	22,474

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,217	▲	188
డోజోన్స్	38,811	▲	225
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,679	▲	33
డాక్స్	17,717	▲	18
షాంఘై	3,040	▼	8
నికాయ్	40,091	▼	7

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
64,493	▼	105
బంగారం (99.5 స్వచ్ఛత)		
64,339	▼	104
వెండి (కేజీ)		
72,244	▼	534

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ రూపాయి	80.99	84.67
£	బ్రిటన్ పౌండ్	భారతీయ రూపాయి	102.95	107.86
€	యూరో	భారతీయ రూపాయి	87.87	92.33
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ రూపాయి	42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ రూపాయి	54.64	56.48
S$	సింగపూర్ డాలర్	భారతీయ రూపాయి	59.44	64.12
SAR	సౌదీ రియాల్	భారతీయ రూపాయి	21.18	22.75
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ రూపాయి	21.65	23.45
¥	చైనా యువాన్	భారతీయ రూపాయి	10.38	12.46

బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్రకటనలకు దూరంగా ఉండండి

సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లకు సీసీపీఏ సూచన

న్యూఢిల్లీ: బెట్టింగ్, గ్యాంబ్లింగ్ సంబంధిత ప్రకటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో అటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రమోట్ చేయడానికి దూరంగా ఉండాలని సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ సంస్థ సీసీపీఏ సూచించింది. అలాంటి కార్యకలాపాలను ప్రమోట్ చేస్తే కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు అడ్వైజరీని జారీ చేసింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల ప్రకటనలు, ప్రమోషన్



మొదలైనవి వివిధ చట్టాల కింద నిషిద్ధమని సీసీపీఏ పేర్కొంది. 'పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ 1867 ప్రకారం బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌పై నిషేధం ఉంది. దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో వీటిని చట్టవిరుద్ధంగా పరిగణిస్తారు. అయినప్పటికీ గేమింగ్ ముసుగులో పలు ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, యాప్‌లు నేరుగా బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్రకటనలు ఇస్తున్నాయి' అని సీసీపీఏ తెలిపింది. ఇలాంటి కార్యకలాపాలను బలపర్చడమనేది ఆర్థికంగా, సామాజికంగా, ముఖ్యంగా యువతపై, తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపుతుందని పేర్కొంది. వాటికి సంబంధించిన మార్గదర్శకాలు అన్ని మాధ్యమాలకు వర్తిస్తాయని సీసీపీఏ తెలిపింది. చట్టవిరుద్ధమైన వాటిని ఏ రకంగా ప్రమోట్ చేసినా ఆయా కార్యకలాపాల్లో పాల్గొన్న వారితో సమానంగా చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందని సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లను హెచ్చరించింది.

రుణ జారీలో లోపాలు లేవు

జేఎం ఫైనాన్షియల్ వివరణ

న్యూఢిల్లీ: అప్రమత్తతతో కూలంకషంగా చేపట్టిన సమీక్ష ప్రకారం రుణ విడుదల విధానంలో లోపాలు కనిపించలేదని జేఎం ఫైనాన్షియల్ తాజాగా పేర్కొంది. కంపెనీ ఫైనాన్సింగ్ బిజినెస్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన నేపథ్యంలో తాజా వివరణకు తెరతీసింది. షేర్లు, డిబెంచర్లపై రుణాలు జారీ చేయవద్దంటూ ఆర్‌బీఐ మంగళవారం జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌పై నిషేధాన్ని విధించిన నేపథ్యంలో కంపెనీ వివరణకు ప్రాధాన్యత ఏర్పడింది. కొంతమంది కస్టమర్ల గ్రూప్ కంపెనీ విడుదల చేసిన రుణ నిధులతో వివిధ పబ్లిక్ ఇష్యూలకు బిడ్ చేసినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కాగా రుణాలు ఇవ్వడంతో కొన్ని తీవ్ర లోటుపాట్లు గుర్తించి ఆర్‌బీఐ ఆంక్షలు విధించడంతో ఈ షేరు బుధవారం 11% నష్టపోయి రూ.85 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% క్షీణించి రూ.76.43 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.979 కోట్లు హరించుకుపోయి రూ.8,149 కోట్లకు దిగివచ్చింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-3-2024	
విశాఖ	500-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463-00
విజయవాడ	463-00
రిటైల్ ధర (డజను)	72.00
6-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469-00
వరంగల్	471-00
రిటైల్ ధర	5.30

అన్‌స్టాపబుల్స్

- సెన్సెక్స్ @ 74,000
- 22,450 స్థాయి పైకి నిఫ్టీ
- సరికొత్త శిఖరాలపై సూచీలు
- ఇంట్రాడే, ముగింపుల్లోనూ చరిత్రాత్మక స్థాయిల నమోదు




ముంబై: ఇంట్రాడే నష్టాలు భర్తీ చేసుకొన్న స్టాక్ సూచీలు బుధవారం సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఐటీ, ఫార్మా, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ తొలిసారి 74,000 పాయింట్ల ఎగువన, నిఫ్టీ 22,450 స్థాయిపై ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకొన్న సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. అయితే యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు విశ్వాసాన్నిచ్చింది. మిడ్ సెషన్ నుంచి లార్జ్ క్యాప్ షేర్లలో వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 474 పాయింట్లు బలపడి 74,151 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు పెరిగి 22,497 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. చివరికి దాదాపు ఇంట్రాడే గరిష్టం వద్ద ట్రేడింగ్ ముగించాయి. సెన్సెక్స్ 409 పాయింట్ల లాభంతో 74,086 వద్ద, నిఫ్టీ 118 పాయింట్లు పెరిగి 22,474 వద్ద స్థిరపడ్డాయి. ఇరు సూచీలకు ఇది జీవితకాల గరిష్ట ముగింపు కావడం విశేషం.

– పర్యవేక్షణ లోపాల కారణంగా పసిడి రుణాలు ఇవ్వకూడదంటూ ఆర్‌బీఐ నిషేధం విధించడంతో ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ షేరు రెండోరోజూ మరో 20% క్షీణించింది. ఏడాది కనిష్ట స్థాయి రూ.383 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. గత రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ రూ.8,396 కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.14,603 కోట్లకు దిగివచ్చింది.

2031 నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా భారత్!

- అప్పటికి 7 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భావం
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అంచనా 6.8 శాతం
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2024–25) 6.8 శాతంగా క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అలాగే 2031 నాటికి దేశం ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత స్థాయికి రెట్టింపై దాదాపు 7 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని.. తద్వారా ఎగువ మధ్య–ఆదాయ దేశంగా మారుతుందని క్రిసిల్ ఇండియా అవుట్‌లుక్ నివేదిక పేర్కొంది. నిర్మాణాత్మక సంస్కరణలు తదితర సానుకూల ఆర్థిక నిర్ణయాల వల్ల దేశ ఎకానమీ 2030 నాటికి మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని తెలిపింది. రానున్న ఐదు ఆర్థిక సంవత్సరాల్లో (2024–25 నుంచి 2030–31) భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్ల స్థాయిని దాటి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని పేర్కొంది. ఈ కాలంలో ఎకానమీ సగటును 6.7 శాతం పురోగమిస్తుందని అభిప్రాయపడింది.

ప్రస్తుతం ఐదవ స్థానంలో..

25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకానమీగా కొనసాగుతోంది. ప్రపంచం మొత్తం జీడీపీలో పావు శాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి. కాగా, 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించగా, త్వరలో జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత దేశ ఎకానమీ విలువ 3.6 ట్రిలియన్ డాలర్లు.

4,500 డాలర్లకు తలసరి ఆదాయం..

2031 ఆర్థిక సంవత్సరం భారత్ తలసరి ఆదాయం 4,500 డాలర్లకు పెరుగుతుంది. దీనితో దేశం ఎగువ మధ్య–ఆదాయ దేశాల క్లబ్‌లో ప్రవేశిస్తుంది. ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక సూత్రాల ప్రకారం... తలసరి ఆదాయం 1,036 డాలర్ల నుంచి 4,045 డాలర్ల మధ్య ఉన్న దేశాన్ని దిగువ మధ్య తరగతి ఆదాయ దేశంగా పరిగణిస్తారు. 4046 డాలర్ల నుంచి 12,535 డాలర్ల మధ్య ఆదాయ దేశాలను ఎగువ మధ్య తరగతి ఆదాయ దేశాలుగా పేర్కొంటారు. 12,000 డాలర్ల తలసరి ఆదాయం దాటితే అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది.

తయారీ, సేవల రంగాల్లో మంచి అవకాశాలు...



దేశీయ, ప్రపంచ డిమాండ్‌కు అనుగుణంగా తయారీ- సేవల రంగాలు రెండింటికీ పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. 2025-2031 ఆర్థిక సంవత్సరాల మధ్య తయారీ-సేవల రంగాలు వరుసగా 9.1 శాతం, 6.9 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని మేము అంచనా వేస్తున్నాము. తయారీ రంగం ద్వారా కొంత పెరుగుదల ఉన్నప్పటికీ, సేవా రంగం భారతదేశ వృద్ధికి ప్రధాన చోదక శక్తిగా నిలుస్తుంది.

– ధర్మకీర్తి జోషి, క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్

ఎయిర్‌టెల్ కొత్త స్టోర్ల ప్రారంభం

హైదరాబాద్: భారతీ ఎయిర్‌టెల్ హైదరాబాద్‌లో ఒకేసారి 18 కొత్త స్టోర్లను ప్రారంభించింది. అలాగే విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ఒక్కొక్కటి చొప్పున నూతన స్టోర్లను ప్రారంభించడంతో విజయవాడలో స్టోర్ల సంఖ్య 148, విశాఖలో పదికి చేరుకున్నాయి. ఈ స్టోర్లలో కంపెనీకి సంబంధించిన అన్ని రకాల సేవలను పొందవచ్చని భారతీ ఎయిర్‌టెల్ ఏపీ-తెలంగాణ సీఈవో శివన్ భార్గవ తెలిపారు. దేశవ్యాప్తంగా ఎయిర్‌టెల్ 1,500 స్టోర్లలో సేవలు అందిస్తోంది.

అధిక రేటింగ్ కంపెనీ బోర్డుల్లో మహిళలు

బోర్డు సభ్యులుగా చోటు ● మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ వెల్లడి

న్యూఢిల్లీ: అధిక రేటింగ్ కలిగిన కంపెనీలు.. బోర్డు సభ్యులుగా మహిళలను ఎంపిక చేసుకుంటున్నట్లు రేటింగ్ దిగ్గజం మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ తాజాగా పేర్కొంది. తక్కువస్థాయి రేటింగ్ కలిగిన కంపెనీలతో పోలిస్తే వీటిలో బోర్డు సభ్యులుగా స్త్రీలకు అధికంగా చోటు కల్పిస్తున్నట్లు తెలియజేసింది. సంస్థ రేటింగ్ ఇచ్చిన 3,138 కంపెనీలను విశ్లేషించినట్లు వెల్లడించింది. విశ్లేషణ ప్రకారం ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్(బీబీఏ, అంతకంటే అధిక రేటింగ్) కలిగిన కంపెనీల బోర్డు సీట్లలో సగటున 29 శాతం మంది మహిళలకు చోటు లభించింది. 2023తో పోలిస్తే 1 శాతం పెరిగినట్లు వెల్లడించింది. ఇక స్పెక్యులేటివ్ గ్రేడ్(బీఏ, అంతకంటే తక్కువ రేటింగ్) కంపెనీలలో సగటున 24 % బోర్డు సీట్లను మహిళలు పొందారు. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య యథాతథమే. అభివృద్ధిచెందిన ఆర్థిక వ్యవస్థల్లో బోర్డు సభ్యుల లింగభేదం, క్రెడిట్ రేటింగ్స్ మధ్య పరస్పర సంబంధమున్నప్పటికీ వర్ధమాన మార్కెట్లలో ఇది లేనట్లు మూడీస్ పేర్కొంది. విశ్లేషణకు పరిగణనలోకి తీసుకున్న కంపెనీలలో 24 ఏఏఏ, 146 ఏఏ, 728 ఏ, 1165 బీబీఏ, 582 బీఏ, 394 బీ, 90 సీఏఏ, 9 సీఏ రేటింగ్ కలిగినవి ఉన్నట్లు వెల్లడించింది.



సంవర్ధనలో సుమిటోమో వాటాల విక్రయం

న్యూఢిల్లీ: సంవర్ధన మదర్సన్‌లో జపాన్‌కి చెందిన సుమిటోమో వైరింగ్ సిస్టమ్స్ (ఎస్‌డబ్ల్యూఎస్) 4.4 శాతం వాటాలను రూ. 3,633 కోట్లకు విక్రయించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) డేటా ప్రకారం రూ. 121.03–121.25 ధర శ్రేణిలో సుమిటోమో మొత్తం 30 కోట్ల షేర్లను విక్రయించింది. వాటాల విక్రయంతో సంస్థలో ఎస్‌డబ్ల్యూఎస్ వాటా 14.15 శాతం నుంచి 9.72 శాతానికి తగ్గింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీ, డెహ్రాడూన్‌లో ఎనిమిదో తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ) జనవరి-2024 టర్మ్‌కు సంబంధించి ఎనిమిదో తరగతిలో ప్రవేశాలకు ఏపీకి చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత**:గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 01.01.2025 తేదీ నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
» **వయసు**: 01.01.2025 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి.
» **పరీక్ష విధానం**: రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200), జనరల్ నాలెడ్జ్(75), ఇంగ్లిష్(125) నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50) నిర్వహిస్తారు. రాతపరీక్ష, వైవా వాయిస్ కలిపి మొత్తం 450 మార్కులకు కేటాయించారు.
» **దరఖాస్తు విధానం**: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆర్ఐఎంసీ పంపిన దరఖాస్తు ఫారం నింపి అవసరమైన ధ్రువపత్రాలు జత చేసి అసిస్టెంట్ సెక్రటరీ (ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామాకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది**: 15.04.2024.
» **పరీక్ష తేది**: 01.06.2024.
» **వెబ్‌సైట్**: http://www.rimc.gov.in.

టీఎస్ లాసెట్, పీజీఎల్‌సెట్-2024

ఉస్మానియా యూనివర్సిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి టీఎస్ లాసెట్, తెలంగాణ పీజీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ పీజీఎల్‌సెట్-2024) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షల ద్వారా ఎల్ఎల్‌బీతోపాటు రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **కోర్సులు**: మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులు, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సు.
» **అర్హత**: మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులకు ఏదైనా గ్రాడ్యుయేట్ డిగ్రీ, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియట్, ఎల్ఎల్ఎం కోర్సుకు ఎల్ఎల్‌బీ లేదా బీఎల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష మాధ్యమం**: లాసెట్ ఇంగ్లిష్/తెలుగు, ఇంగ్లిష్/ఉర్దూ,పీజీఎల్‌సెట్ ఇంగ్లిష్ మాధ్యమంలో.
» **దరఖాస్తు విధానం**: ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది**: 15.04.2024.
» **పరీక్ష తేదీ**: 03.06.2024.
» **వెబ్‌సైట్**: https://lawcet.tsche.ac.in

గణితం.. అవకాశాలు ఘనం!

» మ్యాథ్స్ కోర్సులతో విస్తృత కెరీర్ మార్గాలు
» టెక్ నుంచి రీసెర్చ్ వరకు పలు ఉద్యోగాలు
» డేటా అనలిటిక్స్‌లోనూ కీలకంగా మ్యాథ్స్
» ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో యూజీ, పీజీ

గణిత శాస్త్రం..మ్యాథమెటిక్స్.. అంకెలు, సంఖ్యలు, సూత్రాలు, సిద్ధాంతాలు.. ఇలా ఎన్నో క్లిష్టమైన అంశాలతో కూడిన సబ్జెక్ట్! ఒక పట్టాన అంతుపట్టని లెక్కల చిక్కులు!! అందుకే.. అల్జీబ్రా.. గుండె గాబరా.. అని అనుకుంటారు కూడా! కానీ ఇదే గణితంపై కొద్దిగా ఆసక్తి చూపి.. పట్టు సాధిస్తే మాత్రం ఘనమైన కెరీర్ ఖాయం అంటున్నారు నిపుణులు!! స్కూల్ టీచర్ నుంచి యూనివర్సిటీ ప్రొఫెసర్ వరకూ.. అదేవిధంగా టెక్నాలజీ రంగంలో ప్రోగ్రామింగ్ నుంచి ఏఐ నిపుణుడి దాకా అవకాశాలు అనేకం!! ఈ నేపథ్యంలో.. మ్యాథమెటిక్స్ కోర్సులు-కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

నేటి ఏఐ టెక్నాలజీ యుగంలో మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. మ్యాథమెటిక్స్ కాన్సెప్ట్‌లతో ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్, లాజికల్ రీజనింగ్ వంటి నైపుణ్యాలు అలవడుతాయి. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఈ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. మ్యాథమెటిక్స్‌పై పట్టు సాధిస్తే.. టీచింగ్ నుంచి ఐటీ, ఆస్ట్రానమీ, రీసెర్చ్ వరకూ.. అనేక రంగాల్లో అడుగుపెట్టొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

టెక్నాలజీలో మ్యాథ్స్

నేడు ప్రతి రంగంలో టెక్నాలజీ ఆధారిత కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. ఈ టెక్నాలజీలో రాణించాలంటే.. కోడింగ్, ప్రోగ్రామింగ్‌పై పట్టుండాలి. అందుకు మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు ఎంతో కీలకం. మ్యాథమెటిక్స్‌పై అవగాహన అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామింగ్‌కు దోహదం చేస్తుంది. సీ, సీ++, జావా, పైథాన్ వంటి లాంగ్వేజెస్‌లో రాణించాలన్నా.. మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు ఉండాల్సిందే. ప్రోగ్రామర్స్, డెవలపర్స్ మొదలు అప్లికేషన్ విభాగం వరకు.. అన్నింటా మ్యాథమెటిక్స్ స్కిల్స్ అత్యంత ఆవశ్యకంగా మారుతున్నాయి.

డేటా అనలిటిక్స్

డేటా అనలిటిక్స్, డేటా సైన్స్‌తో ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించి.. దాని ఆధారంగా తమ ప్రొడక్ట్స్, సర్వీసెస్‌తో వినియోగదారులను ఆకట్టుకునేందుకు సంస్థలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఇందుకోసం కస్టమర్స్ డేటాపై ప్రధానంగా ఆధారపడుతున్నాయి. ఈ డేటా విశ్లేషణలో మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు కీలకంగా నిలుస్తున్నాయి. వాస్తవానికి డేటాసైన్స్‌కు పునాదిగా మ్యాథమెటిక్స్‌ను పేర్కొనవచ్చు. లీనియర్ అల్జీబ్రా, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్ నైపుణ్యాలతో డేటా అనలిస్ట్‌గా విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుంటుంది.

మూడు కోర్ విభాగాలు

మ్యాథమెటిక్స్‌ను మూడు కోర్ విభాగాలుగా పేర్కొంటున్నారు. అవి..అప్లయిడ్ మ్యాథమెటిక్స్, ప్యూర్ మ్యాథ్స్, మ్యాథమెటికల్ ఫిజిక్స్. అప్లయిడ్ మ్యాథమెటిక్స్ పూర్తిగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ఉండే సబ్జెక్ట్‌గా పేర్కొనొచ్చు. సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో వాస్తవ సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు మార్గంగా నిలుస్తోంది అప్లయిడ్ మ్యాథమెటిక్స్. ఇందులో న్యూమరికల్ మెథడ్స్, అనాలిసిస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ ఉంటాయి. ప్యూర్ మ్యాథ్స్‌లో ఉండే నెంబర్ థియరీ అప్లికేషన్స్ నైపుణ్యాల ద్వారా ఫైనాన్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో అడుగుపెట్టే అవకాశముంది. మ్యాథమెటికల్ ఫిజిక్స్.. క్వాంటమ్ థియరీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి విభాగాల్లో ఎంతో కీలకంగా మారుతోంది. వీరికి సెమీ కండక్టర్ ఇండస్ట్రీ, టెలికం, మెడికల్ టెక్నాలజీ, విద్యుత్ రంగంలో అవకాశాలు లభిస్తున్నాయి.

లెక్చరర్ నుంచి సైంటిస్ట్ వరకూ

- మ్యాథమెటిక్స్‌లో పీహెచ్‌డీ పట్టాతో టాటా ఫండమెంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హరీశ్‌చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఇస్రో, సెంట్రల్ సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఆర్గనైజేషన్, హోమి భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ వంటి సంస్థల్లో సైంటిస్టులుగా కెరీర్ ప్రారంభించొచ్చు. డీఆర్‌డీఓ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలలోనూ మ్యాథమెటిక్స్ పీహెచ్‌డీ ఉత్తీర్ణులకు కొలువులు లభిస్తాయి. అదే విధంగా బోధన విభాగంలో ప్రొఫెసర్ హోదాలను సొంతం చేసుకోవచ్చు.
- మ్యాథమెటిక్స్ పీజీ అర్హతతో జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ రంగంలోనూ పలు కొలువులు అందుబాటులో ఉన్నాయి.
- బ్యాచిలర్ డిగ్రీలో మ్యాథమెటిక్స్‌తోపాటు డేటా అనాలిసిస్, డేటాసైన్స్ వంటి సర్టిఫికేషన్స్ పూర్తి చేసుకుంటే.. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ కొలువు సొంతం చేసుకోవచ్చు.

గణితంతో జాబ్ ప్రొఫైల్స్

- **మ్యాథమెటిక్స్ టీచర్**: బీఎస్సీతోపాటు బీఈడీ పూర్తి చేసుకుంటే పాఠశాల స్థాయిలో మ్యాథమెటిక్స్ టీచర్‌గా అడుగు పెటొచ్చు.
- **ఇన్సూరెన్స్ అండర్ రైటర్**: బీఎఫ్ఎస్ఐ రంగంలో ఇన్సూరెన్స్ విభాగంలో ఆయా పాలసీలు, వాటికి వయో వర్గాల వారీగా నిర్దేశించే వ్యవధి, ప్రీమియంల గురించి విశ్లేషించే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **స్టాటిస్టిషియన్**: పేరుకు స్టాటిస్టిషియన్ అని పేర్కొంటున్నా.. పలు కంపెనీలు, డేటా అనాలిసిస్, డేటా కంపేరిజన్ వంటి విభాగాల్లో స్టాటిస్టిక్స్‌తోపాటు మ్యాథమెటిక్స్ నైపుణ్యాలు కూడా ఉంటేనే నియమించుకుంటున్నాయి.
- **డేటా అనలిస్ట్**: గణితంపై పట్టుంటే..మ్యాథమెటికల్, స్టాటిస్టికల్ టూల్స్ సమ్మేళనంగా ఉండే డేటా అనలిస్ట్ కెరీర్‌లో రాణించొచ్చు. నిర్దేశిత డేటాను విశ్లేషించి.. దాని ఆధారంగా కంపెనీలు తీసుకోవాల్సిన నిర్ణయాలపై నివేదిక ఇవ్వడం డేటా అనలిస్ట్‌ల ప్రధాన విధిగా ఉంటుంది.
- **ఆపరేషన్ రీసెర్చ్ అనలిస్ట్**: వ్యాపార కార్యకలాపాలు, వ్యూహాలకు ఆపరేషనల్ రీసెర్చ్ అనలిస్ట్‌లు ఆవశ్యకంగా మారుతున్నారు. మ్యాథమెటికల్ టెక్నిక్స్‌ను ఉపయోగించి సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ వంటి విభాగాల్లో కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటంలో వీరి సేవలు ఎంతో కీలకం.
- **మ్యాథమెటీషియన్**: పలు వ్యాపారాలు, సాంకేతికతలు, ఖగోళ శాస్త్రం, పర్యావరణ విభాగం, హెల్త్ కేర్ తదితర రంగాల్లో మ్యాథమెటీషియన్ కొలువులు లభిస్తున్నాయి. వీటిలో రోజువారీ కార్యకలాపాల నిర్వహణలో అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లోని అల్గారిథమ్స్, థియరీస్‌ను ఉపయోగిస్తూ అవసరమైన నివేదికలు అందించాల్సి ఉంటుంది.



కెరీర్ గైడెన్స్

- **యాక్చుయరీస్**: బీఎఫ్ఎస్ఐ రంగంలో ఎంతో కీలకమైన యాక్చుయరీ విభాగంలోనూ మ్యాథమెటిక్స్ పీజీ ఉత్తీర్ణులకు యాక్చుయేరియన్ స్పెషలిస్ట్ కొలువులు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఇన్సూరెన్స్ రంగంలో రిస్క్ అనాలిస్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకునే వీలుంది.
- **డేటా సైంటిస్ట్**: ఆయా కంపెనీలకు సంబంధించి అన్ స్ట్రక్చర్డ్ డేటాను క్రమ పద్ధతిలో పొందుపరిచి.. ఆ డేటాను విశ్లేషించడం, వివిధ నమూనాలుగా వర్గీకరించడం, విశ్లేషణ చేయడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **అల్గారిథమ్ ఇంజనీర్స్**: ప్రస్తుత టెక్ యుగంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు, అదే విధంగా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల్లో అల్గారిథమ్ ఇంజనీర్స్‌గానూ అడుగుపెట్టొచ్చు. ఆయా కంపెనీల అల్గారిథమ్స్ ద్వారా డేటాను వినియోగించి.. వాస్తవ పరిస్థితులను విశ్లేషించడం, దానికి సంబంధించిన నివేదికలు ఇవ్వడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **మార్కెట్ రీసెర్చర్స్**: వ్యాపార ప్రపంచంలో కస్టమర్లు, పోటీదారుల డేటాను విశ్లేషించి.. కంపెనీల లక్ష్యాలకు అనుగుణంగా నివేదికలు రూపొందించడం, సర్వేలు నిర్వహించడం, మార్కెట్ ట్రెండ్స్‌ను ఎప్పటికప్పుడు విశ్లేషించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటితోపాటు పలు సంస్థల్లో ఫైనాన్స్, అకౌంటింగ్ విభాగాల్లో సైతం మ్యాథమెటిక్స్ నిపుణులకు అవకాశాలు లభిస్తున్నాయి.

రాష్ట్ర స్థాయి యూనివర్సిటీల్లోనూ

పలు ఎన్ఐటీలు కూడా ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ కోర్సును అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఐఐటీ-జామ్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. బ్యాచిలర్ కోర్సులకు సంబంధించి ఐఐటీల్లో జేఈఈ-అడ్వాన్స్‌డ్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్రాల స్థాయిలోనూ పలు యూనివర్సిటీల్లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

వీటిలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి పీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. పలు సెంట్రల్ యూనివర్సిటీలు కూడా మ్యాథమెటిక్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులను అందిస్తున్నాయి. సీయూఈటీ-యూజీ, పీజీ ఎంట్రన్స్‌లలో స్కోర్ల ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్నాయి.

ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్-కోర్సులు

- **చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్: కోర్సులు**: బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ; ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- **ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్: కోర్సులు**: బీఎస్సీ మ్యాథమెటిక్స్(ఆనర్స్); ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్; పీహెచ్‌డీ (మ్యాథమెటిక్స్). ఈ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే రాత పరీక్షలో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- **ఐఐఎస్సీ-బెంగళూరు**: బీటెక్(మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్)లో జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది.
- **ఐఐటీ-ఖరగ్‌పూర్**: ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌లో ఐఐటీ-జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం పొందొచు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ(మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్)లో జేఈఈ-అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.
- **ఐఐటీ-కాన్పూర్**: మ్యాథమెటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్ సైన్స్‌లో.. బీఎస్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ డ్యూయల్ డిగ్రీలో జేఈఈ-అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌లో ఐఐటీ-జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- **టీఐఎఫ్ఆర్**: ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ఈ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి గేట్, జెస్ట్, సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ స్కోర్లను పరిగణనలోకి తీసుకుంటారు.
- **ఐఐటీ-చెన్నై**: ఎమ్మెస్సీ(మ్యాథమెటిక్స్)లో ఐఐటీ-జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం లభిస్తుంది. ఎంటెక్(ఇండస్ట్రియల్ మ్యాథమెటిక్స్ అండ్ సైంటిఫిక్ కంప్యూటింగ్)లో గేట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.



రాజా-రాధారెడ్డిలకు ఫెలోషిప్ అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము.. చిత్రంలో కిషన్‌రెడ్డి. పురస్కారాలు అందుకుంటున్న ఉషా గాయత్రి, సుధారాణి, సుబ్రహ్మణ్యం, గంగాధర శాస్త్రి, సేతురామ్, పేరిణి ప్రకాష్

కళాకారులకు సంగీత, నాటక అకాడమీ అవార్డులు

ఢిల్లీలో ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
పురస్కార గ్రహీతల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు

సాక్షి, న్యూఢిల్లీ: సంగీత, నృత్య, నాటక రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 94 మంది కళాకారులకు 2022, 2023 సంవత్సరాలకుగాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం ఢిల్లీలో సంగీత నాటక అకాడమీ అవార్డులను అందించారు. అలాగే ప్రముఖ కూచిపూడి నృత్యకారులు రాజా–రాధా రెడ్డిలు సహా ఏడుగురికి 2022–23కుగాను సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ ప్రదానం చేశారు. అకాడమీ అవార్డులు అందుకున్న వారిలో ఏడుగురు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. తెలంగాణలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన పేరిణి ప్రకాష్ పేరిణియాట్టంకుగాను (2023), హైదరాబాద్‌కు చెందిన భాగవతుల సేతురామ్ కూచిపూడి నృత్యానికి (2022) అవార్డు అందుకున్నారు. అలాగే ఏపీలోని గూడూరుకు చెందిన వినుకొండ సుబ్రహ్మణ్యం కర్ణాటక ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ (తవిల్) విభాగం (2022), కర్నూలుకు చెందిన మద్దాలి ఉషా గాయత్రి కూచిపూడి రంగంలో (2023), అవనిగడ్డకు చెందిన ఎల్.వి.గంగాధర శాస్త్రి సుగం సంగీత్‌లో (2023), కర్ణాటక వోకల్ మ్యూజిక్‌లో విశాఖపట్నానికి చెందిన మండా (ఆలమూరు) సుధారాణి (2022) అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభినందించారు.

క్లుప్తంగా...

5 నిమిషాల్లోనే బయాప్సీ ఫలితం!

అందుబాటులోకి తెచ్చిన ఏఐజీ ఆస్పత్రి


సాక్షి, హైదరాబాద్: రోగ నిర్ధారణలో కీలకమైన బయాప్సీ ఫలితాలను ఐదు నిమిషాల్లోనే అందించే 'వివాస్కోప్'అనే అధునాతన సాంకేతిక పరికరాన్ని ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రి తెలిపింది. జీఐ (గ్యాస్ట్రో ఇంటెస్టైనల్) ఎండోస్కోపీ పరీక్షల్లో ఇదో గొప్ప ముందడుగు అని పేర్కొంది. సంప్రదాయ పద్ధతిలో కణజాల నమూనాలను సేకరించి వాటి విశ్లేషణ ఫలితాల కోసం ఐదు రోజులు వేచి ఉండాల్సి వచ్చేదని... వివాస్కోప్‌తో కణజాల బయాప్సీ ఫలితాల సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించగలిగినట్లు ఏఐజీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ లహరి బస్సు చార్జీల్లో 10% రాయితీ

సాక్షి, హైదరాబాద్: లహరి ఏసీ స్లీపర్, ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో బెర్త్‌లపై టీఎస్‌ఆర్టీసీ 10 శాతం రాయితీ ప్రకటించింది. ఏప్రిల్ 30 వరకు ఈ రాయితీ అమల్లో ఉంటుంది. లహరి ఏసీ స్లీపర్ బస్సులు హైదరాబాద్ నుంచి చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, బెంగళూరు రూట్లలో నడుస్తుండగా.. లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ సర్వీసులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, గోదావరిఖని–బెంగళూరు, కరీంనగర్–బెంగళూరు, నిజామాబాద్ –తిరుపతి, నిజామాబాద్ –బెంగళూరు వరంగల్– బెంగళూరు రూట్లలో తిరుగుతున్నాయి.

శ్రీశైలంలో మిగిలిన నీళ్లు మాకే ఇవ్వండి

- కృష్ణాబోర్డుకు తెలంగాణ లేఖ
- రాష్ట్రానికి అత్యవసర తాగునీటి అవసరాలు ఉన్నాయని వివరణ



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో నిల్వ ఉన్న 15.23 టీఎంసీల జలాలను అత్యవసర తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు ఇవ్వాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తీవ్ర కరువు పరిస్థితి ఉన్నా కూడా శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ 51 టీఎంసీలను ఆ రాష్ట్రంలోని కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు తరలించిందని పేర్కొంది. ఇతర నదీ బేసిన్లకు కృష్ణా జలాలను తరలించేందుకు కృష్ణా ట్రిబ్యునల్–1 అనుమతి లేదని గుర్తు చేసింది. ఇకపై శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లు తీసుకోకుండా ఏపీని నిలువరించాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తాజాగా కృష్ణాబోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు.

తాగునీటి అవసరాలు ముఖ్యం

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో శ్రీశైలం జలాశయంలోని నీటి నిల్వలను తాగు అవసరాలకు కేటాయించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఈ లేఖలో కోరారు. గత ఏడాది అక్టోబర్ 6న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్టు గుర్తు చేశారు. అయినా ఏపీ ప్రభుత్వం సాగు అవసరాలకు సైతం నీటిని తరలించుకుందని ఆరోపించారు. కృష్ణా బేసిన్ పరిధిలో తెలంగాణ జనాభా 2 కోట్ల మంది అయితే.. ఏపీ జనాభా 78లక్షల మంది మాత్రమేనని తెలిపారు. 2011 నాటి లెక్కల ప్రకారమే.. తెలంగాణ తాగునీటి అవసరాలకు 46.4 టీఎంసీలు, ఏపీ తాగునీటి అవసరాలకు 18 టీఎంసీలు అవసరమని వివరించారు. కృష్ణా ట్రిబ్యునల్–2కు సమర్పించిన ప్రాజెక్టుల డీపీఆర్‌ల ప్రకారం చూస్తే.. తాగునీటి అవసరాల కోసం ఏపీకి 8.85 టీఎంసీలు, తెలంగాణకి 40 టీఎంసీలు అవసరమని స్పష్టం చేశారు. గత వానాకాలంలో తెలంగాణ వాడుకోకుండా మిగిల్చిన 18.7 టీఎంసీలను ఈ ఏడాది వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కృష్ణా బోర్డును కోరారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలను పణంగా పెట్టి శ్రీశైలం నుంచి చెన్నై తాగునీటి అవసరాలకు 15 టీఎంసీలను కేటాయించాలన్న నిబంధనేదీ లేదన్నారు.

టీవీ5 సాంబశివరావుపై చీటింగ్ కేసు

- సంధ్య హోటల్స్ డీడీతో భార్య పేరిట కారు కొనుగోలు
- గచ్చిబౌలి పీఎస్‌లో సంస్థ అకౌంటెంట్ ఫిర్యాదు
- ఐపీసీ 406, 420 సెక్షన్ల కింద కేసు నమోదు



గచ్చిబౌలి: టీవీ5 సాంబశివరావు చీటింగ్ బాగోతం మరొకటి వెలుగులోకి వచ్చింది. 2019లో సంధ్య కన్‌స్ట్రక్షన్స్‌లో రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేసిన సాంబశివరావు తన వక్రబుద్ధిని ప్రదర్శించినట్లు ఆలస్యంగా బయటపడింది. సంధ్య హోటల్స్ పేరిట కారు కొనుగోలు చేయాలని ఇచ్చిన డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)ని తీసుకొని భార్య పేరిట కారు కొన్నట్లు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో తాజాగా చీటింగ్ కేసు నమోదైంది. సంధ్య హోటల్స్ కోసం ఓ కారు కొనాలని యాజమాన్యం భావించగా డీడీ ఇస్తే తనకున్న పరిచయాలతో త్వరగా కారు ఇప్పిస్తానని నమ్మించిన సాంబశివ రావు... రూ. 9,21,000 డీడీతో ఆయన భార్య విజయదుర్గ పేరిట స్విఫ్ట్ (టీఎస్ 10ఈవీ 3443) కారు కొనుగోలు చేసి తమను మోసగించారంటూ సంధ్య కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ లిమిటెడ్ అకౌంటెంట్ సాంబశివరావు మంగళవారం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వరుణ్ మోటార్స్‌తో కలసి డాక్యు మెంట్లను మార్చి మోసానికి పాల్పడినట్లు ఫిర్యా దులో పేర్కొన్నారు. దీంతో టీవీ5 సాంబశివరావు, ఆయన భార్యపై గచ్చిబౌలి పీఎస్‌లో ఐపీసీ 406, 420, రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మా మంచి మాస్టారూ..

అశ్వారావుపేట: విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలలోని తాగునీటి ట్యాంక్‌ను ఉపాధ్యాయుడే శుభ్రం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మండలం గుర్రాలచెరువు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి ట్యాంక్ అపరిశుభ్రంగా మారింది.దీంతో ట్యాంకును శుభ్రం చేయాలని ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గ్రామ పంచాయతీ సిబ్బందిని కోరగా, అది తమ పని కాదంటూ వారు నిరాకరించారు. దీంతో ఆయనే బుధవారం ట్యాంకులోకి దిగి లోపలంతా శుభ్రం చేశారు.




అమెరికా అధ్యక్ష బరిలో వృద్ధండ పిండాలు అయితే ఏంటి?



అమెరికా అధ్యక్ష ఎన్నికలు మళ్లీ జో బైడెన్ (డెమోక్రాట్), డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్) మధ్యే జరగనున్నాయి అన్న విషయం దాదాపుగా ఖరారైంది. మిగతా సంగతెలా ఉన్నా.. వయసుకు సంబంధించి ఈ ఎన్నికలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇప్పుడు ట్రంప్‌కు 77 ఏళ్లు.. బైడెన్‌కు 81 ఏళ్లు. అమెరికా చరిత్రలో అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న అత్యంత వృద్ధులైన అభ్యర్థులు వీరే కావడం గమనార్హం. అంతేకాదు.. ఒకవేళ బైడెన్ ఎన్నికైతే అత్యంత వృద్ధుడైన అధ్యక్షుడిగా ఇప్పటికే తన పేరిట ఉన్న రికార్డును తిరగరాస్తారు. ఇటు ట్రంప్ గెలిస్తే అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన వృద్ధుల్లో రెండో స్థానంలో నిలుస్తారు. ఏజ్ జస్ట్ ఒక నంబర్ మాత్రమే అనే వాళ్లు అనవచ్చుగానీ అమెరికన్ల దృష్టిలో మాత్రం కాదట. ఇటీవల ది న్యూయార్క్ టైమ్స్, సియనా కాలేజీ నిర్వహించిన పోల్‌లో ఈ విషయం వెల్లడైంది. ముఖ్యంగా బైడెన్ వయసు, మతిమరుపు తదితరాలు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ విషయంపై తమ సొంత పార్టీ మద్దతుదారులు (ఓటర్లు) కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారట. బైడెన్ స్థాయిలో కాకున్నా ట్రంప్ విషయంలోనూ ప్రజలు కొంత ఇదే అభిప్రాయంతో ఉన్నారట. సమర్థ అధ్యక్షుడిలా వ్యవహరించేందుకు బైడెన్ మరీ వృద్ధుడైపోయాడని 73 శాతం మంది రిజిస్టర్డ్ ఓటర్లు అభిప్రాయపడగా ట్రంప్‌కు వయసు అడ్డంకిగా మారిందని 42 శాతం మంది అభిప్రాయపడ్డారు.

– సాక్షి, సెంట్రల్ డెస్క్



'భద్రాచలం' అభివృద్ధికి ప్రణాళిక రూపొందించండి

ఆలయ అభివృద్ధి సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం ఆలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో రావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. తగిన ప్రణాళికతో వస్తే ప్రభుత్వం నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉందని వారు హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలో మంత్రులు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు, ఈ నెల 11న సీఎం పర్యటన నేపథ్యంలో సమీక్ష నిర్వహించారు. దేవాలయం చుట్టూ రెండు ప్రాకారాలు, రోడ్డు నిర్మాణానికి అధికారుల వద్ద ఉన్న ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. ఇంజనీరింగ్, రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. శ్రీరామనవమి, పట్టాభిషేకం, ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులను మంత్రులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.